: fb.com/vaartha Digital
epaper.vaartha.com
WWW.VAARTHA.COM
గుంటూరు
Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

తెలుగు జాతీయ దినపత్రిక


# వార్త

26-7-2026
ఆదివారం సంపుటి: 32
సంచిక: 176 పేజీలు: 12 వెల: 8.00


కేంద్రమంత్రి రాజీనామాతో శనివారం న్యూఢిల్లీలో హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న సిజెపి చీఫ్ అభిజిత్, విద్యార్థులు

## కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్

# రాజీనామా



### పదిరోజుల పరిణామాలు ఎంతో బాధించాయి..

### వ్యక్తిగత ప్రతిష్టకంటే యువత భవిష్యత్తే ముఖ్యం: ధర్మేంద్ర

**న్యూఢిల్లీ,జులై 25:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను ఎక్స్‌లో పోస్టు చేశారు. లేఖలో తన రాజీనామాకు గల కారణాలను సోదాహరణంగా వివరించారు. గత 10 రోజుల నుంచి జరుగుతున్న పరిణామాలు తనను ఎంతో బాధకు గురి చేసినట్లు మంత్రి ప్రధాన్ పేర్కొన్నారు. ఇది నా వ్యక్తిగత ప్రతిష్టకు చెందిన విషయం కాదు అని అన్నారు. భారత యువశక్తియే ఈ దేశానికి అసలైన శక్తి అనిఅన్నారు. దేశ యువ శక్తిని భ్రమలో పడకుండా చూస్తానన్నారు. ఇదే తన సంకల్పం అని మంత్రి పేర్కొన్నారు. జంతర్ మంతర్ కానీ, ఇతర ప్రదేశాల్లో జరిగిన సంఘటనలతో దేశ >>2

రాజధాని ఢిల్లీలో విద్యార్థుల నిరసనలు సద్దుమణిగాయి. ప్రధాన డిమాండ్ అయిన విద్యామంత్రి ధర్మేంద్ర రాజీనామాతో ఆందోళనలు విరమిస్తున్నట్లు సిజెపి ప్రకటించింది. మరికొన్ని డిమాండ్లకు కూడా కేంద్రం సమ్మతించింది. ఢిల్లీలోని జంతర్‌మంతర్ నుంచి విద్యార్థులందరు స్వస్థలాలకు పయనం కావడంతో పది రోజుల తర్వాత ప్రశాంతత ఏర్పడింది.

### తాత్కాలిక విద్యామంత్రిగా ప్రహ్లాద్ జోషికి అదనపు బాధ్యతలు 2లో

## జంతర్‌మంతర్‌కు

# గుడ్‌బై

### మంత్రి రాజీనామాతో సిజెపిలో సంబరాలు

### ఆందోళన విరమించి స్వస్థలాలకు వెళ్తున్న విద్యార్థులు

**న్యూఢిల్లీ,జులై 25:** కాక్రోచ్ జనతాపార్టీ నిర్వహించిననిరవధిక ఆందోళనలతో కేంద్రం దిగివచ్చింది. కేంద్రమంత్రి దర్మేంద్రప్రధాన్ రాజీనామాతో నిరసనలు సద్దుమణుగుతున్నాయి. ఇప్పటివరకూ నిరసనలతో హోరెత్తిన ఢిల్లీ ఇప్పుడు విద్యార్థుల సంబరాలతో నిండిపోయింది. నీట్ పరీక్షా పేపర్ల లీక్ తదనంతర పరిణామాలతో విద్యార్థులు రోడ్డెక్కారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోసం తొలి నుంచి డిమాండ్ చేస్తున్నారు. గత వారం రోజులుగా ఢిల్లీ కేంద్రంగా పెద్ద సంఖ్యలో విద్యార్థులు నిరసనలో పాల్గొన్నారు. ఛలో పార్లమెంట్ ఉద్రిక్తంగా మారింది. ప్రధాని మోడీ స్వయంగా విద్యార్థులకు హామీ ఇచ్చారు. పరీక్షా పత్రాల లీక్ చేస్తే కఠిన చర్యలు తప్పవని చొత్త చట్టం తీసుకొచ్చారు. విద్యార్థుల భవిష్యత్ తమకు ముఖ్యమని ప్రధాని >>2


శనివారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రులు నడ్డా, జితేంద్రతో చర్చలు జరుపుతున్న సిజెపి ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్

# చర్చలు సానుకూలం

### కేసులు ఎత్తివేత, ఆత్మహత్య చేసుకొన్న విద్యార్థులకు పరిహారం

### ఎఫ్ఐఆర్ కాపీలు కూడా సిజెపికి

### భవిష్యత్తులో వేధింపులు ఉండవని హామీ

### సిజెపి ప్రతినిధులతో చర్చలు జరిపిన కేంద్రమంత్రులు నడ్డా, జితేంద్ర

**న్యూఢిల్లీ,జులై 25:** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై శనివారం కేంద్రం, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) మధ్య జరిగిన చర్చలు ఎట్టకేలకు సఫలమయ్యాయి. సిజెపి డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది.విద్యార్థులపై పెట్టిన కేసులను క్రమంగా ఎత్తివేస్తామని కేంద్ర మంత్రి జెపి నడ్డా ప్రకటించారు. న్యూఢిల్లీతోపాటు ఇతర రాష్ట్రాల్లో నమోదైన కేసులు ఎత్తివేస్తామని, భవిష్యత్తులోనూ ఎవరినీ కేసులతో వేధించబోమని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు పరిహారంపై చర్చించామని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగాఉంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో పరీక్షల నిర్వహణ విషయంలో సిజెపితో చర్చిస్తామని వెల్లడించారు.ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషనల్ క్లబ్‌లో కేంద్రం, సిజెపి మధ్య జరిగిన మూడో విడతచర్చల్లో కేంద్రమంత్రులు జెపి నడ్డా, జితేంద్రసింగ్, సిజెపి ప్రతినిధులు సౌరవ్‌దాస్, అశుతోష్ రంకాపాల్గొన్నారు. సుదీర్ఘ చర్చలఅనంతరం సమావేశ వివరాలను సంయుక్తంగా మీడియాకు వెల్లడించారు. ప్రధానంగా నాలుగు అంశాలు మాత్రమే >>2


శనివారం ఆసుపత్రినుంచి విక్టరీ సింబల్ చూపుతున్న వాంగ్ చుక్

### ప్రజాస్వామ్య విజయం: వాంగ్‌చుక్

**న్యూఢిల్లీ,జులై 25:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ తొలిసారిగా స్పందించారు. ఇది ప్రజాస్వామ్య విజయం అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. జూన్ 28న కాక్‌రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసనకు మద్దతుగా సోనం వాంగ్‌చుక్ నిరాహార దీక్ష ప్రారంభించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చ, నిరసన >>2

## విద్యావ్యవస్థ పునర్నిర్మాణానికి

# ఇది ముందడుగు

### ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలి: రాహుల్



**న్యూఢిల్లీ,జులై 25:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. 'ఇది కేవలం ప్రతీకాత్మకమైన రాజీనామా అయినప్పటికీ దేశ విద్యా వ్యవస్థ పునర్నిర్మాణానికి కీలక అడుగుగా అభివర్ణించారు. విద్యార్థులపై బలప్రయోగానికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకో వాలని, ప్రధాని నరేంద్ర మోడీ విద్యార్థులకు బహిరం గంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం విడుదల చేసిన వీడియో సందేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీ నామా దేశ విద్యా వ్యవస్థ పునర్నిర్మా ణంలో ఒక పెద్ద అడుగు. ఆయన ఒక ప్రతీక మాత్రమే. అందుకే ఇది ప్రతీకా త్మక నిర్ణయమే అయినప్పటికీ చాలా ముఖ్యమైనది' అని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు విద్యార్థుల నిరంతర ఆందోళనలే కారణమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, దేశ భవిష్యత్తు, రాజ్యాం గ పరిరక్షణ >>2

# డ్రోన్లతో సీడ్‌బాల్స్



### లోయ ప్రాంతాల్లో వేయి ఎకరాల్లో వెదజల్లుతున్నాం: డి.సిఎం పవన్

### 30వేల హెక్టార్లలో నిర్ణీతకాలంలో పూర్తి

**విజయవాడ,జులై24,ప్రభాతవార్తప్రతినిధి:** వర్షపాతం, నేలలో తేమ వంటి వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలన చేసుకుంటూ రాష్ట్ర వ్యాప్తంగా సీడ్ బాల్స్ పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని అటవీ పర్యావరణ శాఖల మంత్రిత్వశాఖలను నిర్వహిస్తున్న రాష్ట్ర డీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అడవులు క్షీణించిన ప్రాంతాల్లో సీడ్ బాల్స్ జారవిడిచే కార్యక్రమాన్ని వేగవంతం చేసేందుకు మరిన్ని డ్రోన్ల సహాయం తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో అటవీ పునరుద్ధరణ, 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యాల్లో సీడ్‌బాల్స్ పంపిణీ కార్యక్రమం అత్యంత కీలక ప్రక్రియ అని తెలిపారు. జిల్లాల వారీగా సీడ్ బాల్స్ పంపిణీ, వెదజల్లే కార్యక్రమం, డ్రోన్ సాంకేతికత వినియోగంపై అటవీశాఖ ఉన్నతాధికారులతో శనివారం మధ్యాహ్నం సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు ఎన్ని ఎకరాల్లో సీడ్ బాల్స్ వెదజల్లే ప్రక్రియ పూర్తయ్యింది? డ్రోన్ల సాయంతో ఎంత విస్తీర్ణంలో సీడ్ బాల్స్ జారవిడిచారు?తదుపరి లక్ష్యాలు తదితర అంశాలను ఈసందర్భంగా అధికారులు పవన్ కళ్యాణ్ కి వివరించారు.ఉపముఖ్యమంత్రి >>2

# 'వేదవతి'ని పూర్తి చేస్తా



శనివారం ఆలూరులో జరిగిన సంజీవిని కార్యక్రమంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు

### ఆలూరు ప్రజల రుణం తీర్చుకుంటా

### కర్నూలు నుంచి బళ్లారి దాకా హైవే

### సీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతా: సంజీవని ప్రాజెక్టు కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

**ఆస్పరి, జులై 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రాయలసీమ ప్రాంతాన్ని రతనాలసీమగా మారుస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. శనివారం ఆలూరు టిడిపి ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి అధ్యక్షతన మండల కేంద్రమైన ఆస్పరిలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో సంజీవిని పైలెట్ 6వ విడత ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు వేదవతి ప్రాజెక్టును నేనే ప్రారంభించాను నేనే పూర్తి చేసి ఆలూరు నియోజకవర్గం ప్రజల రుణం తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. వేదవతి ప్రాజెక్టు హంద్రీనీవా నగరడోన,రిజర్వాయర్లను 36 కోట్ల తోపూర్తి చేస్తామన్నారు. ప్రాజెక్టులను 35 వేల కోట్లతో నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే నియోజకవర్గంలో రహదారులను బాగు చేస్తామన్నారు. కర్నూల్ నుంచి బళ్లారి వరకు హైవే మంజూరు చేస్తామన్నారు. పోలవరం ప్రాజె క్టును 2027మార్చి నాటికి జాతికి అంకితం చేస్తా మన్నారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చి దిద్దుతామన్నారు. జోహారపురం గ్రామంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం కోసం 7కోట్లు మంజూరు చేస్తామని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను అందిస్తున్నామన్నారు. సంక్షేమం నుంచి సౌర విద్యుత్ వరకు ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తునదన్నారు. ప్రజారోగ్యంతో పాటు సంక్షేమానికీ సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని సీఎం చెప్పారు. ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లు అందిస్తూ పేదలకు ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు రూ.20 వేల సాయం అందిస్తున్నామని తెలిపారు.తల్లికి వందనం ద్వారా ప్రతి విద్యార్థికి మద్దతు, స్త్రీశక్తిద్వారా మహిళల >>2



### టమాటా ధరలపై తప్పుడు ప్రచారం

# నమ్మొద్దు

### మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,జులై 25,ప్రభాతవార్తప్రతినిధి:** టమాటా ధరలపై వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా రైతులకు కిలోకు కేవలం రూ.2 మాత్రమే లభిస్తోందంటూ వైసిపి పార్టీ తప్పుడు ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. వాస్తవాలను వక్రీకరించి రైతులను అయోమయానికి గురిచేసేలా ప్రచారం చేయడం సరికాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో టమాటా సగటు ధర కిలోకు రూ. 10.55గా ఉందని, అన్నమయ్య జిల్లాలో రూ.10.58, మదనపల్లె మార్కెట్‌లో రూ.11గా ధర నమోదవుతోందని మంత్రి తెలిపారు.నిన్నటి >>2



# మంచి నీటి అవసరాలకే పులిచింతల, పట్టిసీమ

### మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ,జులై25,ప్రభాతవార్తప్రతినిధి:**రాష్ట్రంలో రైతుల ప్రయోజనాలను రక్షించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పరిపూర్ణ సమ న్వయంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆదేశించారు. గోదావరి, కృష్ణా డెల్టాల ఇరిగేషన్ సీఈలు, ఎస్ఈలతో శనివారం నిర్వహించిన ఉన్నత స్థాయి టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం, క్లిష్టమైన నీటి కొరత దృష్ట్యా ఇరిగేషన్ శాఖలోని పైస్థాయి నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు అందరి సెలవులను రద్దు చేస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు.పుష్కర కాలువ, ఏలేరు వ్యవస్థ ద్వారా తూర్పుగోదావరి, కాకినాడ, విశాఖ జిల్లాల్లో దాదాపు 55 లక్షల మందికి మంచితాగునీరు అందించాల్సి ఉందన్నారు. అందుకే ఈ నీటిని మంచినీటికి, ఆరుతడి పంటలకే వినియోగించాలని సూచించారు. సీలేరు జలాలను గోదావరి డెల్టా ఖరీఫ్ అవసరాల కోసం వాడుతున్నామన్నారు. మెరక ప్రాంత రైతులు కూడా ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అలాగే గోదావరి ప్రధాన కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు >>2

# 'కల్తీనెయ్యి'పై మరింత లోతుగా దర్యాప్తు



### ఫ్యాక్టరీస్, బాయిలర్స్ విభాగం అధికారులతో విచారణ


### మూడు నెలల్లో నివేదిక రెడీ

### పలువురు అధికారులపై ఇప్పటికే చర్యలు

**తిరుమల,జులై 25ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూప్రసాదం తయారీకి కల్తీనెయ్యి సరఫరా చేసిన ఉదంతంలో బాధ్యులైన అధికారులపై చర్యలకు ప్రభుత్వం సిద్ధమైంది. గత రెండునెలలుగా స్తబ్ధుగా ఉన్న ఈ కేసులో తాజాగా ప్రభుత్వం అక్రమార్కులపై దర్యాప్తుకు ఫ్యాక్టరీస్, బాయిలర్స్ విభాగం అధికారులపై విచారణకు ఆదేశించడంతో మళ్ళీ అక్రమార్కుల్లో గుబులురేకెత్తిస్తోంది. ఈ వివాదంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు వారివారి వాంగ్మూలాలతో సమర్పించిన రాతపూర్వక సమాధానాలపై విచారణ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు రాష్ట్ర బాయిలర్స్ డైరెక్టర్ బి.ఉమామహేశ్వరరావును,ప్రజంటింగ్ అదికారిగా ఫ్యాక్టరీస్ డైరెక్టర్ కార్యాలయం చీఫ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావులను నియమించింది. రానున్న మూడునెలల కాలంలో ఈ అధికారులు విచారణ పూర్తిచేసి తదుపరి నివేదికలను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంది. ఇప్పటికే పలు డెయిరీలకు సంబంధించిన ఈ విభాగం అధికారులపై చర్యలు తీసుకున్న విషయం విదితమే. గతంలోనే తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో రెండేళ్ళపాటు లోతుగా కొనసాగిన దర్యాప్తు,విచారణ నివేదికలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి. దాదాపు 70లక్షలకిలోల నెయ్యి కల్తీ టిటిడికి తిరుమలకు చేరిందని, దాదాపు 300కోట్ల రూపాయలు పైమాటే ఆర్థిక లావాదేవీలు జరిగాయనేది ప్రధాన ఆరోపణలు . ఆ దిశగా దర్యాప్తుకు సిబిఐ అధికారులతో, ఆహారభద్రత విభాగం అధికారులతో ,రాష్ట్రపోలీస్ అధికారులతో సిట్ బృందాన్ని నియమించి ఏకంగా ఏడాదిన్నరకాలంపైగా లోతుగా అన్ని కోణాల్లో విచారణ చేసి నివేదికలు రూపొందించారు. పలువురు కాంట్రాక్టర్లను, నెయ్యిసరఫరా చేసిన సంస్థల యాజమాన్యాన్ని, ప్రతినిధులను విచారణ చేసింది. అందులో తప్పిదాలు జరిగాయని తేల్చి గతంలో పనిచేసిన టిటిడి ఉన్నతాధికారులు, మార్కెటింగ్ కొనుగోళ్ళ విభాగాల జిఎంలు, మేనేజర్లను దోషులుగా తేల్చింది. నివేదికల ఆధారంగా అసలు దోషులను తేల్చి వారిపై చట్టప్రకారం చర్యలకు ఉపక్రమించేందుకు రాష్ట్రప్రభుత్వం విశ్రాంత >>2

## రాష్ట్రంలో మొత్తం ఓటర్లు 4,16,27,694

### సిఇఒ వివేక్ యాదవ్ వెల్లడి



**విజయవాడ,జూలై25,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 4,16,27,694గా నమోదైందని రాష్ట్రఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) వివేక్ యాదవ్ వెల్లడించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ(సర్) ప్రక్రియలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఓటర్ల వివరాలను ఆయన అధికారికంగా ప్రకటించారు.అత్యధికంగా 44,89,488 మంది ఓటర్లకు సరైన అడ్రస్ లేదని సీఈఓ తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 15,22,174మంది ఓటర్లు మరణించినట్లు వెల్లడించారు. అలాగే, 14,43,886 మంది ఓటర్లు మరో చోటుకు బదిలీ అయ్యారని, ఇతర ప్రాంతాల్లో కొత్తగా నమోదైన ఓటర్ల సంఖ్య 7,37,216గా ఉందన్నారు. ఆచూకీ లభించని ఓటర్ల సంఖ్య 7,77,885 గా తేలిందని సీఈఓ తెలిపారు. అలాగే ఇతర కేటగిరీల కింద మరో 8,327 మంది ఓటర్లు ఉన్నారని వివేక్ యాదవ్ వివరించారు. అర్హులైన వారు మళ్లీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశాన్ని కల్పిస్తోందన్నారు. ఈ నెల 31 నుంచి ఆగస్టు 30 వరకు సరైన డాక్యుమెంట్లను చూపించి, మరలా ఓటర్‌గా నమోదు చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నట్లు సిఇఒ ప్రకటించారు.



డ్రోన్లతో విత్తనబంతులు వెదజల్లుతున్న దృశ్యం

# డ్రోన్లతో సీడ్‌బాల్స్

>> ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 3 కోట్లకు పైగా సీడ్ బాల్స్ సిద్ధం చేయగా, ఇప్పటి వరకు 63 లక్షలకు పైగా సీడ్ బాల్స్ దాదాపు 6,500 హెక్టార్ల విస్తీర్ణంలో వెదజల్లే ప్రక్రియ పూర్తి చేసినట్టు అధికారులు తెలిపారు. అందులో మానవ వనరుల సాయంతో సుమారు 6 వేల హెక్టార్ల పరిధిలో 59 లక్షల సీడ్ బాల్స్ వెదజల్లినట్టు, మొట్టమొదటి సారి డ్రోన్ల సాయంతో అడవుల్లో లోయ ప్రాంతాలకి వెళ్లి సీడ్ బాల్స్ జారవిడిచినట్టు వివరించారు. సుమారు వెయ్యి ఎకరాల్లో డ్రోన్స్ ద్వారా సీడ్ బాల్స్ జార విడిచినట్లు తెలిపారు. అత్యధికంగా రాజమహేంద్రవరం సర్కిల్ పరిధిలో దాదాపు 28 లక్షల సీడ్ బాల్స్ వెదజల్లగా, అందులో డ్రోన్ సాయంతో 2.26 లక్షలు జారవిడిచినట్టు అధికారులు చెప్పారు. విశాఖ అటవీ డివిజన్‌లో 7.50 లక్షలు, కర్నూలు అటవీ ప్రాంతంలో 8.67 లక్షల సీడ్ బాల్స్ పంపిణీ ప్రక్రియ పూర్తి చేసినట్టు వెల్లడించారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల ఆధారంగా చింతూరు, పీటీ ఆత్మకూరు, గిద్దలూరు, మార్కాపురం, వైఎస్‌ఆర్ కడప డివిజన్లలో డ్రోన్ల ద్వారా సీడ్ బాల్స్ జారవిడిచే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్టు, మానవ వనరులు చేరుకోవడం కష్టంగా ఉండే అటవీ ప్రాంతాలను డ్రోన్ ద్వారా చేరుకోవడం సులభం అవుతుందని చెప్పారు. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఎల్ నినో వల్ల ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు సీడ్ బాల్స్ వెదజల్లే ప్రక్రియకు కొంత మేర ఇబ్బందులు కలిగించవచ్చు. వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో మాత్రం జాప్యానికి తావు లేకుండా సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమాన్ని కొనసాగించాలన్నారు. అవసరం అయితే డ్రోన్ల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ ప్రాంతాల్లో పచ్చదనం తగ్గిన చోట కచ్చితంగా అడవి పునరుద్ధరణ మొదలవ్వాలి. మానవ వనరులతో సీడ్ బాల్స్ వెదజల్లిన ప్రాంతాల్లో మొలకలు వస్తే, వాటిని సంరక్షించడం కోసం తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. 50 శాతం గ్రీన్ కవర్ సాధించాలన్న కూటమి ప్రభుత్వ లక్ష్యాల్లో సీడ్ బాల్స్ వెదజల్లే కార్యక్రమం అత్యంత ప్రధానమైనదని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణలో ఎవరూ అలక్ష ్యంగా ఉండవద్దు. సీడ్ బాల్స్ చల్లి సరిపుచ్చ కుండా, వేడి తీవ్రత ఎక్కువగా ఉండే అవకా శం ఉన్న నేపథ్యంలో మొక్కల పరిరక్షణ బాధ్యతను కూడా స్వీకరించాలన్నారు.

# రైతు ఆత్మహత్య

**అచ్చంపేట, జులై 25 ప్రభాత వార్త:** పల్నాడు జిల్లా పెద్దకూరపాడు నియోజకవర్గం పరిధిలోని అచ్చంపేట మండలం నిండుజర్ల గ్రామానికి చెందిన రైతు కడిమెళ్ల నాగరాజు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం జిల్లాలో తీవ్ర సంచలనానికి దారితీసింది. ఆత్మహత్యకు ముందు నాగరాజు విడుదల చేసిన సెల్ఫీ వీడియోలో "ఈ వీడియోనే నా వాంగ్మూలం" అంటూ తన మరణానికి అచ్చంపేట సీఐ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ సురేష్, గ్రామానికి చెందిన బాగేశ్వరరావుతో పాటు మరికొందరు కారణమని ఆరోపించినట్లు వీడియోలో కనిపిస్తోంది. ఈ వీడియో ప్రస్తుతం పల్నాడు జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, ప్రేమ వ్యవహారానికి సంబంధించిన వివాదంలో నాగరాజు తీవ్ర మనోవేదనకు గురయ్యాడని, న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించినప్పటికీ ఫిర్యాదుపై సరైన చర్యలు తీసుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. అనంతరం మనస్తాపంతో పురుగుల మందు తాగిన నాగరాజు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. నాగరాజు మృతి అనంతరం సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు మృతదేహంతో ఆందోళనకు దిగారు. సెల్ఫీ వీడియోలో చేసిన ఆరోపణలపై వెంటనే నిష్పాక్షిక విచారణ చేపట్టి, విచారణలో ఆరోపణలు నిజమని తేలితే అచ్చంపేట సీఐ శ్రీనివాసరావుతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# పొగాకు రైతులను ఆదుకోవాలి

## సిఎం చంద్రబాబుతో కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అదనపు సెక్రటరీ, డైరెక్టర్ల భేటీ

**విజయవాడ,జులై 25,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని పొగాకు రైతులను ఆదుకోవాలంటూ కేంద్ర ప్రభుత్వంతో సీఎం చంద్రబాబు చేపడుతున్న నిరంతర సంప్రదింపులతో రాష్ట్రంలోని పొగాకు రైతుల సమస్యలపై కేంద్రం దృష్టి సారించింది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ నుంచి ఆ శాఖ అదనపు సెక్రటరీ నితిన్ కుమార్ యాదవ్, డైరెక్టర్ మోనికా గౌర్‌ను రాష్ట్రానికి పంపింది. కర్నూలు జిల్లా పర్యటనకు బయలు దేరే ముందు సీఎం చంద్రబాబుతో వీరు భేటీ అయ్యారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డీబీవీ స్వామి, వ్యవసాయ శాఖ, మార్క్ ఫెడ్ ఉన్నతాధికారులు, టుబాకో బోర్డు ప్రతినిధులు ఈ భేటీలో పాల్గొన్నారు. పొగాకు రైతులను ఆదుకునేలా సిద్ధం చేసిన 3 ప్రతిపాదనలపై సీఎంతో కేంద్ర ప్రతినిధులు చర్చించారు. వడ్డీ లేకుండా వర్కింగ్ క్యాపిటల్ రుణాల జారీ, ప్రోత్సాహకాలు, ధర లోటు భర్తీ వంటి ప్రతిపాదనలను రూపొందించారు. ఈ ప్రతిపాదనలపై పూర్తి స్థాయిలో చర్చించాలని ఏ నిర్ణయం తీసుకున్నా పొగాకు రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

# కుప్పాన్ని ద్రావిడ సిటీగా కేంద్రం ప్రకటించాలి

**కుప్పం, జులై 25 ప్రభాతవార్త:** దక్షిణాది రాష్ట్రాల కూడలి అయిన కుప్పాన్ని కేంద్ర ప్రభుత్వం ద్రావిడ సిటీగా ప్రకటించాలని ద్రావిడ సిటీ మూమెంట్ అధ్యక్షుడు అభిగౌడ పేర్కొన్నారు. శనివారం ద్రవిడ స్నేహ దినోత్సవంలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్రవిడ వర్సిటీ క్యాంపస్‌లో పార్లమెంట్ సెషన్ సమావేశాలు నిర్వహించాలన్నారు.

# 80 ప్రభుత్వాసుపత్రుల్లో కలుషిత నీటి శుద్ధి ప్లాంట్లు: మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,జులై 25,ప్రభాతవార్తప్రతినిధి:** కలుషిత నీటి శుద్ధీకరణ పూర్తిగా చట్టాలు, నియమాలకు అనుగుణంగా జరగాలని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో పరిశుభ్రమైన వాతావరణానికి కీలకమైన ఈ అంశాలపై ఉన్నతాధికారులు, నిపుణులతో శుక్రవారం సాయంత్రం మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ప్రతి ఒక్క బెడ్ (పడకకు) దాదాపు రోజుకు 400 గ్రాముల బయో మెడికల్ వేస్ట్ వస్తుందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో 13 లక్షల కిలోల వ్యర్థాలు వెలువడుతున్నట్లు అంచనా. వీటిని నియమాల మేరకు సమీకరించి, వేరుచేసి, నిర్వీర్యం చేయాల్సి ఉంటుంది. వ్యర్థాల నిర్వహణలో కొన్ని లోపాలు జరుగుతున్నట్లు మంత్రి సత్యకుమార్ యాదవ్ గమనించారు. ఈ వ్యర్థాలను నిర్ణీత సమయంలో ఎప్పటికప్పుడు సేకరించి, వేరుచేసి, నిర్దేశాల ప్రకారం వివిధ రకాల సంచుల్లో రవాణా చేసి తరలించాలని, ఇందుకోసం ఆసపత్రుల వారీగా పటిష్టమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ ప్రక్రియ అంతా సీసీ టీవీల్లో నమోదయ్యేలా చూడాలని, బార్ కోడింగ్ ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. కలుషిత జలాల శుద్ధికి 80 ప్లాంట్లు బోధానాసుపత్రులు, సెకండరీ ఆసుపత్రుల్లో నిర్దేశించిన ప్రమాణాల మేరకు కలుషిత జలాల శుద్ధి జరగకపోవడంపై మంత్రి అసంతృప్తిని వ్యక్తం చేశారు. సెకండరీ ఆసుపత్రుల్లో కేవలం నూజివీడు మరియు బనగానపల్లి ఏరియా ఆసుపత్రుల్లో మాత్రమే కలుషిత నీటి జలాల శుద్ధి ప్లాంట్లు( సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్) ఉన్నట్లు మంత్రి దృష్టికొచ్చింది. 40 బోధన మరియు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో 17 చోట్ల ఎస్‌టీపీలు లేవు. ఈ పరిస్థితి ఆమోదయోగ్యం కాదని, వెంటనే సవరణ చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్(డిఎంఈ) పరిధిలోని 17 బోధన మరియు స్పెషాలిటీ ఆసుపత్రులు, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్(డిఎస్‌హెచ్) పరిధిలోని మొత్తం 54 ఏరియా మరియు 9 జిల్లా ఆసుపత్రుల్లో వెంటనే ఎస్‌టీపీలను ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ 80 ఆసుపత్రుల్లో ఎస్‌టీపీల ఏర్పాటుకు రూ. 83 కోట్లు ఖర్చవుతుందని అధికారులు తెలిపారు. 10 నెలల్లో నిర్మాణాలు పూర్తయ్యేలా ప్రణాళికలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.

# రాష్ట్రంలో పలు జిల్లా జడ్జీల బదలీ

**విజయవాడ,జూలై 25,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ జిల్లాల పరిధిలో పెద్ద సంఖ్యలో జిల్లా జడ్జీలను బదిలీ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం,. పదోన్నతులు పొందిన వారితో కలిపి భారీగానే జిల్లా జడ్జీలకు స్థానచలనం కల్పించినట్లు తెలుస్తోంది. సివిల్ జడ్జీలు (సీనియర్ డివిజన్) నుంచి అదనపు జిల్లా జడ్జీలుగా పదోన్నతి పొందిన వారు కూడా ఈ జాబితాలో ఉన్నారని సమాచారం. పూర్తి పేర్లు మరియు కొత్త స్థానాల వివరాలతో కూడిన అధికారిక బదిలీల జాబితాను ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అధికారిక వెబ్‌సైట్ ద్వారా చూసి తెలుసుకునే అవకాశం కల్పించారు.

# కొత్త విద్యా మంత్రిగా ప్రహ్లాద్‌జోషి



**న్యూఢిల్లీ, జులై 25:** కేంద్ర కొత్త విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్‌జోషి నియమితులయ్యారు. ఈమేరకు ప్రధాని కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం ప్రజాపంపిణీ వ్యవస్థతోపాటు కొత్త, పునరుత్పత్తి ఇంధన మంత్రిత్వ శాఖలను నిర్వహిస్తున్న జోషికి అదనంగా విద్యాశాఖ బాధ్యతలను కూడా మోడీ సర్కారు అప్పగించింది.

**ధర్మేంద్రప్రధాన్ రాజీనామా ఆమోదం**

ఇదిలా ఉండగా మంత్రిపదవికి చేసిన రాజీనామా లేఖను ప్రధాని మోడీకి అందచేయగా ఆ పత్రాన్ని రాష్ట్రపతికి పంపించడంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెనువెంటనే రాజీనామాను ఆమోదించారు. రాజీనామాకు దారితీసిన పరిస్థితులు, తన వ్యక్తిగత ప్రతిష్టకంటే దేశ భవిష్యత్తు,యువత భవిష్యత్తే ముఖ్యమని అయితే దారితీసిన పరిస్థితులు తనను ఎంతో బాధించాయని మంత్రి ప్రధాన్ తన లేఖలో పేర్కొన్న సంగతి తెలిసిందే.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

>> విరోధ శక్తులు బలపడకుండా చూడాలన్నారు. దేశం ఐక్యతతో నిలవాలన్నారు. భారత విద్యార్థుల భవిష్యత్తు దేశ చట్టాలకు బందీ కావొద్దన్నారు. మన పిల్లలు తమ మనసును చదువులపై పెట్టాలని, కెరీర్‌పై ఫోకస్ పెట్టాలని, ఈ విషయంపై ఆలోచనలు చేసి, తన రాజీనామాను ప్రధాని మోడీకి సమర్పించినట్లు మంత్రి ప్రధాన్ పేర్కొన్నారు. ప్రభు జగన్నాథుడి ఆశీస్సులతో భవిష్యత్తులో దేశమాత కోసం సేవ చేస్తానన్నారు. ఒడిశా ప్రజలు, దేశ యువత ఆకాంక్షలను నెరవేర్చేందుకు కృషి చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ మీదకు నాకు నమ్మకం ఉందని, యువత ఆకాంక్షలు, ఆశయాలను గౌరవిస్తున్నానన్నారు. యువత కేవలం భారత దేశ భవిష్యత్తు మాత్రమే కాదు, వాళ్లు వికసిత భారత్‌కు కొత్త వాహకాలు అన్నారు. భవిష్యత్ నిర్మాతలు, శిల్పకారులు అని కూడా యువతే అని పేర్కొన్నారు. మే 3వ తేదీన జరిగిన పరీక్షలో అక్రమాలు జరిగినట్లు తెలియగానే. ఆ కేసును సిబిఐకి అప్పగించామన్నారు. ఆ ఎగ్జామ్‌ను మళ్లీ షెడ్యూల్ చేశామన్నారు. 2027 నుంచి నీట్ యూజీ పరీక్షను కంప్యూటర్ ఆధారిత పరీక్షగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రధాన్ తెలిపారు. సుమారు 20 లక్షల మంది రాసిన నీట్ పరీక్షను స్మూత్‌గా నిర్వహించడమే ప్రాధాన్యతగా ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగం దీనికి సహకరించిందన్నారు. విద్యార్థులు, గార్డియన్లు, పేరెంట్స్ సహకారంతో పరీక్షను జూన్ 21వ తేదీన విజయవంతంగా నిర్వహించినట్లు ప్రధాన్ తెలిపారు. ముందు నుంచి ఈ సంక్షోభానికి బాధ్యతను ఆమోదిస్తున్నట్లు ఆయన చెప్పారు. బాధ్యతల నుంచి తానేమీ పారిపోయేందుకు ప్రయత్నించలేదన్నారు. ఎగ్జామ్ మాఫియా వల్ల మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడడమే తన కర్తవ్యంగా పెట్టుకున్నానన్నారు. ఏ విద్యార్థికి కూడా అన్యాయం జరగకుండ చూశానన్నారు. జూలై 16వ తేదీన రిలీజ్ చేసిన నీట్ యూజీ ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని, ఎంతో మంది మెరిట్ పేద విద్యార్థులు విజయం సాధించినట్లు చెప్పారు. తన లేఖలో కేంద్ర మంత్రులకు, అధికారులకు, విద్యాశాఖ సిబ్బందికి, తనతో పనిచేసిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేశానికి సేవ చేయడమే తన జీవితంలో అత్యధిక ప్రాధాన్యమైందని, దేశ సేవకే అంకితమైనట్లు ఆయన తన లేఖలో చెప్పారు. ప్రధాని మోడీకి రాసిన రాజీనామా లేఖను ప్రభుత్వం ఆమోదించాల్సి ఉంది.

# జంతర్‌మంతర్‌కు గుడ్‌బై

>> మోడీ హామీ ఇచ్చారు. ఆ తరువాత ఎన్టీఏలో ప్రక్షాళన చేసారు. కొత్త పరీక్షా విధానం ప్రకటించారు. కాక్రోచ్ పార్టీ ప్రతినిధులతో చర్చలు చేసారు. అందులో వారి డిమాండ్లకు అంగీకరించారు. అయినా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేస్తేనే నిరసన ఆగుతుందని సిజెపి తేల్చి చెప్పింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో కాక్రోచ్‌పార్టీ ఆందోళన ఫలించింది. ధర్మేంద్ర ప్రధాన్ తన రాజీనామా లేఖలో దేశ యువత భవిష్యత్తు, దేశ ఐక్యతను దృష్టిలో పెట్టుకుని రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోడీకి, కేంద్ర మంత్రివర్గ సహచరులకు కృతజ్ఞతలు తెలిపారు. దేశసేవకు ఎప్పటికీ అంకితభావంతో కొనసాగుతానని లేఖలో స్పష్టం చేసారు. 10 రోజులుగా జరుగుతున్న పరిణామాలు బాధించాయని ఆవేదన వ్యక్తం చేసారు. తాను వ్యక్తిగత భేషజాలకు పోవడం లేదని స్పష్టం చేసారు. యువత భవిష్యత్ కోసమే రాజీనామా చేసినట్లు వెల్లడించారు. దేశ విద్రోహ శక్తులకు అవకాశం ఇవ్వకూడదని పేర్కొన్నారు. యువశక్తే ఈ దేశ అసలైన శక్తిగా ధర్మేంద్ర ప్రధాన్ అభివర్ణించారు. యువత చదువు కోసమే సమయం కేటాయించాలని సూచించారు. జంతర్‌మంతర్ ఇతర నగర వీధుల్లో సిజెపి ప్రతినిధులు సంబరాల్లో మునిగిపోయారు. వీధుల్లోకి వచ్చి డాన్సులు చేయడం కనిపించింది. మరోపక్క రాష్ట్రాల్లో ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబాల్లో వెలుగురేఖలు కనిపించాయి. డిమాండ్లు మొత్తం మూడింటికి అంగీకరించిన కేంద్రం పరిహారం వస్తుందని మరోపక్క, ఇంతకాలానికి నీట్ విద్యార్థులకు న్యాయంజరిగిందని మరోవైపు విద్యార్థుల తల్లితండ్రులు పేర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా కూడా రాష్ట్ర రాజధానుల్లో సిజెపి ప్రతినిధులేకాకుండా వివిధ పార్టీల యువనేతలు కూడా హర్షాతిరేకాలుప్రకటించారు.

**జంతర్‌మంతర్‌ను వీడండి: ఆందోళన విరమణకు పిలుపు**

కాగా డిమాండ్లు పరిష్కారం కావడంతో జంతర్‌మంతర్‌లో మకాం చేసిన విద్యార్థులందరూ ఇక ఇళ్లకు తరలివెళ్లాలని సిజెపినేతలు ప్రకటించారు. కేంద్ర మంత్రి రాజీనామా, ఆత్మహత్యలుచేసుకున్న విద్యార్థి కుటుంబాలకు పరిహారం చెల్లింపుతోపాటు విద్యార్థినేతలపై కేసులు ఎత్తివేసేందుకు మంత్రులు జితేంద్రసింగ్, జెపి నడ్డాలు ప్రభుత్వంతో సంప్రదించి ఆమోదం తెలిపారని అందువల్ల ఇక మన ఉద్యమాన్ని విరమించాలని సిజెపి నేతలు విజ్ఞప్తిచేసారు. జంతర్‌మంతర్ వేదికవద్ద అంబేద్కర్ చిత్రపటాన్ని చేతపట్టుకుని విద్యార్థినేతలు భారీ స్థాయిలో హర్షాతిరేకాలు వ్యక్తంచేసారు.

# చర్చలు సానుకూలం

>> డిమాండ్లుగా ఉన్నాయి. నిరసన కారులపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదని, ఎఫ్ఐఆర్ నమోదు చేయకూడదు, ఒకవేళ ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఉంటే వాటిని ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌కు మంత్రులు అంగీకరించినట్లు తెలిపారు. ఈ కేసులు ఢిల్లీ పోలీసులు నమోదుచేసినా లేదా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడ నమోదైనా సరే ఆ ఎఫ్ఐఆర్ కాపీలను మేం వారికి అందిస్తాం. నిరసనల సమయంలో ఆందోళనకారులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడానికి, వారిపై ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోకుండా ఉండటానికి ప్రభుత్వం అంగీకరించింది. భవిష్యత్తులో కూడా ఆందోళనల నిర్వాహకులు, నిరసనకారులపై ఈ కార్యకలాపాలకు సంబంధించి ఎలాంటి కేసులు నమోదు చేయకూడదని మేము అంగీకరించాం. వారు ప్రస్తావించిన రెండో అంశం పరిహారానికి సంబంధించినది. ఈ పరిహారం చెల్లింపుపై ప్రభుత్వం తన వైఖరిని చాలా స్పష్టంగా తెలియజేసింది. నిబంధనలు లోబడి సాధ్యమైనంత పరిహారాన్ని అందిస్తామని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జెపినడ్డా స్పష్టంచేసారు.

**'ఆందోళనకారులు తిరిగి ఇళ్లకు వెళ్లిపోండి':** చర్చలు సఫలం కావడంతో ఆందోళన విరమిస్తున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది. కేంద్రం తమ డిమాండ్లు నెరవేరుస్తామని మంగళవారం నాటికి స్పష్టత ఇస్తామని ప్రకటించడంతో ఆందోళనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రతినిధులు సౌరవ్‌దాస్, అశుతోశ్ రంకాలు ప్రకటించారు. మరోవైపు, తమ ఐదుసూత్రాల డిమాండ్ల పత్రాన్ని ప్రభుత్వానికి సీజేపీ ప్రతినిధులు సమర్పించారు. నాలుగు వారాల తర్వాత తదుపరి విడత చర్చలు జరపనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై సిజెపి ప్రతినిధి అశుతోశ్ రాంకా మాట్లాడారు. "మేము నీట్ బాధితుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం డిమాండ్ చేశాం. అందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఇది కాకుండా విద్యా, పరీక్షా సంస్కరణల గురించి ప్రస్తావిస్తూ ఐదు సూత్రాల డిమాండ్ల పత్రాన్ని కూడా ప్రభుత్వం ముందు ఉంచాం. ఆ డిమాండ్ల పత్రం గురించి సుమారు నాలుగు వారాల్లో మేం ప్రభుత్వాన్ని మళ్లీ కలుస్తాం. డిమాండ్లకు అంగీకారం లభించింది కాబట్టి నిరసనకారులు వెంటనే తమ ఇళ్లకు తిరిగివెళ్లాలని కోరుతున్నామని అశుతోశ్ పేర్కొన్నారు.



శనివారం ఆలూరులో జరిగిన సిఎం చంద్రబాబు సభకు హాజరైన ప్రజానీకం

# 'వేదవతి'ని పూర్తి చేస్తా

>> సాధికారత, దీపం2.0 ద్వారా గ్యాస్ సబ్సిడీ, ప్రతి ఇంటికీ సౌర విద్యుత్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల్లో గందరగోళం సృష్టించి వివాదాలకు కారణమయ్యారని సీఎం విమర్శించారు. రీసర్వే ద్వారా అన్ని భూ రికార్డులను బ్లాక్‌చైన్ టెక్నాలజీతో భద్రపరుస్తున్నామని తెలిపారు. ప్రతి నెలా 9వ తేదీన పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తూ ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తున్నామని.. వచ్చే ఏడాది మార్చి నాటికి రీసర్వే పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. 2028 నాటికి కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం చెప్పారు. హీరో మోటార్స్, ఎల్‌జీ, దాల్మియా వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయని, రూ.1 లక్ష కోట్ల ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమను ఉద్యాన, పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. కర్నూలు-బళ్లారి రైల్వే లైన్‌కు కేంద్రం ముందుకు రావడం సంతోషకరమన్నారు.

# మంచి నీటి అవసరాలకే పులిచింతల, పట్టిసీమ

>> లేకుండా చూస్తూ, పోలవరం కుడి కాలువ నీరు వృథా కాకుండా కృష్ణా డెల్టాకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కృష్ణా డెల్టా పరిధిలో నాగార్జున సాగర్ నిండకుండానే వరి సాగు చేస్తే ఆ ప్రాంత రైతులు పంట నష్టపోయే ప్రమాదం ఉందని మంత్రి హెచ్చరించారు. ఈ సీజన్‌లో సాగర్‌కు నీళ్లు రాకపోతే 2027 జూన్ వరకు పులిచింతల, పట్టిసీమ నీళ్లను మంచి నీటి అవసరాలకే భద్రపరచుకోవాలని స్పష్టం చేశారు. పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించేందుకు 10 జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డ్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# టమాటా ధరలపై తప్పుడు ప్రచారం నమ్మొద్దు

>> మార్కెట్ ధరలను పరిశీలిస్తే వివిధ మార్కెట్లలో కనిష్టంగా రూ.6 నుంచి గరిష్టంగా రూ.16 వరకు ధరలు ఉన్నాయని వివరించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రవ్యాప్తంగా టమాటా రైతులకు కిలోకు కేవలం రూ.2 మాత్రమే లభిస్తోందని చెప్పడం వాస్తవ విరుద్ధమని అన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు మార్కెట్‌లో సరఫరా, డిమాండ్‌ను సమతుల్యం చేసేందుకు వ్యవసాయ మార్కెటింగ్, ఉద్యాన శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ ఏడాది అధిక దిగుబడుల కారణంగా మార్కెట్లకు టమాటా రాక పెరిగినప్పటికీ, ముందస్తు ప్రణాళికలో భాగంగా సాగు విస్తీర్ణాన్ని క్రమంగా తగ్గించడం, దశలవారీగా నాట్లు వేయించడం వంటి చర్యల ద్వారా ఒకేసారి అధిక సరఫరా ఏర్పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు. జూలై నెలలో మార్కెట్లకు రోజువారీగా సగటున 5,000 నుంచి 5,500 మెట్రిక్ టన్నుల టమాటా రాకలు నమోదవుతున్నాయని, నిన్న వివిధ మార్కెట్లకు సుమారు 6,000 నుంచి 7,000 మెట్రిక్ టన్నుల వరకు రాకలు వచ్చాయని మంత్రి తెలిపారు. 12,225 మెట్రిక్ టన్నుల టమాటా రాకలు నమోదయ్యాయని, రాప్తాడు మార్కెట్‌లో భారీ స్థాయిలో లావాదేవీలు జరిగాయని ప్రచారం చేయడం కూడా వాస్తవాలకు విరుద్ధమని స్పష్టం చేశారు. రాప్తాడు మార్కెట్‌లో టమాటా రాకలే నమోదు కాలేదని తెలిపారు.

గత రెండేళ్లలో మొత్తం సీజన్‌లో టమాటా ధరలు కిలోకు రూ.3 నుంచి రూ.6 మధ్యే ఉన్నాయంటూ చేస్తున్న ప్రచారం కూడా వాస్తవాలను వక్రీకరించేదేనని మంత్రి అన్నారు. 2024, 2025 సంవత్సరాల్లో పలు నెలల్లో టమాటా ధరలు ఈ స్థాయికి మించి గణనీయంగా నమోదయ్యాయని వివరించారు. రైతుల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించి ప్రచారం చేయకుండా, క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం చేపడుతున్న మార్కెట్ జోక్య చర్యల్లో భాగంగా ఈ ఏడాది జూలై 5 నుంచి ఇప్పటివరకు సుమారు 261 టన్నుల టమాటాను సేకరించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. సేకరించిన టమాటాలను రాష్ట్రంలోని రైతు బజార్లలో నో లాస్-నో ప్రాఫిట్ విధానంలో వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు.

# ప్రజాస్వామ్య విజయం: వాంగ్‌చుక్

>> తెలిపిన విద్యార్థులపై ఎలాంటి కేసులు ఉండబోవనే హామీ, నీట్ వివాదం నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అంశాలపై కేంద్రం హామీ ఇవ్వడంతో ఆయన 26 రోజుల నిరాహారదీక్షను గురువారం విరమించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత ఆయన విక్టరీ సింబల్ చూపుతూ ఉన్న ఫోటోను పోస్ట్ చేశారు. వీధుల నుంచే ప్రత్యక్ష ప్రజాస్వామ్యం, ఇది శాంతి, సహనం, పట్టుదల సాధించిన విజయం అని ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. కాక్రోచ్ జనతా పార్టీ, దేశ యువతకు ఆయన అభినందనలు తెలిపారు. భయాన్ని వీడి ఉద్యమంలో పాల్గొన్న ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఇకపై ఉద్యమం జవాబుదారీతనం, విద్యాసంస్కరణల దిశగా ముందుకు సాగుతుందని అన్నారు.

# పునర్నిర్మాణానికి ఇది ముందడుగు

>> కోసం వీధుల్లోకి వచ్చి పోరాడిన ప్రతి విద్యార్థికి అభినందనలు తెలిపారు. వీధుల్లోకి వచ్చి ప్రజాస్వామ్యం కోసం, దేశ భవిష్యత్తు కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడిన ప్రతి విద్యార్థికి నా అభినందనలు. మీపై నాకు గర్వంగా ఉందని అన్నారు. ఈ రాజీనామా రైతులు, కార్మికులు, పేదలు సహా కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రతి వర్గానికి ఒక సందేశమని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం అణచివేతకు గురిచేస్తున్న ప్రతి వర్గం ధైర్యంగా పోరాడితే మార్పు సాధ్యమవుతుందని ఈ పరిణామం నిరూపించింది. దేశ రాజ్యాంగాన్ని బలహీనపరుస్తూ, సంస్థలను తన ఆధీనంలోకి తీసుకుంటున్న ఈ ప్రభుత్వాన్ని ప్రజలు ఎదుర్కోవాలి. అని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం ఇంకా రెండు కీలక డిమాండ్లను నెరవేర్చాల్సి ఉందన్నారు. విద్యార్థులపై లాఠీచార్జ్, కాల్పులు, బలప్రయోగానికి పాల్పడిన అధికారులు, వాటిని ఆదేశించిన వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై చేయి చేసుకున్నవారు, వారిని కొట్టినవారు, కాల్పులకు పాల్పడినవారు, ఈ చర్యలను ప్రణాళికాబద్ధంగా అమలు చేసిన ప్రతి ఒక్కరినీ బాధ్యులుగా నిలబెట్టి శిక్షించాలని కోరారు. దేశ విద్యార్థుల పట్ల గౌరవం చూపిస్తూ ప్రధాని మోడీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ భవిష్యత్తైన విద్యార్థులపై జరిగిన అమానుష దాడులకు ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలి. విద్యార్థులపై జరిగిన దాడులకు ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని పేర్కొన్నారు.

# 'కల్తీనెయ్యి'పై మరింత లోతుగా దర్యాప్తు

>> సిఎస్ దినేశ్‌కుమార్‌ను ఏకసభ్య కమిటీని నియమించింది, ఆయన దాదాపు ఆరునెలలపైగా సిబిఐ సిట్ నివేదికల ఆధారంగా గతంలో పనిచేసిన టిటిడి ఇఒ,జెఇఒలను,మార్కెటింగ్ ,డెయిరీ సంస్థల ప్రతినిధులను విచారణ చేపట్టారు. ఈ రెండు శాఖల నివేదికలు ప్రభుత్వానికి అందాయి. లడ్డూల కల్తీ నెయ్యి కేసులో దేశంలోని 15ప్రాంతాల్లో గతనెలలో గుంటూరు, ఢిల్లీ, ముంబై, రాజ్‌కోట్, డెహ్రాడూన్, రూర్కీ, బికనీర్, అహల్యానగర్, దిండిగల్‌లో ఇడి అధికారుల సోదాలు కూడా చేయడం సంచలనం రేపింది. ఈ కేసులో నిందితులు పోమిల్ జైన్, విపిన్ జైన్, రాజు రాజశేఖరన్, రాజేష్ చావ్డా, అపూర్వ చావ్డా,సుచీంద్ర శాంతారామ్ లాంకే, అజయ్‌కుమార్ సుగంధ్, మహేష్‌కుమార్ రోహిరా, ఆశిష్ అగర్వాల్ తదితరుల నివాసాలు, కార్యాలయాల్లో ఇడి సోదాలు చేసి 60 లక్షల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. **ఫ్యాక్టరీస్ విభాగం కీలకం:** తిరుమలకు నెయ్యి సరఫరా చేసిన కేసులో పునబాకలోని వైష్ణవీడెయిరీ స్పెషాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ నుండి లంచాలు తీసుకున్నారనే ఆరోపణలపై విశ్రాంత డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కర్రి పరమేశ్వరరావుతో బాటు ఏడుమంది అధికారులపై క్రమశిక్షణ చర్యలకు ప్రభుత్వం మేనెలలోనే ఉత్తర్వులిచ్చింది. అప్పట్లో నెల్లూరుజిల్లా ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ శివశం కర్‌రెడ్డి, విశ్రాంత ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ రమేశ్‌బాబు,బాయిలర్స్ డిప్యూటీ చీఫ్ మేడిచర్ల సత్యనారాయణ.నరసింహరాజు.సుష్మ, రాంబాబుపై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. రానున్న రోజుల్లో ఏ అదికారికి నెలవారీ మామూళ్ళు అందాయనేది ఇప్పుడు విచారణకు రానుంది. తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి వెనుక కీలకంగా వ్యవహరించిన పెద్దలను మాత్రం వదలిపెట్టరాదనే నిశ్చయంతో సిబిఐ సిట్ నివేదికలు, ఏకసభ్యకమిటీ నివేదికలను ఆధారంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా ,పోలీస్ బాస్ డిజిపి , న్యాయశాఖ కార్యదర్శి సభ్యులుగా త్రిసభ్యకమిటీ కూడా రావాల్సి ఉంది. అయితే కల్తీనెయ్యి వివాదంలో సిబిఐ సిట్, ఏకసభ్యకమిటీ తేల్చిన అంశాలపై మరింత లోతుగా విచారణ చేపట్టి అసలు దోషులు గుర్తించాలని భావించినా ఇప్పటికీ ఏం తేల్చలేకపోయిందనేది టిటిడి వర్గాల్లో గుప్పుమంటోంది.

## వారం - వర్జ్యం

26-07-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
ద్వాదశి మ.1.57
జ్యేష్ఠ ఉ.7.34
వర్జ్యం : లేదు
దు.సా.4.54-సా.5.46
రాహుకాలం - సా.4.30-6.00

## వారఫలం

**మేషం:** ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. శాస్త్ర, సాంకేతిక విషయాలపై ఆసక్తి చూపుతారు.

**వృషభం:** పురోభివృద్ధిలో కొంత ప్రతికూల పరిస్థితులు చోటుచేసుకుంటాయి. వృత్తిలో స్తబ్ధత నెలకొంటుంది. వాహనసౌఖ్యం.

**మిథునం:** శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. ఇంటర్వ్యూలలో పాల్గొంటారు. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**కర్కాటకం:** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. అంతర్గత రాజకీయాలు కొంత బాధిస్తాయి.

**సింహం:** మనోధైర్యం, ఓర్పు వీడకండి. అన్నీ ప్రతికూలంగా ఉన్నా సంతాన పురోభివృద్ధి బాగుంటుంది. స్పెక్యులేషన్‌కు ఎంత దూరంగాఉంటే అంత మంచిది.

**కన్య :** ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహించి పై అధికారుల ప్రశంసలు పొందుతారు. పెట్టుబడులు సమకూర్చుకుంటారు.

**తుల:** కుటుంబ సమస్యల నుండి బయట పడతారు. సంఘంలో ప్రత్యేక గౌరవం పొందు తారు. ఇంటా బయటా మీదే పైచేయిగా వుంటుంది.

**వృశ్చికం:** వ్యాపారాలలో ప్రోత్సాహం లభిస్తుంది. క్రయవిక్రయాలలో స్వల్ప లాభాలు పొందుతారు. వివాదాలకు దూరంగా వుండండి.

**ధనుస్సు:** కారణంలేని చికాకులు మానసిక ప్రశాంతతకు భంగం కలిగిస్తాయి. ఎంతటి కార్యాన్నైనా పట్టుదలతో సాధిస్తారు.

**మకరం:** చేపట్టిన కార్యక్రమాలలో స్వల్ప ఆటంకాలు కలిగినా ఎట్టకేలకు పూర్తి చేస్తారు. దూర ప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకొంటారు.

**కుంభం:** కార్యాలయంలో పనిభారం పెరిగినప్పటికి సమర్థతతో నిర్వహిస్తారు. ఒకానొక బాధ్యతను పూర్తిచేసి బరువు దించుకుంటారు.

**మీనం:** శాంతము వహించడం వలన అనేక లాభాలు కలుగుతాయి. ఆర్థిక అంశాలు అనుకూలంగా వుంటాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

26-7Pg3exHMNWJQEOLK_26-7Pg3exHMNWJQEOLK.qxd 26/Jul/26 12:07 AM Page 1



# రవాణా రంగంలో ఇ-బస్సుతో నూతన శకం

## 'సింహపురి ఇ-బస్సు డిపో'లో పవర్ రూమ్ ప్రారంభించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి




**విశాఖపట్నం, జులై 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పర్యావరణహిత, ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. శనివారం విశాఖపట్నంలోని సింహపురి ఈబస్సు డిపోలో పవర్ రూమ్‌ను ప్రారంభించి, డిపోలో ఏర్పాటు చేస్తున్న సబ్‌స్టేషన్, ఛార్జింగ్ స్టేషన్ తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తొలి ఏకాదశి రోజున రాష్ట్రంలో మొదటి బస్ పవర్ రూమ్ ప్రారంభం నూతన శకానికి నాంది అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ప్రజా రవాణాను వేగంగా విస్తరిస్తున్నామని తెలిపారు. ప్రధాన మంత్రి ఈబస్సు అద్దె పథకం కింద రాష్ట్రానికి తొలి దశలో 750 ఎలక్ట్రిక్ బస్సులు రానుండగా, అందులో విశాఖపట్నానికి 100 బస్సులు కేటాయించినట్లు చెప్పారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, రాజమండ్రి, గుంటూరు నగరాల్లో దశలవారీగా ఈబస్సులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఏపీఎస్ఆర్టీసీని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని, కూటమి ప్రభుత్వం ఉన్నంతకాలం సంస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం మంత్రిగారిని డిపో కమిటీలు, కార్మికుల సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ అధికారులు, ఇంజినీర్లు, డిపో మేనేజర్లు, ఉద్యోగులు, వివిధ ఆర్టీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# శాప్ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 62యేళ్లకు పెంపు

## రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపి ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించి మరో ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60యేళ్ల నుంచి 62యేళ్లకు పెంచుతూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం 2022 జనవరి 1 నుంచే వర్తింపజేస్తుండటంతో ఇటీవల 60 యేళ్లకు పదవీ విరమణ చేసిన ఎనిమిది మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోనున్నట్లు శాప్ ప్రకటించింది. పభుత్వ ఉద్యోగులతో సమానంగా తమ పదవీ విరమణ వయసును కూడా 62 యేళ్లకు పెంచాలని ప్రభుత్వ రంగ సంస్థలు (పిఎస్‌యు), కార్పొరేషన్లు, సొసైటీలలో పనిచేసే ఉద్యోగులు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నారు. గత ప్రభుత్వం 2022లో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసును 62 యేళ్లకు పెంచినప్పటికీ, ఈ సంస్థలకు మాత్రం వర్తింపజేయలేదు. దీంతో కొందరు ఉద్యోగులు న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో స్పందించిన ప్రస్తుత ప్రభుత్వం, ఇటీవల పిఎస్‌యులు, కార్పొరేషన్లలోని ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 యేళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014లోని షెడ్యూల్ 9, షెడ్యూల్ 10 పరిధిలోకి వచ్చే సంస్థలకు ఈ పెంపు వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయం వల్ల ఖజానాపై పడే ఆర్థిక భారంతో పాటు ఇతర అంశాలపై ప్రభుత్వం క్షుణ్ణంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంది. ఈ ఉత్తర్వుల ప్రకారం ఇప్పటికే 60యేళ్లకు పదవీ విరమణ చేసిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నారు. వారు ఉద్యోగంలో లేని కాలానికి ఎలాంటి జీతభత్యాలు చెల్లించరు. 62యేళ్లు నిండే వరకు వారిని రెగ్యులర్ ఉద్యోగులుగానే పరిగణిస్తారు. ఇటీవల ఏపి ఆర్కైవ్స్ విశ్రాంత డైరెక్టర్ వి.రంగరాజన్‌ను ఇదే విధానంలో తిరిగి విధుల్లోకి తీసుకున్న ప్రభుత్వం, ఇప్పుడు శాప్ ఉద్యోగులకు కూడా ఈ ప్రయోజనాన్ని వర్తింపజేసింది.

# ముత్తుకూరు గేట్ సుందరీకరణ

## ● ఆరణి కందప్ప మేస్త్రి సత్రంలో ఆర్వో ప్లాంట్ ప్రారంభోత్సవ సభలో మంత్రి నారాయణ



**నెల్లూరు(వైద్యం), జులై 25, ప్రభాతవార్త:** నెల్లూరు నగరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దే దిశగా ముత్తుకూరు గేట్ సెంటర్‌లోని సర్వేపల్లి కాలువ వద్దున ఉన్న స్థలాన్ని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ శనివారం పరిశీలించారు. ఆ ప్రాంతాన్ని బ్యూటిఫికేషన్ ద్వారా సుందరీకరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వీఆర్‌సీ మైదానంలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. తర్వాత సంతపేటలోని ఆరణి కందప్ప మేస్త్రి సత్రంలో రూ.3.5 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్రం ఈఓ ఉషారాణి, పాలకమండలి ఛైర్మన్ మహేష్, కమిటీ సభ్యులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ట్రస్ట్ బోర్డు ఛైర్మన్, సభ్యులకు ఐడీ కార్డులు అందజేసిన మంత్రి వారిని సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆరణి కందప్ప మేస్త్రీ వంటి మహనీయుడి పేరుతో నడుస్తున్న సత్రంలో ప్రజలకు ఉపయోగపడే ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సమాజ సేవ లక్ష్యంగా ఆరణి కందప్ప మేస్త్రీ సత్రాన్ని ఏర్పాటు చేయడం ఆయన దాతృత్వానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.14 వేల కోట్లతో మంచినీటి ప్రాజెక్టులు, రూ.28 వేల కోట్లతో జలజీవన్ మిషన్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. వచ్చే రెండేళ్లలో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ అందించడమే లక్ష్యమని, 2029 నాటికి జలజీవన్ మిషన్ పనులను పూర్తి చేస్తామని మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ వెల్లడించారు.

ప్రభుత్వం, ధార్మిక సంస్థలు, సేవా సంస్థలు కలిసి పనిచేస్తే సమాజంలో మరింత మంచి మార్పు తీసుకురావచ్చని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ తాళ్లపాక అనూరాధ, నారాయణ విద్యా సంస్థల జీఎం వేమిరెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి, బీజేపీ నేత కర్నాటి ఆంజనేయరెడ్డి, జనసేన నేత దుగ్గిశెట్టి సుజయ్ బాబు, టీడీపీ నేతలు పుట్టా అజయ్, ధర్మవరపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు అత్యంత ప్రాచీనమైన భాష

## ● మానవ జీవన వికాసం తొలి నాళ్ళ నుంచే తెలుగు అస్తిత్వం ఆరంభమైంది ● తెలుగు మహోత్సవంలో పలువురు వక్తలు


తెలుగు ఉత్సవాల తపాల సంచి ఆవిష్కరణ

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు అత్యంత ప్రాచీనమైన భాషగా పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తెలుగు అత్యంత సరళమైనది. సులభ గ్రాహ్యమైందని వారన్నారు. మానవ జీవన వికాసం తొలి నాళ్ళనుంచే తెలుగు అస్తిత్వం ఆరంభమైందన్నారు. అచ్చతెనుగును వాడుకలోకి తీసుకుని రావడం ద్వారా భాష విశిష్టతను మరింత బలీయంగా ప్రజలకు అవగాహన కలిగించ వచ్చునన్నారు. తెలుగు వారి వారసత్వ సంపదగా నిలిచిన ప్రతి కళను ప్రోత్స హించాలన్నారు. తెలుగు భాషా విశిష్టతను, సాంస్కృతిక వైభవాన్ని భవిష్యత్తు తరాలకు అందించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో తెలుగు మహోత్స వం రెండు రోజుల వేడుకలు విజయవాడ నగరశివారు చారిత్రక ఉండవల్లి గుహల వద్ద శనివాఆరం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఉండవల్లి గుహలల్లో ఉదయం 6.30 ని.లకు ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల గాత్ర విద్యార్థులచే తెలుగు భక్తి, సాహిత్య గీతాలతో ప్రభాతాన్ని ఆహ్వానిస్తూ, గుహల పైభాగంలో సాగే అద్భుతమైన శాస్త్రీయ సంగీత గీతికలతో "సూర్యోదయ సుప్రభాతం" కార్యక్రమం ప్రారంభమైంది. తదుపరి తెలుగు మహోత్స వం ప్రారంభోత్స వ సభకు ముఖ్యఅతిథిగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ గద్దె అనురాధ, ఏపీఎంఎస్ఐడీసీదిది ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాస్, ఏపీ సారసత్వ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా డీసీపీ కె.జి.బి సరిత, తెలుగు సాహిత్య, సంస్కృతి అకాడమీ ఛైర్మన్ ఎండి విల్సన్ (శరత్ చంద్ర) జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభ ఉపన్యాసం చేస్తూ మన మాతృభాష తెలుగు ప్రాచీనతను, శతాబ్దాల సాహిత్య సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత. మారుతున్న కాలంలో యువతలో మాతృభాషాభిమానాన్ని నింపేందుకే చారిత్రక నేపథ్యం ఉన్న ఉండవల్లి గుహల సాక్షిగా ఈ తెలుగు మహోత్స వంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. తెలుగు కళలు, జానపద మూలాలు, లలిత కళలతో భాషా వైభవాన్ని ఒకే వేదికపైకి తీసుకురావడం శుభపరిణామం అని గద్దె అనురాధ పేరొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా భవాని దేవి, మందలపు హైమావతి, తేళ్ల అరుణ, వసుధా రాణి, సుశీలమ్మ, సింహాద్రి జ్యోతిర్మయి మొల్ల సాహిత్యం నుంచి ఓల్గా సాహిత్యం వరకు ప్రతి కోణంలో మహిళలు ఎలా వారి బాటలో పయనించి లక్ష్యాల వైపు పరుగులు తీస్తూ నూతనాన్ని సాహిత్య విలువలను స్త్రీ తన వంతు పాత్రను ఏ విధంగా నిర్వహిస్తుందో ఈ చర్చా వేదిక సాక్షిగా చర్చించడం జరిగింది. ఆకాశవాణి విశ్రాంత సంచాలకురాలు ముంజలూరి కృష్ణకుమారి అమ్మమ్మ కథల ద్వారా పిల్లలకు ఆసక్తిని, ఉత్సాహాన్ని కలిగించే పంచతంత్ర, నీతి కథలను చెప్పడమే కాక పిల్లల చేత సృజనాత్మకంగా కథలను చెప్పించారు.

**గుహల్లో ప్రతిధ్వనించిన కవితాగానం:** తెలుగు మహోత్స వంలో భాగంగా "చెట్టునీడలో చిరుగాలి కవిత్వం" పేరుతో ప్రత్యేకంగా, వినూత్నంగా చెట్టు చుట్టూ ఏర్పాటు చేసిన వేదికపై కవి సమ్మేళనం అందరినీ ఆకట్టుకుంది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ, సాహితీవేత్తలు డా.గుమ్మా సాంబశివరావు, డా. జి.వి.పూర్ణచందు, డా. యం.ప్రభాకర్, వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన కవులు తెలుగుభాష, ప్రకృత, చారిత్రక ప్రదేశాలు వంటి పలు అంశాలపై కలమెత్తారు. కవిగా గానం చేశారు. కవుల గళాల నుండి వెలువడ్డ తెలుగు కవితాగానం ఉండవల్లి గుహల్లో ప్రతిధ్వనించింది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యార్థులకు గడిచిన ఆర్థిక సంవత్సరంలో బకాయిపడ్డ ఫీజులను ప్రభుత్వం రీయింబర్స్‌మెంటు చేసింది. చదువు పూర్తి చేసినప్పటికి ఫీజు బకాయిలతో సర్టిఫికెట్లు పొందలేకపోతున్న విద్యార్థులకు కూటమి ప్రభుత్వం ఊరట కల్పించింది. 2025 -26 విద్యా సంవత్సరంలో ఫైనలియర్ చదివి కోర్సులు పూర్తిచేసిన విద్యార్థుల ఫీజుల విడుదలకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. సుమారు రూ.600 కోట్ల మేర ఫీజులు కాలేజీల ఖాతాలకు జమ అవుతున్నాయి. దీంతో విద్యార్థులకు వెంటనే సర్టిఫికెట్లు అందనున్నాయి. 2025-26 విద్యా సంవత్సరంలో నాలుగు క్వార్టర్ల ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఇంజనీరింగ్, డిగ్రీ, ఇతర కోర్సుల్లో ఫైనలియర్ చదివిన విద్యార్థులకు కాలేజీలు సర్టిఫికెట్లు నిలిపివేశాయి. ఇప్పుడు ఫైనల్ ఇయర్ ఫీజులను విడుదల చేసిన ప్రభుత్వం.. మిగిలిన విద్యార్థులకు దశలవారీగా బకాయిలు విడుదల చేయనుంది.

# ఆ నియోజకవర్గాలకు టిడిపి ఇన్‌చార్జ్‌లు

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** అవనిగడ్డ, విజయవాడ పశ్చిమ నియోజకవర్గాలకు టిడిపి ఇన్‌చార్జ్‌లను ఆ పార్టీ అధిష్టానం నియమించింది. అవనిగడ్డ నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్‌గా విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్‌గా బుద్దా వెంకన్నను నియమించింది. ఈ రెండు నియోజకవర్గంలో కూటమి పక్షానికి చెందిన జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, విజయవాడ పశ్చిమానికి బిజెపి ఎమ్మెల్యే యలమంచలి సత్యనారాయణ (సుజనా చౌదరి) ప్రాతినిధ్యం వహిస్తున్నారు. టిడిపి క్యాడర్‌ను పటిష్టం చేసుకోవడం, ఇతరంశాలను దృష్టిలో ఉంచుకుని ఇక్కడ తెలుగుదేశం ఇన్‌చార్జీలను నియమించారు.




# అంతర్ రాష్ట్ర ఎర్రచందనం దొంగలు అరెస్ట్

## ● రూ.1.5 కోట్ల విలువ చేసే 78 దుంగలు స్వాధీనం ● నిందితులకు సహకరించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

**తిరుపతి(క్రైమ్), జులై 25 ప్రభాతవార్త:** శేషాచలం అడవుల్లోని విలువైన ఎర్రచందనంను దొంగలించే ఇద్దరు అంతర్ రాష్ట్ర ఎర్రచందనం దొంగలను తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు ఆర్ఎస్ఏఎస్‌టిఎఫ్ ఎస్పీ శ్రీనివాసులు అడిషనల్ ఎస్పీ కులశేఖర్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం అరెస్టు చేశారు. కర్ణాటక, హర్యానా, వెస్ట్ బెంగాల్ తదితర రాష్ట్రాలకు తరలిస్తున్న ప్రధాన స్మగ్లింగ్ నెట్‌వర్క్ ను చెందించి నిందితులను అరెస్టు చేశారు. అనంతరం వారి నుండి 1.5 కోట్ల రూ విలువచేసే 78 దొంగలను స్వాధీనం చేసుకున్నారు. వీరికి సహకరించిన ఫారెస్ట్ బీట్ ఆఫీసరును కూడ అరెస్టుచేశారు. టాస్క్‌ఫోర్స్ అధికారుల సమాచారం మేరకు తెల్లవారుజామున టాస్క్‌ఫోర్స్, స్టేట్ ఇంటలిజెన్స్ బృందం అటవీ సిబ్బందికి రాబడిన ఖచ్చితమైన సమాచారంతో కడప జిల్లా, కాశినాయన మండలంలోని జ్యోతిగుడి వరికుంట్ల గ్రామం సమీపంన వాహనములు తనిఖీ చేస్తూ ఉండగా బొలెరో మ్యాక్సీ ట్రక్ వాహనంలో ఇంటి సామాన్లు తరలించే ముసుగులో ఎర్ర చందనం అక్రమ రవాణా చేస్తున్న హర్యానా రాష్ట్రానికి చెందిన సన్నీ, రమేశ్ అను ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా జ్యోతి ఫారెస్ట్ బీట్‌లో పని చేస్తున్న ఎఫ్‌బిఒ మల్లికార్జున్ ఈ ఎర్ర చందనం అక్రమ రవాణా లో ప్రధాన ఎర్ర చందనం స్మగ్లర్లకు సహకరిస్తునట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

# వ్యాసాశ్రమంలో పరిపాలనా లొల్లి

## ముఖం తప్పించిన అధికారులు... సాధువుల అసంతృప్తి

**ఏర్పేడు, జులై 25 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా ఏర్పేడు మండల కేంద్రంలో సుమారు వంద సంవత్సరాల సుధీర్ఘ చరిత్రకల్గిన మళయాళ యతీంద్రులచే స్థాపించబడిన శ్రీ వ్యాసాశ్రమం నేడు వివాదాలకు నిలయంగా మారింది. ఈ ఆశ్రమాన్ని 1926లో మళయాళ యతీంద్రులు స్థాపించారు. ఆయన ఎన్నో సంవత్సరాలు తిరుమలలోని గోగర్భం లో సాధన చేస్తూ ఇక్కడ ఆశ్రమాన్ని స్థాపించారు. ఈ ఆశ్రమం 2005 వరకు ఎంతో చక్కగా సాగింది. తరువాత ప్రస్తుతపీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఇక్కడ కుటుంబ పాలన చోటు చేసుకుందనే విమర్శలు ఆరోపణలు చోటు చేసుకున్నాయి. పీఠాధిపతి సోదరుడు, బంధువుల ఆశ్రమాన్ని ఆక్రమించుకొని కుటుంబపాలనగా మార్చారనే విమర్శలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆశ్రమం వీధికెక్కింది. దాంతో రాష్ట్రంలోని సుమారు వెయ్యి మంది సాధువులు శనివారం ఏర్పేడు మండలంలోని వ్యాసాశ్రమం వద్దకు చేరుకున్నారు.

**మొహం తప్పించిన అధికారులు:** శనివారం ఆశ్రమం వద్ద పరిస్థితిని చూసిన సాధువులు కూడా పోలీసుల దయాదాక్షిణ్యాలతో ప్రవేశించాల్సి వచ్చిందని చంద్రగిరి ఆశ్రమ పీఠాధిపతి స్వస్వరూపానందగిరి స్వామి మీడియా సమావేశంలో మాట్లాడుతూ తాము ఇక్కడ చోటు చేసుకున్న సమస్యను సామరస్యంగా పరిష్కరించుకొనుటకు మొదట జిల్లా కలెక్టర్, ఎస్‌పి, ఆర్‌డిఓలకు విన్నవించగా వారు శనివారం ఇక్కడ చర్చించుటకు ఆహ్వానించారన్నారు. అయితే ఇక్కడకు వచ్చిన తరువాత తమకు కూర్చోటానికి కుర్చీలేదు, కనీసం గాలి ఆడటానికి ఫాన్లు కూడా ఏర్పాటు చేయలేదన్నారు. ఇక ఇక్కడకు వస్తామన్న అధికారులు హాజరు కాకపోగా డియస్‌పి మాత్రం వచ్చారని, ఆయన కూడా తమ కోసం రాలేదని పీఠాధిపతికి సంరక్షణగా వచ్చినట్లు చెప్పటం గమనిస్తే అధికారుల తీరు స్పష్టం అయ్యిందన్నారు. ఆశ్రమం కుటుంబ పాలనగా మారి ధార్మిక విధానాలకు స్వస్తి చెప్పారన్నారు. ఇక్కడ మళయాళ యతీంద్రులు స్థాపించిన ఆశ్రమంలో కన్యాగురుకులం మూసి వేసారు. ప్రజలకోసం ఏర్పాటు చేసిన వైద్యాలయం మూసి వేసారు. ట్రస్టు లేదు. ఇక్కడ భోజన సదుపాయం లేదన్నారు. ఇక వందల గదులున్న ఆశ్రమంలో బీడు పడిందన్నారు. ఇక్కడ సమస్యలపై రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించి భవిష్యత్తు ప్రణాళికను రూపొందించుకుంటామని ప్రకటించారు.


# ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే ఎవరినైనా ఉపేక్షించం

## ● ఆపరేషన్ అరణ్యపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తా ● ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరిక

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని అటవీ పర్యావరణ శాఖలను నిర్వహిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌ను నిరోధించేందుకు మరింత కఠినమైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆపరేషన్ అరణ్యం ద్వారా ఎర్ర చందనం స్మగ్లింగ్ ను ఏ విధంగా అరికడుతున్నదీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని తెలిపారు. శనివారం, కడప జిల్లా అవధూత కాశినాయన మండల పరిధిలోని వరికుంట్ల గ్రామ సమీపంలోని జ్యోతి గుడి వద్ద రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఘటనపై ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం అధికారులతో మాట్లాడారు. ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లతోపాటు వారికి సహకరిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను అరెస్టు చేసిన విషయాన్ని ఉప ముఖ్యమంత్రికు అధికారులు తెలియచేశారు. ఈ ఘటన పూర్వాపరాలను వివరించారు.

శనివారం తెల్లవారు జామున ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం, స్టేట్ ఇంటెలిజెన్స్ బృందానికి అందిన కచ్చితమైన సమాచారం ఆధారంగా వరికుంట్ల గ్రామ సమీపంలో వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా బొలెరో మ్యాక్స్ ట్రక్కులో ఇంటి సామగ్రి ముసుగులో ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న హర్యానాకు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలు, వాహనాన్ని స్వాధీనం చేసుకుని, సన్నీ, రమేష్ అనే ఇద్దరిని అరెస్టు చేసినట్లు వివరించారు.

విచారణలో జ్యోతి ఫారెస్ట్ బీట్‌లో బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మల్లికార్జునుడు అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తున్నట్లు గుర్తించామని, వెంటనే అతడిని కూడా అరెస్టు చేసి విచారిస్తున్నట్టు వెల్లడించారు. బెంగళూరు, హర్యానా, కోల్‌కతా ప్రాంతాల్లో వీరికి సహకరిస్తున్న మరికొందరు ప్రధాన సూత్రధారులను గుర్తించినట్లు తెలిపారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఆ ప్రధాన సూత్రధారులను పట్టుకోవాలని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆదేశించారు. బీట్ ఆఫీసర్ పాత్రపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలన్నారు.



# ఆషాఢం సారె తెచ్చిన భక్తులతో రద్దీ

**ఇంద్రకీలాద్రి, జులై 25 ప్రభాతవార్త:** దుర్గమ్మకి ఆషాఢం సారె తెచ్చిన భక్తజనంతో ఆలయంలో రద్దీ నెలకొంది. శ్రీ కనకదుర్గమ్మని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర, సారెలతో ఇంద్ర కీలాద్రికి 11వ రోజు శనివారం సాయంత్రం 5 గంటల వరకు 48 సారె బృందాలకు చెందిన 18,890 మంది భక్తులు సారె సమర్పణ చేశారు. దుర్గమ్మ దర్శనానంతరం 6వ అంతస్తులోని శ్రీ అమ్మవార్లకు సారెను సమర్పించి పూజాదికాలు నిర్వహించారు.

ధర్మకర్తల మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ ఆధ్వర్యంలో దుర్గమ్మకి శనివారం ఆషాఢ సారె సమర్పించారు. రాజగోపురం వద్ద మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచారణలతో ఇఓ వికె శీనా నాయక్ స్వాగతం పలికి శ్రీ అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లారు. శ్రీఅమ్మవారి దర్శనానంతరం మహామండపం 6వ అంతస్తులో ప్రసాద వితరణ చేశారు.

# బిటెక్ వార్షిక ఫీజు రూ.47 వేలు

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలకు సంబంధించి ఫీజులను ఖరారు చేస్తూ సీఎం చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, బీటెక్ కోర్సుకు కనీస వార్షిక ఫీజును రూ.47 వేలుగా నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఇంజినీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియకు మార్గం సుగమమైంది.

బీటెక్‌తో పాటు బీఆర్క్ మెరైన్ ఇంజినీరింగ్ వంటి ఇతర వృత్తి విద్యా కోర్సులకు కూడా ఫీజుల ను ఖరారు చేసింది. అయితే, అన్ని కాలేజీల్లోనూ ఇదే ఫీజు ఉండదు. ఆయా కాలేజీల్లో ఉన్న మౌలిక సదుపాయాలు, కోర్సు ను బట్టి ఫీజుల నిర్మాణంలో మార్పులు ఉంటాయని తెలుస్తోంది. ఈ కొత్త ఫీజుల విధానం తక్షణమే అమల్లోకి రానుంది. ప్రభుత్వం నిర్ణయించిన ఈ కనీస ఫీజు ఆధారంగా, ఒక్కో కాలేజీకి వేర్వేరుగా ఫీజులు వర్తిస్తాయి. త్వరలో ప్రారంభం కానున్న ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ నాటికి ఫీజుల విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు స్పష్టత ఇవ్వడానికే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# సోములగూడెం ఆశ్రమ పాఠశాలలో ఫుడ్‌పాయిజన్

## 31 మంది విద్యార్థినులకు అస్వస్థత



**చింతూరు, జులై 25 ప్రభాతవార్త:** పోలవరం జిల్లా వర రామచంద్ర పురం మండలం సోములగూడెం ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయి 31 మంది విద్యార్థినులు అస్వస్థకు గురయ్యారు. ఆశ్రమ పాఠశాలలోనే ప్రాథమిక వైద్యం అందించిన తర్వాత శనివారం సాయంత్రం 11మంది విద్యార్థులను చింతూరు ఏరియా ఆసుపత్రికి, మరో పది మందిని కూనవరం సిహెచ్‌సికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. పాఠశాలలోనే వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మిగిలిన 10 మందికి హాస్టల్లోనే అందించిన ప్రాథమిక వైద్యంతో వారి ఆరోగ్యం కుదుటపడింది. విషయం తెలుసుకున్న చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్ చింతూరు ఏరియా ఆసుపత్రిని సందర్శించి విద్యార్థినిలతో మాట్లాడి వారి ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందజేయాలని ఆసుపత్రి వైద్యులకు సూచనలు జారీ చేశారు.

# జెఎన్‌టియుఏకి పూర్వపు విద్యార్థుల చేయూత

## పోస్టల్ స్టాండ్ ఆవిష్కరణలో డిఆర్‌డిఓ మాజీ ఛైర్మన్ జి.సతీష్‌రెడ్డి



**అనంతపురం(సిటీ), జులై 25 ప్రభాతవార్త:** రాబోయే రోజుల్లో ప్రపంచానికే తలమానికంగా జెఎన్‌టియుఏ నిలుస్తుందని మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ సైంటిఫిక్ అడ్వైజర్, డిఆర్‌డిఓ మాజీ ఛైర్మన్ డా.జి.సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. జెఎన్‌టియుఏ 80యేళ్ళ పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని పూర్వపు విద్యార్థుల సహకారంతో రూపొందించిన పోస్టల్ స్టాంప్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిజిస్టర్ ఆఫ్ డిఫెన్స్ సైంటిఫిక్ అడ్వైజర్ సతీష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జెఎన్‌టియుఏ విసి సుదర్శన్ రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, డిఆర్‌ఓ మలోలా, పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ అమర్‌నాథ్, కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డిలతో కలిసి సతీష్ రెడ్డి పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జెఎన్‌టియుఏలో చదివిన ఎందరో విద్యార్థులు నేడు దేశ విదేశాలలో అత్యున్నత స్థాయిలో ఉన్నారన్నారు. జెఎన్‌టియుఏ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచేలా ఇక్కడి అధ్యాపకులు శ్రమిస్తున్నారని, పూర్వపు విద్యార్థులు సైతం తమవంతు తోడ్పాటును అందిస్తామని పేర్కొన్నారు. రీసెర్చ్ ప్రాజెక్టులు, కాన్ఫరెన్స్‌లు నిర్వహించేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

# మరో 10 కరోనా కేసులు నమోదు

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో కరోనా కేసుల సంఖ్య పెరుగుతుంది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ మరో 10 కరోనా కేసులు నమోదు అయ్యాయి. గుంటూరు జిల్లాలో ముగ్గురు, ఎన్టీఆర్ జిల్లాలో ఇద్దరికి పాజిటివ్ వచ్చింది. అలాగే అల్లూరి, ఏలూరు, కృష్ణా, తిరుపతి, విశాఖ జిల్లాల్లో ఒక్కొక్క కేసు నమోదైంది. రాష్ట్రంలో ఇప్పటివరకు 49 కరోనా కేసులు నమోదయ్యాయి. 24 మంది బాధితులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటివరకు 302 మందికి పరీక్షలు నిర్వహించామని వైద్యశాఖ తెలిపింది.

# 'ధర్మేంద్ర రాజీనామా జవాబుదారీతనానికి నిదర్శనం'

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారని, ఇది ఎన్డీఏ ప్రభుత్వంలో జవాబుదారీతనానికి నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ పేర్కొన్నారు. ఇదే నైతికతను ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రదర్శించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్ష నిర్వహణలో తీవ్రమైన అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. "దాదాపు 3.5 లక్షల మంది టీచర్ అభ్యర్థుల భవిష్యత్తును ఫణంగా పెడుతూ, డిఎస్సీ పరీక్ష నిర్వహణలో జరిగిన అంతులేని అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ, రాష్ట్రంలో అదే ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో విద్యా శాఖ మంత్రిగా ఉన్న లోకేశ్ తన పదవికి రాజీనామా చేస్తారా?" అని ఆయన ప్రశ్నించారు. ఈ అంశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరిని కూడా జగన్ ప్రశ్నించారు. "ఎన్డీఏ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే ప్రమాణాలు, విలువలు, జవాబుదారీతనానికి పూర్తిగా పాతర వేస్తూ, సీఎం చంద్రబాబు తన కొడుకు పదవిని కాపాడుకుంటారా?" అని వైసీపీ అధినేత జగన్ నిలదీశారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
VISAKHAPATNAM

RFP Tender Notice No.30/2026-27/CE (GVMC) / SE (East) / EE (East) / GVMC/ Dt: 18-07-2026 (2nd call)

| | | |
|---|---|---|
| 01. No.of Works | : | 1 (One) (RFP Tender) |
| 02. Downloading Starting Date | : | 20-07-2026 @ 10.00 PM |
| 03. Downloading End Date | : | 04-08-2026 @ 04.00 PM |
| 04. Last date for Submission of bid | : | 04-08-2026 @ 05.00 PM |

Further details at http://www.apeprocurement.gov.in
O/o The Executive Engineer (East) Division Sd/- Commissioner, GVMC

# పేపర్ లీకేజీలలో ప్రభుత్వాల అలసత్వాలు..

ఈ ఏడాది మే 3న నిర్వహించిన నీట్ ప్రశ్నాపత్రం లీకు కావడంతో.. పరీక్షను తిరిగి జూన్ 21న నిర్వహించారు. ఈసారి జరిగిన పేపర్ లీకేజీపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు జరిగాయి. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ దగ్గర విద్యార్థులు ఆందోళన చేశారు. రెండోసారి నాలుగు రోజుల క్రితం సైతం జంతర్‌మంతర్ దగ్గర జరిగిన నిరసనలో పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం చేయడంతో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. పోలీసులు వ్యవహరించిన తీరుతో విద్యార్థులుసైతం పోలీసులపై దాడి చేసిన సంఘటనలు జరిగాయి. నీట్ పేపర్ లీకేజీలో ప్రధానంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. విద్యార్థుల ఆందోళనకు తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం చివరికి కేంద్ర విద్యాశాఖ మంత్రితో రాజీనామాచేయించాల్సి వచ్చింది. కేంద్రమంత్రి సైతం తాను రాజీనామా చేస్తున్నానని.. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్షను సీబీటీ విధానంలో నిర్వహిసామని తెలిపారు. ఇటువంటి ఘటనలు గతంలోనూ జరిగాయి. గతంలో జాతీయ స్థాయిలో జరిగిన కొన్ని సంఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ కొందురు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ విద్యా శాఖ మంత్రిగా పనిచేసిన మంత్రి ఒకరు పేపర్ లీకేజీ నేపథ్యంలో రాజీనామా చేశారు. అనంతరం మరోసందర్భంలో మరొక మంత్రి సైతం రాజీనామా చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంజనీరింగ్, మెడిసిన్‌లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఎంసెట్ పేపర్ లీకైన సందర్భాలు ఉన్నాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరవాత కూడా ఎంసెట్ పేపర్ లీకైంది. లీకైన తరువాత మరోసారి పరీక్షను నిర్వహించారు.

పేపర్ లీకేజీలతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. పేపర్ లీకేజీల మూలంగా విద్యార్థులు మానసిక ఆందోళన చెందడమే కాకుండా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. విద్యార్థుల ఆత్మహత్యలతో వారి తల్లిదండ్రులు సైతం తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. పేపర్ లీకేజీలు అనేది దేశ వ్యాప్తంగా నిర్వహించే పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలతోపాటు, రాష్ట్రాల్లో నిర్వహించే పోటీ పరీక్షలు, చివరికి విద్యార్థులకు నిర్వహించే విద్యా సంవత్సరపు వార్షిక పరీక్షలు సైతం లీకవుతున్నాయి. ఏ రకమైన పేపర్ లీకైన విద్యార్థులే ప్రధాన బాధితులుగా ఉంటున్నారు. పేపర్ లీకేజీలతో విద్యార్థులు మానసిక ఆందోళనే కాకుండా ఆర్థికంగా అదనపు భారం పడుతోంది. పేపర్ లీకేజీలు ఇపుడు కొత్తగా జరుగుతున్నదేమీ కాదు. ఎప్పటి నుంచో జరుగుతున్న వ్యవహారం. ఎపుడు జరిగినా అప్పటికపుడు లీకేజీకి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడం.. కొన్ని సందర్భాల్లో జాతీయస్థాయి పోటీ పరీక్షల ప్రశ్నలు లీకైనపుడు కొందరు మంత్రులు రాజీనామా చేయడం, కొన్ని రాష్ట్రాల్లోనూ మంత్రులు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయడం జరిగాయి. పేపర్ లీక్ జరిగే అవకాశం లేకుండా సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించినప్పటికి కూడా ఏదో రూపేణా పేపర్ లీకేజీల లాలూచీలు సంభవిస్తూనే ఉంటున్నాయి. గతంలో సైతం పలు సందర్భాలలో విద్యార్థుల బంగారు భవిష్యత్తో ఈ పేపర్ లీక్ వ్యవహారం ఆటలాడుకున్న సందర్భాలు ఉన్నాయి. పేపర్ లీకేజీల మూలంగా బాగా కష్టపడి చదివే విద్యార్థుల నోట్లో మట్టి కొట్టేలా అనారోగ్య వాతావరణం పొడచూపుతుండటం నిజంగా అత్యంత దురదృష్టకరమైన విషయం. సమాజంలో ఆర్థికంగా, రాజకీయంగా బాగా పలుకుబడి వున్నవ్యక్తుల అండదండలతో దేశ విద్యావ్యవస్థకే, పబ్లిక్ పరీక్షలు నిర్వహించే వారి ఉనికినే భ్రష్టు పట్టించేలా వ్యవహరించే వారి తీరుతెన్నులు ప్రజాస్వామ్య దేశంలో సిగ్గుచేటైన, హేయమైన విషయం. మే 3న జరిగిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)-2026 ప్రశ్నాపత్రం లీకైంది. నీట్ పేపర్ లీకేజీ సందర్భంగా జరిగిన ఆందోళనలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సైతం

**నాగమణీంద్ర పల్లాపు**

విద్యార్థుల ఆందోళనకు మద్దతు ఇవ్వడంతోపాటు ప్రధాని ఇంటి ముందు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. గత పదేళ్లలో 152పరీక్షా పేపర్లు లీకయ్యాయని తెలిపారు. ఇంత వరకూ నిందితులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గతపదేళ్లల్లో జరిగిన 152 పేపర్ లీక్స్ కారణంగా 7.5 కోట్లమంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని రాహుల్ గాంధీ ఆవేదన



వ్యక్తం చేశారు. మే 3న జరిగిన నీట్ పేపర్ లీకైన తరువాత ఈ ఏడాదిలోనే జూన్ రెండో వారంలో మహారాష్ట్రలో జరిగిన టెట్ పరీక్ష పేపర్ లీకైంది. టెట్‌కి సంబంధించి ఇతర రాష్ట్రాల్లో జరిగిన ఇలాంటి పేపర్ లీక్ కేసులలో ప్రమేయఉన్నట్లు అనుమానిస్తున్న నిందితులతో ముడిపడి ఉన్న అంతర్రాష్ట్ర పేపర్ లీక్ రాకెట్‌పై మహారాష్ట్ర పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేసి విచారణ జరుపుతోంది. నీట్‌పై కూడా సీబీఐ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే నీట్ పేపర్ లీకేజీతో సంబంధం ఉన్న సుమారు 18 మందిని అరెస్టు కూడా చేశారు. ఈ ఏడాది జరిగిన నీట్ పేపర్ లీకేజి కంటే ముందు 2024లో జరిగిన నీట్ పేపర్ లీకైందని కొందరు కోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టులో విచారణ సందర్భంగా పేపర్ లీకేజీ మాస్‌గా జరగలేదని.. కొందరు మాస్ కాపీయింగ్‌కు పాల్పడ్డారని వారిని అనర్హులుగా ప్రకటిస్తూ నిర్ణయం తీసుకోవడంతో తిరిగి నీట్ పరీక్షను నిర్వహించలేదు. 2024లో సుమారు 23 లక్షల మంది పరీక్షలకు హాజరయ్యారు. ఈ ఏడాది మేలో జరిగిన పరీక్షకు సైతం సుమారు 22 లక్షల మంది హాజరు కాగా.. జూన్‌లో జరిగిన రీ ఎగ్జామ్‌కి సుమారు 20.50 లక్షల మంది హాజరయ్యారు. 2023 మార్చిలో అసోంలో టెన్త్ ప్రశ్నాపత్రం లీకైంది. ప్రశ్నాపత్రం లీకేజీపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ స్పందించారు. ప్రశ్నాపత్రం లీక్ కావడం తమ వైఫల్యేమనని.. తప్పు అంగీకరిస్తున్నాని ప్రకటించారు. ఈ పేపర్ లీకేజీ వెనుక ఉన్న అస్సలు సూత్రధారిని గుర్తించినట్లు వెల్లడించారు. జాతీయ స్థాయిలో నిర్వ హించే పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు లీకైతే ఆయా పరీక్షలకు ప్రిపేర్ అయిన విద్యార్థులు తీవ్ర మానసిక ఆవేదనకు గురవుతున్నారు. అప్పటికే బాగా చదివి పరీక్ష రాసిన విద్యార్థులు పేపర్ లీకై మరోసారి పరీక్షను నిర్వహించే సమయంలో తిరిగి అదే స్థాయిలో చదవలేక వారి తల్లిదండ్రులు ఏమంటారోననే భయంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గతంలో జరిగిన పేపర్ లీకేజీల సమయంలో ఇటువంటి ఆత్మహత్యలు జరిగాయి. మొన్న మేలో జరిగిన నీట్ ప్రశ్నా పత్రం లీకైన సందర్భంలోనూ జరిగాయి. కానీ ఈ ఏడాది జరిగిన పేపర్ లీకేజీ కారణంగా సుమారు 20నుంచి 24 మంది విద్యార్థులు ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారు. బాగా చదివి పరీక్షను బాగారాసిన వారు సైతం మానసిక ఆందోళనతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పేపర్ లీకేజీలే కాకుండా రాష్ట్రాల్లో నిర్వహించే పోటీ పరీక్షలు, రెగ్యులర్‌గా జరిగే అకడమిక్ వార్షిక పరీక్షల పేపర్ల లీకేజీ విషయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఏదైనా జాతీయ పోటీ పరీక్షలు కావచ్చు, రాష్ట్రస్థాయిలో పరీక్షలకు కావొచ్చు, వార్షిక పరీక్షల ప్రశ్నాపత్రాలు కావొచ్చు ఏ పేపర్ లీకైన తిరిగి పరీక్షలను నిర్వహించడం చాలా కష్టంగా మారుతోంది. మొదటిసారి నిర్వహించిన దానికంటే పకడ్బందీగా పరీక్షలను నిర్వహించడం అధికారులు, ప్రభుత్వాలకు కత్తిమీద సాములాంటింది.

మేలో జరిగిన నీట్‌పేపర్ లీకైన తరువాత జూన్ 21న నిర్వహించిన పరీక్షకు సుమారు2లక్షల మందితో అదనంగా భద్రతను ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఇదే కాకుండా విద్యార్థులు కూడా మరోసారి పరీక్షకు సిద్ధం కావల్సివస్తుంది. వారితోపాటు వారి తల్లిదండ్రులు కూడా వీరికి తోడుగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పరీక్ష మొదటిసారి నిర్వహించిన దానికంటే తరువాత నిర్వహించడానికి ఎక్కువ ఖర్చుచేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పేపర్ లీకేజీలు జరిగిన తరువాత ప్రభుత్వాలు పేపర్ లీకేజీపై కేసులు నమోదు చేసికొన్ని సందర్భాల్లో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్)లను ఏర్పాటు, మరి కొన్ని సందర్భాల్లో సీబీఐతో విచారణ జరిపించడం చేస్తున్నాయి. ప్రశ్నాపత్రాలు లీకేజీతో ప్రభుత్వాలకు చెడ్డపేరు రావడమే కాకుండా అదనంగా ఖర్చులు భరించాల్సి వస్తుంది. పేపర్ లీకేజీలపై ప్రభుత్వాలు ఇప్పటి వరకు కేసులు నమోదు చేసి వారినిజైలుకు పంపిస్తున్నప్పటికీ పేపర్ లీకేజీలు ఆగడం లేదు. దీంతో కేంద్ర మంత్రి వర్గం ఇకపై లీకేజీలపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి నూతనచట్టం చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న 2024 ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టంప్రకారం, వ్యక్తిగతంగా ప్రశ్నపత్రాల లీక్‌కు పాల్పడిన వారిపై 3నుంచి5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అదే వ్యవస్థీకృతంగా జరిగే నేరాల విషయంలో 5 నుంచి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.1 కోటి వరకు జరిమానా విధించే నిబంధనలున్నాయి. పేపర్ లీక్ కేసుల విచారణను వేగవంతం చేయడంపై కూడా కేంద్రం ప్రత్యేక దృష్టిపెట్టింది. ఇందుకోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఢిల్లీలో ఒక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయగా త్వరలో మరో నాలుగు కోర్టులను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నారు. పేపర్ లీక్‌లకు సంబంధించిన కేసులను కోర్టుల్లో ఏడాది లోపే విచారించి తీర్పులు ఇవ్వాలనే లక్ష్యంతో చట్టంలో సవరణలు చేయనున్న ట్లు తెలుస్తోంది. వేగవంతమైన న్యాయ ప్రక్రియకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది. అటు జైలు శిక్షతోపాటు భారీగా జరిమానా విధించడం, జైలు శిక్ష కాలాన్ని సైతం పెంచి పేపర్ల లీకేజీలకు పాల్పడే వారు భయపడేలాగా చేయాలని కేంద్రం భావిస్తోంది. ●

---

# ‘కదన’ తరంగం!

ఢిల్లీ

యువత కదిలితే అదొక కడలి తరంగం. యువత నినదిస్తే అది మహా సముద్ర ఘోష. ఆ రెండూ ఇప్పుడు ఒకేసారి కనిపిస్తున్నది ఢిల్లీ జంతర్ మంతర్ లోనే. తరంగం, ఘోష రెండూ కలగలిస్తే అదొక ఉప్పెనే. గత వారం రోజులుగా ఆ ‘ఉప్పెన’లో అన్నీ కొట్టుకుపోతున్నాయి. ఆ దృశ్యాన్ని చూసి, వెనుకడుగు వేయని ప్రధాని మోడీ సైతం నిలబడి ఆలోచిస్తున్నారు.‘విద్యార్థులు దేశ భావి నిర్ణేతలురా’ అని ఓ పాటలో అన్నట్లు ఇండియా ముఖ చిత్రాన్ని మార్చే సంకల్పంతో వివిధ ప్రాంతాల విద్యార్థులంతా జంతర్ మంతర్ వద్ద హోరెత్తిపోతున్నారు. దానితో వారం రోజులుగా పార్లమెంటు కూడా స్తంభించింది. రోజూ సమావేశం కావడం రభస, రగడతో కొద్దిసేపటికే వాయిదా పడడం నిత్యకృత్యమైపోయింది. నీట్ పరీక్ష పత్రాల లీకేజి నేపథ్యంలో మొదలైన ఆందోళనలు ‘కాక్రోచ్’లుగా కదులుతూ వచ్చి మొత్తం వ్యవస్థకే సవాలుగా మారాయంటే అది చిన్న విషయమేమీ కాదు. ఒక విచిత్రమైన పరిస్థితిలో రూపుదిద్దుకున్న ‘కాక్రోచ్ జనతా పారీ’ (సిజెపి) ఇంకా పూర్తి స్థాయి రాజకీయ పార్టీగా పరిణామం చెందకుండానే ఇంతటి ప్రభావం సృష్టించడం దేశంలో అందరినీ, ముఖ్యంగా రాజకీయ పార్టీల నేతలందరిని ఎంతో ఆశ్చర్య పరుస్తోంది. ఒక వ్యంగ్య ఉద్యమంగా రెండు నెలల క్రితమే ఆవిర్భవించిన ఈ పార్టీఇంతలోనే అంతగా ఎదగడం కూడా అందరినీ ఆలోచింపజేస్తోంది. పెద్దప్రచారం లేకుండానే ప్రతి విద్యార్థి మైండ్ లోకి ‘కాక్రోచ్’ ప్రవేశిస్తోంది. జన్‌జడ్ తరం దాని వెనుకేనడుస్తోంది. దేశ రాజధానిలో ఆందోళనలకు కేంద్ర బిందువైన జంతర్ మంతర్ వద్ద గత ఆరురోజులుగా యువ ఆందోళనకారులు వెల్లువెత్తడం చూస్తే అది కేవలం ఓ పార్టీ ఇచ్చిన పిలుపుగా అనిపించదు. సామాజిక ఉద్యమకారుడు వాంగ్ చుక్ విద్యార్థుల ఉద్యమానికి మద్దతు ప్రకటించడమే గాక 26 రోజులపాటు జరిపిన నిరాహార దీక్ష ఇప్పుడు ప్రభుత్వ నిర్ణయాలను ఎంతో ప్రభావితం చేస్తున్నట్లే కనిపిస్తోంది. అన్నిరాష్ట్రాల నుంచి యువత స్వచ్ఛందంగా కదిలిరావడం గమనించవలసిన పరిణామం. విద్యార్థిలోకం స్వచ్ఛందంగా సాగిస్తున్న ఉద్యమంగానే దీనిని భావించవచ్చు. సామాజిక వ్యవస్థలు ఎలా కృంగి కృశించిపోతున్నాయో, ఎలా కమిలిపోతున్నాయో చెపూ్త యువతే దిశా నిర్దేశం చేస్తోంది. తమకు న్యాయం కావాలని డిమాండ్ చేస్తోంది. దశా బ్దాలుగా వేళ్లానుకొన్న పెద్ద పెద్ద రాజకీయ పార్టీలను సైతం కలవరపరుస్తోంది. తాము చేయ లేకపోతున్నది విద్యార్థి లోకం చేస్తున్నదని గ్రహించి ఒక్కొక్కటిగా ఆయా పార్టీలు కూడా కదన రంగంలోకి దిగే ప్రయత్నం చేస్తున్నాయి. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఆందోళనలను కఠినంగా అణచివేసిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు విద్యార్థులకు మద్దతుగా రంగంలోకి దిగడం విమర్శలపాలవుతోంది.

**ఎ.వి.వి ప్రసాద్**



యువత ఆందోళనలు

రాహుల్ గాంధీ, ఖర్గే ప్రభృతులు ప్రధాని మోడీ నివాసం వద్ద మెరుపు ధర్నా చేయడంలో నిజాయితీ లేదనీ, ఉంటే వారంతా జంతర్ మంతర్ వద్దకు వచ్చి విద్యార్థులకు ఎందుకు మద్దతు ప్రకటించ లేదనీ వాంగ్ చుక్ సతీమణి గీతాంజలి వేసిన ప్రశ్నకు ఆనేతలే సమాధానం చెప్పవలసి ఉంది. రాజకీయ నాయకులు సొంత ప్రయోజనాల కోసం వాంగ్ చుక్ ప్రతిష్టను వాడుకొంటున్నారని కూడా ఆమె సంచలనాత్మక వ్యాఖ్యలు చేయడం గమనించవలసిన విషయం. 20న విద్యార్థులు నిర్వహించిన ‘చలో పార్లమెంటు’ మార్చ్ పై పోలీసు చర్యను ఖండించడంలో సైతం రాహుల్ నుంచి సరైన స్పందన రాలేదంటూ విద్యార్థులు వ్యాఖ్యానించడం వినిపిస్తోంది. పోలీసు చర్యలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకులను పరామర్శించేందుకు రాహుల్ వెళ్ల కపోవడాన్ని కూడా అంతా విమర్శిస్తున్నారు. కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడైన అభిజిత్ దీప్కే గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ సోషల్ మీడియాలో కీలక పాత్ర వహించడంతో ‘ఆప్’ ఛాయలు అతడిపై ఉంటాయని భావించిన కాంగ్రెస్‌మొదట దానికి దూరంగానే ఉంటూవచ్చింది. కానీ ఆందోళనలు వాటికవే ఉధృతరూపం దాల్చడం చూసి తమ పాత్ర కూడా దానిలో ఉండడానికి ప్రయత్నాలు ఆరంభించింది. 2011 లో అన్నాహజారే అవినీతి వ్యతిరేకోద్యమం పెద్ద ఎత్తున నడిపిన ప్పుడు బిజెపి సహా ఎన్నో పార్టీలు మద్దతు ఇచ్చాయి. కానీ ఇప్పుడు అటువంటి రాజకీయ పార్టీల మద్దతు తగినంత లేకుండానే విద్యార్థులు ఇంత మహోద్యమం నడపడం చూస్తే ‘మారుతున్న స్వరం’ ఏమిటో అందరికీఅర్థమవుతోంది. బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్‌లో సాగిన జన్‌జడ్ ఉద్యమాలు ఆ దేశాల్లో ఎలాంటి కుదుపునిచ్చాయో ఇటీవల చూశాం. అయితే ఈ విద్యార్థుల ఉద్యమానికి రెండు మూడు అంశాలే కారణాలుగా కనిపిస్తున్నాయి గాని వ్యవస్థలోని మొత్తం అవినీతిపై తిరుగుబాటుగా కనిపించడం లేదనే అభిప్రాయం ఉంది. ఎన్‌టిఎలో సంస్కరణలు, అధికారులపై చర్యలు కూడా ఏదోవిధంగా పరిష్కారం కావొచ్చు. కానీ వ్యవస్థలో పేరుకుపోతున్న అవినీతిని తుడిచిపెట్టే ఉద్యమంలా సాగితే అది కొత్త చరిత్ర సృష్టిస్తుంది, సమాజానికి ఉత్తమ ఫలితాలనిస్తుంది. అన్నాహజారే ఉద్యమం అప్పట్లో చాలా ప్రభావాన్నే చూపినా అంతలోనే చల్లారిపోయింది. కానీ ఈ ఉద్యమంలో విద్యార్థి లోకం స్వచ్ఛందంగా పాల్గొనడంతో అంతకు మించిన ప్రభావాన్నే చూపగలుగుతుంది కానీ సరైన ఫలితాలు సాధించేందుకు శాంతియుత మార్గంలో వెళ్లవలసి ఉంది. కొందరంటున్నట్లు ఇలాంటి ఉద్యమాల్లోకి సాంఘిక వ్యతిరేక శక్తులు కూడా తలదూరుస్తాయి. అందువల్ల మరింత అప్రమత్తత అవసరం. కాక్రోచ్ పార్టీ కోరుకున్నట్లుగా కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం రాజీనామా చేశారు గనుక ఆ పార్టీనేతలు ఆందోళన విరమిస్తారో, లేక మరికొన్ని డిమాండ్లతో ఉద్యమం కొనసాగిస్తారో చూడాలి. ●

---


# యుద్ధభూమిలో పాలనా సంస్కరణలు

ఉక్రెయిన్

రష్యాతో ఐదేళ్లుగా కొనసాగుతున్న యుద్ధం కీలక దశకు చేరుకున్న వేళ ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీ ప్రభుత్వంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టి ప్రపంచ దేశాలను ఆకర్షించారు. ఐదేళ్ల నుంచి రష్యాతో ఎడతెరిపిలేని యుద్ధం కొనసాగిస్తున్న జెలెన్స్కీ తన దేశ సార్వభౌమత్వం కోసం నిరంతరం తపిస్తూనే ఉన్న సంగతి తెలిసిందే. అగ్ర రాజ్యం సోవియట్ యూనియన్ ఈ చిన్నదేశాన్ని నాటోలో చేరకుండా నిరంతరం అడ్డుకుంటూనే ఇప్పుడు సైనిక చర్యకాస్తా యుద్ధంగా మారిపోయింది. నిరంతరం కొనసాగుతున్న ఈ దమనకాండలో అటు అమెరికా నుంచి ఇటు యూరోపియన్ దేశాలు కూడా ఉక్రెయిన్‌కు ఆయుధ పరంగా కొండంత అండగా నిలిచాయి. అయితేట్రంప్ పాలన ప్రారంభం నుంచి ఉక్రెయిన్ అధ్యక్షుడు ఒత్తిడులను ఎదుర్కొంటున్నారు. ఒక దశలో రష్యా చెప్పినట్లు ట్రంప్ ఆడుతున్నారన్న భావన కూడా ఉక్రెయిన్ ప్రజల్లో సర్వత్రా వినిపించింది. అప్పుడప్పుడు శాంతిచర్చల పేరిట అమెరికాకు పిలిపించి మరీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ దేశాధినేతను ఘోరంగా అవమానపరిచారన్నఆక్రోశం కూడా ఆ ప్రజల్లో గూడుకట్టుకునిపోయింది. కమ్ముకొస్తున్న రష్యా యుద్ధమేఘాల మాటున ఇప్పుడు జెలెన్స్కీ కొత్తగా ప్రభుత్వం మొత్తం ప్రక్షాళనకు పూనుకోవడం ఆయన సాహసోపేతమైన కార్యాచరణగానే చెప్పుకోవచ్చు. ప్రభుత్వ రంగ ఇంధన సంస్థ నాఫ్టోగాజ్ సీఈఓ సెర్గీ కొరెట్స్కీని ఉక్రెయిన్ కొత్త ప్రధానిగా ఎంపిక చేసినట్లు ప్రకటించారు. దేశాన్ని రాబోయే శీతాకాలానికి సిద్ధం చేయడమే ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అని స్పష్టం చేసిన అధ్యక్షుడు ప్రధానిగా యూలియా స్విరిడెంకోను కేవలం ఏడాది పదవీకాలంతోనే తప్పించారు. ఆమె రాజీనామాను పార్లమెంట్ ఆమోదించగా, కొత్త ప్రధానిగా సెర్గీ కొరెట్స్కీ నియామకానికి పార్లమెంట్ ఓటింగ్ నిర్వహించింది. అధికార పార్టీ సర్వెంట్ ఆఫ్ ది పీపుల్‌కు పార్లమెంట్‌లో మెజారిటీఉండటంతో కొరెట్స్కీ నియామకం ఖాయమనే చెప్పాలి. జెలెన్స్కీ మాట్లాడుతూ ప్రస్తుతందేశంముందు ఉన్న ప్రధాన లక్ష్యం శీతాకాలానికి సన్నద్ధంకావడం. అన్ని అంశాలను పరిశీలించిన తర్వాత సెర్గీ కొరెట్స్కీనే ప్రధానమంత్రి పదవికి అత్యంత

**గన్ని మోహన్**

అర్హుడిగా తేల్చారు. అంతేకాకుండా ప్రభుత్వ పునర్వ్యవస్థీకరణలో అత్యంత ఆసక్తికర అంశంగా రక్షణ మంత్రిత్వశాఖ మార్పులు నిలిచాయి. ప్రస్తుతం రక్షణ మంత్రిగా ఉన్న మైఖైలో ఫెడొరోవ్ స్థానంలో 2023 నుంచి అంతర్గత వ్యవహారాల మంత్రిగా ఉన్న ఇహోర్ క్లైమెంకోను నియమించే అవకాశం ఉందని అధికార పార్టీ ఎంపీలు వెల్లడించారు. అధ్యక్షుడితో సమావేశం అనంతరం పలువురు ఎంపీలు సామాజిక మాధ్యమాల ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. అధికార పార్టీ ఎంపీ ఒల్హా వాసిలెవ్‌స్కాస్మాల్యూక్ కూడా క్లైమెంకో పేరును రక్షణ మంత్రి పదవికి ప్రతిపాదించనున్నట్లు తెలిపారు. ఫెడొరోవ్ తొలగింపుపై విమర్శలు సైతం జెలెన్స్కీ ఎదుర్కొన్నారు. కేవలం ఆరు నెలల కాలంలోనే ఫెడొరోవ్ ఉక్రెయిన్ సైన్యాన్ని మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కీలక సంస్కరణలు చేపట్టారు. ముఖ్యంగా డ్రోన్ కొనుగోళ్లు పెంచడం, సాంకేతికత ఆధారిత యుద్ధ వ్యూహాలను అమలు చేయడం, రక్షణ కొనుగోలు వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడానికి ప్రయత్నించడం వంటి చర్యలకు ఆయన ప్రశంసలు అందుకున్నారు. రష్యాపై ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి డ్రోన్ దాడులు ముమ్మరం చేస్తున్న సమయంలో ఫెడొరోవ్‌ను మార్చడం సరైన నిర్ణయం కాదని పలువురు ఎంపీలు బాహాటంగానే జెలెన్స్కీకి నివేదించినా మార్పు అనివార్యం అన్న సంకేతాలే ఇచ్చారు. పార్లమెంట్ విదేశాంగ కమిటీ ఛైర్మన్ ఒలెక్సాండర్ మెరెజ్కో మాట్లాడుతూ ఫెడొరోవ్‌కు అంతర్జాతీయ సంస్థల్లో మంచి గౌరవం ఉందని, రక్షణ శాఖలో నిజమైన సంస్కరణలపై ఆశలు ఆయనతోనే ముడిపడి ఉన్నాయని



జెలెన్స్కీ

అందువల్లనే మార్పుఅనివార్యం అవుతోందని జెలెన్స్కీని సమర్థిస్తూ వచ్చారు. ప్రఖ్యాత డ్రోన్ యుద్ధ నిపుణురాలు, వాలంటీర్ మరియా బెర్లిన్స్కా ఫెడొరోవ్‌ను మార్చడం అధ్యక్షుడు జెలెన్స్కీ చేసిన అతిపెద్ద తప్పిదాల్లో ఒకటని, ఈనిర్ణయం ఉక్రెయిన్‌కు భారీ మూల్యం చెల్లించే పరిస్థితి తీసుకు రావచ్చని, లక్షలాది మంది సైనికుల ప్రాణాలు, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని హెచ్చరించినా జెలెన్స్కీ వెనక్కి తగ్గలేదు. ఉక్రెయిన్ ప్రస్తుతం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. వాయు రక్షణ వ్యవస్థల కొరత, సైనికుల కొరత, నియామక ప్రక్రియలో లోపాలు ఇప్పటికీ ఆదేశాన్ని పట్టిపీడిస్తున్నాయి. మరోవైపు, రాబోయే శీతాకాలంలో విద్యుత్ మౌలిక వసతులపై రష్యాదాడులు మళ్లీ పెరిగే అవకాశముందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రక్షణ మంత్రిగా ఉన్న సమయంలో ఫెడొరోవ్ చేపట్టిన సైనిక సంస్కరణలు ఇంకా పూర్తికాలేదు. అదే సమయంలో అమెరికా తయారీ బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకునే ఆధునిక ఇంటర్‌సెప్టర్ వ్యవస్థల కొరత కూడా ఉక్రెయిన్‌కు ప్రధాన సమస్యగా మారింది. తూర్పు ఉక్రెయిన్‌లోని డోనెట్స్క్ ప్రాంతంలోని కీలక నగరాలవైపు రష్యా సైన్యం నెమ్మదిగా ముందుకు కదులుతోంది. మొత్తం డోనెత్స్క్ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకోవడమే లక్ష్యంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వ్యూహం అమలు చేస్తున్నట్లు కదనరంగం నుంచి సంకేతాలు అందుతున్నాయి. ఇంగ్లండ్, ఫ్రాన్స్, ఇటలీ, వంటి దేశాలు ఆయుధబలగాలను సమకూరుస్తున్నా ఈ సాయంఎంత కాలం కొనసాగుతుందనేది కూడా స్పష్టంగాచెప్పలేని పరిస్థితి. ఎందుకంటే ట్రంప్ ఈ దేశాలపై ఒత్తిడి తెచ్చినా తీసుకురావచ్చనేది అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో జెలెన్స్కీ చేపట్టిన ప్రభుత్వ మార్పులు ఉక్రెయిన్ యుద్ధ వ్యూహం, ప్రస్తుత దేశ రాజకీయ పరిస్థితులపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశం కావడంతోపాటు ఉత్కంఠగా కూడా మారింది. ●

---

# మేల్కొన్న యువత దేశాన్ని మారుస్తున్న వేళ..



**డా.జె. పూర్ణచంద్ర రావు**

రాత్రి పదకొండు గంటల యాభై నిమిషాలు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఎక్స్ ఖాతాలో ఒక వీడియో పెట్టారు. దేశమంతా విద్యార్థుల పోరాటాల గురించి మాట్లాడుతున్న వేళ ఆ వీడియో రావడం చాలామందిని ఆలోచింపజేసింది. ఆ చర్చ ఇంకా కొనసాగుతుండగానే, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. పరీక్షలలో జరిగిన అవకతవకలపై దేశవ్యాప్తంగా సాగిన విద్యార్థుల పోరాటాల నడుమ జరిగిన ఈ రెండు పరిణామాలు ఒక విషయాన్ని స్పష్టంగా చూపించాయి. ప్రజల గొంతు బలంగా వినిపించినప్పుడు, పాలకులు మాట్లాడక తప్పదు. అవసరమైతే నిర్ణయాలు కూడా మార్చక తప్పదు. దేశమంతా విద్యార్థుల పోరాటాల గురించి మాట్లాడుతున్న వేళ ఆవీడియో రావడం చాలామందిని ఆలోచింపజేసింది. ఇంత బలమైన మోడీ కూడా ఎందుకు మాట్లాడాల్సి వచ్చింది?” అని చాలామంది అడిగారు. కానీ అసలు ప్రశ్న అది కాదు. మోదీ ఎందుకు మాట్లాడాడు? అన్నది కాదు. మోదీ మాట్లాడాల్సిన పరిస్థితి ఎవరు తెచ్చారు? అన్నదే అసలు ప్రశ్న. పాలకులుఎప్పుడూ తమంతట తామే దిగి రారు. ప్రజలు నిలబడితేనే ఒక్క అడుగు వెనక్కి వేస్తారు. అదే చరిత్ర. అదే ప్రజల బలం. మన దేశంలో ఒక విచిత్రమైన అలవాటు పెరిగిపోయింది. ఎవరో కొత్తగా పోరాటం మొదలుపెడితే ముందుగా నవ్వుతాం. వీళ్ల వల్ల ఏమవుతుంది?”, నలుగురు పిల్లలు రోడ్డు మీద కూర్చుంటే దేశం మారిపోతుందా?”,“ఇది రెండు రోజుల్లో చల్లారిపోతుంది” అంటాం. కానీ రోజులు గడుస్తాయి. అదే పోరాటం పెద్దదవుతుంది. ఊళ్లకు, పట్టణాలకు పాకుతుంది. దేశమంతా దాని గురించే మాట్లాడుతుంది. చివరకు పెద్దపెద్ద నాయకులు కూడా నోరు విప్పాల్సి వస్తుంది. అప్పుడు మాత్రం వీళ్లవల్లే జరిగింది’అంటాం. మొదట తక్కువ చేసి మాట్లాడిన వాళ్లే చివరికి చప్పట్లు కొడతారు. ఇది ఈ రోజు కొత్తగా జరిగిన విషయం కాదు. చరిత్ర అంతా ఇలాగే ఉంది. స్వాతంత్ర్యం కోసం పోరాటం మొదలైనప్పుడు కూడా బ్రిటిష్ వాళ్లు కొద్దిమందిని చూసి నవ్వుకున్నారు. దక్షిణ ఆఫ్రికాలో నల్లజాతి వాళ్లు హక్కుల కోసం నిలబడినప్పుడు వాళ్లను అణచేయగలమని పాలకులు అనుకున్నారు. అమెరికాలో నల్లజాతి వాళ్లు వీధుల్లోకి వచ్చి నప్పుడు కూడా మొదట ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. కానీ ఒకరి వెనుక పది మంది, పది మంది వెనుక వంద మంది, వంద మంది వెనుక లక్ష మంది నిలబడినప్పుడు పాలకులు తలవంచక తప్పలేదు. మన దగ్గర మాత్రం ఇంకో జబ్బుఉంది.‘వాళ్లు ఏం చేస్తున్నారు?’ అని అడగడం చాలా సులభం. ‘రాహుల్ గాంధీ ఏం చేస్తున్నాడు?,ప్రతి పక్షం ఏంచేస్తోంది?,ఆ నాయకుడు ఎందుకు మాట్లాడడం లేదు?’ ఆ చదువుకున్న వాళ్లు ఎక్కడున్నారు?’ అని అడు గుతాం. కానీ ‘నేను ఏం చేస్తున్నాను?” అని మాత్రం మనల్ని మనం అడగం. మనం పోరాటానికి వెళ్లం. మనం ప్రజలను చైతన్యపరుస్తూ ఒక పాట రాయం. ఒక వ్యాసం రాయం. ఒక చిన్న వీడియో కూడా తీయం.పెట్టం. మనం ఒక రూపాయి కూడా ఇవ్వం. మనం ఒక రోజు కూడా సమాజం బాగు కోసం కేటాయించం. కానీ పోరాడుతున్న వాళ్లకు మాత్రం రోజూ సలహాలు ఇస్తుంటాం. పార్లమెంట్ లో దక్షిణాది వాటా తగ్గిపోతుందని చాలామంది చెబుతున్న కొత్త నియోజకవర్గాల ఏర్పాటు గురించి మన రాష్ట్రాల్లో ఎంత పెద్ద చర్చ జరుగుతోంది? ఆంధ్రప్రదేశ్లోనూ, తెలంగాణలోనూ ఎంతమంది నాయకులు ఊరూరా తిరిగి ప్రజలకు చెబుతున్నారు? జగన్, చంద్రబాబు, పవన్ కళ్యాణ్, కేసీఆర్, రేవంత్ రెడ్డి,కిషన్ రెడ్డి,బండి సంజయ్, ఒవైసీ.. ఎవరినైనా మనం ఒక ప్రశ్న అడుగుతున్నామా?“ఈవిషయం మీద మీరే మంటారు ?’ అని నిలదీస్తున్నా మా? లేదు. ఎన్నికలు వస్తే మళ్లీ పాత గొడవలే. జగన్ మీద కోపమొస్తే చంద్రబాబుకు ఓటు వేస్తాం. చంద్రబాబు మీద కోపమొస్తే జగన్‌కి వేస్తాం. కేసీఆర్ మీద కోపమొస్తే రేవంత్కు వేస్తాం. ఒక కులం మీద కోపమొస్తే మరో కుల నాయకుడికి వేస్తాం.ఒక మతం మీద కోపమొస్తే మరో మతం పేరిట రాజకీయం చేసేవాళ్లకు వేస్తాం. మన ఓటు మన బాగుకోసం వేయడం లేదు. అభిమాన దురభిమానా లతో ఓటు వేస్తాం. కానీ మన బతుకు మాత్రం మారడం లేదు. చుండూరు జరిగింది. కారంచేడు జరిగింది. వేంపెంట జరిగింది. లక్షింపేట జరిగింది. ఇంకా ఎన్నో చోట్ల పేదల రక్తం కారింది. ఆ రోజున మనమంతా బాధపడ్డాం. సభలు పెట్టాం. కొవ్వొత్తులు వెలిగించాం. మాటలు చెప్పాం. కానీ కొంతకాలం తర్వాత మళ్లీ అదే పాతపార్టీల చుట్టూతిరిగాం. మనకు జరిగిన అన్యాయాన్ని మర్చిపోలేదు. కానీ ఆ అన్యాయానికి కారణమైన రాజకీయ నాయకుల కోసం పనిచేయడం మానలేదు కాన్షీరాం ఇంకా చేయాల్సిఉంది”,‘మాయావతి పని చేయటల్లేదు’,‘ఆర్. కృష్ణయ్య ఏం చేశాడు?’,‘మంద కృష్ణ మాదిగ ఏం సాధించాడు?’ అని అడుగుతాం. అడగాలి కూడా. కానీ అదే సమయంలో మనల్ని మనం కూడా అడగాలి. మనలో ఎవరైనా మన వాళ్ల కోసం పోరాటానికి ఒక రోజు సమయం ఇచ్చామా? మన దగ్గర ఉన్నదాంట్లో కొంచెమైనా మన వాళ్ల కోసం ఖర్చుపెట్టామా? మనకు సమయం లేదని చెప్పడం నిజం కాదు. తీర్థయాత్రలకు సమయం ఉంది. విహారాలకు సమయం ఉంది. సినిమాలకు సమయం ఉంది. ఫోన్లో గంటల కొద్దీ గడపడానికి సమయం ఉంది. కానీ మన ఊరి పిల్లలకు చదువు చెప్పడానికి సమయం లేదు. మనవాడి కూలీ బిడ్డకు పుస్తకం కొనివ్వడానికి సమయం లేదు. అన్యాయం జరిగిన చోటికి వెళ్లి నిలబడడానికి సమయం లేదు. ఇది మన బలహీనత. డాక్టర్ అంబేద్కర్ “చదవండి, పోరాడండి, ఒక్కటిగా నిలబడండి” అనిఎందుకు చెప్పాడు? ఒక్క మనిషి ఏమీ చేయలేడని ఆయనకు తెలుసు. ప్రజలు ఒక్కటైతే ఏ శక్తినైనా మార్చగలరని ఆయనకు తెలుసు. నెల్సన్ మండేలా కూడా అదే చూపించాడు. మార్టిన్ లూథర్ కింగ్ కూడా అదే చేశాడు. చే గువేరా కూడా అదే నమ్మాడు. అలిశెట్టి ప్రభాకర్ తన అక్షరాలతో అట్టడుగు మనిషి బతుకును దేశం ముందు పెట్టాడు. గొప్ప వాళ్లందరూ వేర్వేరు భాషల్లో చెప్పింది ఒకటే.ప్రజలు కదిలితేనే చరిత్ర కదులుతుంది. మనకు ఇంకో పెద్ద అలవాటు ఉంది. పోరాటం చేస్తున్న వాళ్లగురించి వెంటనే అనుమానం మొదలవుతుంది. ‘డబ్బు ఎవరు ఇస్తున్నారు?’,‘వాళ్ల వెనుక ఎవరు ఉన్నారు?’ అని అడుగుతాం. కానీ వేలాది మంది తమ చేతులతోవండి విద్యార్థులకు భోజనం పెట్టడం కనిపించదు. యువవైద్యులు ఉచితంగా వైద్యశిబిరాలు పెట్టడం కనిపించదు. న్యాయవాదులు ఉచితంగా కేసులు చూడడం కనిపించదు. ఉపాధ్యాయులు పిల్లలకు తోడుగా నిలవడం కనిపించదు. పేద ప్రజలు తమ కష్టార్జితంలో కొంత తీసి ఉద్యమానికి ఇవ్వడం కనిపించదు. పోరాటాన్ని నిలబెట్టేది కొద్దిమంది ధనవంతులు కాదు. వేలాది సాధారణ మనుషుల చిన్నచిన్న సాయం. దేశంలో ఏ పెద్ద మార్పు వచ్చినా మొదట యువతే ముందుకు వచ్చింది. స్వాతంత్ర్య పోరాటంలోనూ అదే జరిగింది. జయప్రకాశ్ నారాయణ్ పిలుపు ఇచ్చినప్పుడు కూడా యువతే వీధుల్లోకి వచ్చింది. తెలంగాణ కోసం జరిగిన పోరాటంలో కూడా ముందుండింది యువతే. ప్రపంచంలో ఎక్కడ చూసినా ఇదే కనిపిస్తుంది. పెద్దవాళ్లు దారి చూపారు. కానీ దారిలో నడిచింది యువతే. అందుకే ఇప్పుడు పెద్దవాళ్ల మీద కూడా ఒక బాధ్యత ఉంది. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు ఒక పిల్లవాడికి చదువు చెప్పవచ్చు.పదవీ విరమణ చేసిన వైద్యుడు ఒకరోజు ఉచితంగా వైద్యంచేయవచ్చు. న్యాయవాది పేదవాడికి తోడుగా నిలవవచ్చు.రైతు తన అనుభవం చెప్పవచ్చు. రచయిత ఒక వ్యాసం రాయవచ్చు. కవి ఒక పాట రాయవచ్చు. సినిమా తీయలేని వాడు ఒకచిన్న వీడియో తీయవచ్చు. డబ్బు ఇవ్వలేని వాడు తన సమయం ఇవ్వవచ్చు. సమయం కూడా ఇవ్వలేని వాడు కనీసం పోరాడుతున్న వాళ్లను తక్కువ చేసి మాట్లాడకుండా ఉండవచ్చు. దేశాన్నిమార్చేది ఒక్క నాయకుడు కాదు. ఒక్కపార్టీ కాదు. ఒక్క ఎన్నిక కాదు. మేల్కొన్న ప్రజలే దేశాన్ని మారుస్తారు.‘వాళ్లు చేయాలి’ అనే మాట ఈ దేశాన్ని ఎక్కడికీ తీసుకెళ్లదు. ‘మనం చేద్దాం’ అనే మాట మాత్రం చరిత్రను మార్చగలదు. చివరగా మనం ఆలోచించాల్సింది ఏమంటే ఎందుకు దిగివచ్చాడు మోడీ? ఎందుకు రాజీనామా చేయాల్సి వచ్చింది ధర్మేంద్ర ప్రధాన్? సమాధానం ఒక వ్యక్తిలో లేదు. ఒకపార్టీలో లేదు. కొందరు యువకులు భయపడలేదు. లక్షలాది మంది ప్రజలు వాళ్ల వెనుక నిలబడ్డారు. తమ సమయాన్ని ఇచ్చారు. తమ శ్రమనుఇచ్చారు. తమడబ్బును ఇచ్చారు. ఆ చిన్నచిన్న చినుకులేఒకరోజు పెద్ద వరదఅయ్యాయి. ప్రజల గొంతు బలంగా వినిపించినప్పుడు ఏ పాలకుడైనా వినకతప్పదు. అదే ప్రజలపాలన. అదే చరిత్రచెప్పే నిజం. అందుకే ప్రశ్న మోడీ గురించికాదు. ప్రశ్న మనగురించే. మనం ఇంకా ప్రేక్షకులుగానే ఉండాలా? లేక చరిత్రను మార్చేవాళ్లలో మనమూ ఒకరిగానిలవాలా? ●

26MN 5 PG-GNT_26MN 5 PG-GNT.qxd 25-07-2026 PM 10:58 Page 1



# గవర్నర్‌కు స్వాగతం పలికిన బాపట్ల జిల్లా ఎస్పీ



బాపట్ల, జూన్25, ప్రభాతవార్త. ప్రతినిధి: బాపట్ల జిల్లా పర్యటనలో భాగంగా పట్టణానికి విచ్చేసిన రాష్ట్ర గౌరవ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. స్థానిక ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 58వ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు గవర్నర్ శనివారం బాపట్లకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉమామహేశ్వర్ ఆయనను నేరుగా కలిసి, పచ్చటి పూలమొక్కను అందజేసి ఘనంగా స్వాగతించారు. అనంతరం గవర్నర్ పర్యటన, స్నాతకోత్సవ కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు యంత్రాంగం చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఎస్పీ పర్యవేక్షించారు.

# అమృత్ 2.0తో గుంటూరుకు శాశ్వత నీటి పరిష్కారం

## గోరంట్లలో అమృత్ 2.0 తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జూలై 25, ప్రభాతవార్త :గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని గోరంట్ల గ్రామంలో అమృత్ 2.0 - యూఐడీఎఫ్ నిధులతో చేపట్టనున్న తాగునీటి సరఫరా అభివృద్ధి ప్రాజెక్టుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మరియు సహచర ప్రజాప్రతినిధులతో కలిసి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గత ప్రభుత్వాల నిర్లక్ష్య పాలనకు, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న



నిబద్ధత గల అభివృద్ధి పాలనకు ఈ ప్రాజెక్టే నిదర్శనమని, గతంలో కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద నిధులు కేటాయించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ ఫండ్స్ విడుదల చేయకపోవడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయని, దాని ఫలితంగా గుంటూరు నగరంతో పాటు విలీన గ్రామాల్లో నీటి సమస్యలు అలాగే కొనసాగాయని విమర్శించారు. గోరంట్ల తాగునీటి ప్రాజెక్టు స్థానిక ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న చిరకాల వాంఛ అని, కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేక చొరవ, నిరంతర కృషి వల్ల రూ.577 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టు మళ్లీ పట్టాలెక్కిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మ్యాచింగ్ ఫండ్స్ సమకూర్చి ప్రాజెక్టును వేగంగా అమలు చేస్తున్నారని, ఏడాది వ్యవధిలోనే పూర్తి చేసి ప్రతి ఇంటికీ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. గతంలో గోరంట్ల, పత్తిపాడు ప్రాంతాలకు నీటి సరఫరా కోసం ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు ఎన్నోసార్లు అధికారులను వేడుకున్న పరిస్థితులు ఉన్నాయని గుర్తుచేశారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు పూర్తయితే గోరంట్ల, పత్తిపాడు ప్రాంతాలకే కాకుండా గుంటూరు నగరంలోని టెయిల్ ఎండ్ ఏరియాలు, దూర ప్రాంతాలకు కూడా సమృద్ధిగా తాగునీరు అందే పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. ప్రకృతి ప్రసాదించిన అత్యంత విలువైన వనరు నీరని, అందుకే ప్రజలకు అమృతంలా ఉపయోగపడే ఈ పథకానికి "అమృత్ 2.0" అనే పేరు ఎంతో సార్థకమైందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే ప్రజలు తాగునీటి కోసం క్యాన్లు, వాటర్ ప్లాంట్లపై ఆధారపడే పరిస్థితి గణనీయంగా తగ్గుతుందని, ఇది కేవలం ఒక సాధారణ అభివృద్ధి కార్యక్రమం కాకుండా గుంటూరు ప్రజల ఎన్నో ఏళ్ల ఆశలను నెరవేర్చే మహత్తర ప్రాజెక్టు అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. గుంటూరు ప్రజల తరఫున ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తున్న కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

గుంటూరు వార్త



# ఘనంగా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ 58వ స్నాతకోత్సవం

బాపట్ల (బాపట్ల జిల్లా) జూన్25, ప్రభాతవార్త. ప్రతినిధి: వాతావరణ మార్పులు, సహజ వనరుల క్షీణత వంటి సవాళ్లను ఎదుర్కోవాలంటే శాస్త్రీయ పరిశోధనలు, సుస్థిర వ్యవసాయ విధానాలు, సహజ వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర గవర్నర్, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ఎస్. అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో శనివారం నిర్వహించిన ఏఎన్జీ ఆర్‌ఏయూ 58వ వార్షిక స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ గత ఆరు దశాబ్దాలుగా వ్యవసాయ విద్య, పరిశోధనలు, విస్తరణ సేవల ద్వారా రైతు సమాజానికి విశ్వవిద్యాలయం విశిష్ట సేవలు అందిస్తోందన్నారు. పట్టభద్రుల విజయం వెనుక తల్లిదండ్రులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తల కృషి అమూల్యమని అన్నారు. ప్రస్తుతం ఆలస్యమైన రుతుపవనాలు, కరువు, అతివృష్టి, భూగర్భ జలాల క్షీణత, నేల సార నష్టం వంటి సమస్యలు వ్యవసాయ రంగానికి సవాళ్లుగా మారాయన్నారు. నేల ఆరోగ్యం, నీటి వినియోగ సామర్థ్యం, సహజ వనరుల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ సుస్థిర వ్యవసాయాన్ని విస్తరించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు వాతావరణ మార్పులను అధ్యయనం చేసి ప్రభుత్వానికి సూచనలు చేయడంతో పాటు రైతులకు శాస్త్రీయ సలహాలు అందించాలన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ కార్యక్రమం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని గవర్నర్ తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం, ఆరోగ్యం మెరుగుదల, నీటి వినియోగం తగ్గుదల వంటి ప్రయోజనాలు సహజ వ్యవసాయం ద్వారా సాధ్యమవుతున్నాయని చెప్పారు. 2047 నాటికి రాష్ట్రాన్ని పూర్తిస్థాయి సహజ వ్యవసాయ రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఐసీఏఆర్-ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సి.హెచ్. శ్రీనివాసరావును, పత్తి శాస్త్రవేత్త కె. రవీంద్రనాథ్‌ను గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. రవీంద్రనాథ్‌కు విశ్వవిద్యాలయం




గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. పట్టభద్రులను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ విద్య జ్ఞానంతో పాటు బాధ్యతను కూడా అందిస్తుందని, రైతుల అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు చేసి గ్రామీణాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, భారతరత్న డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ సందేశాలను గుర్తుచేస్తూ సమాజ సేవే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ స్నాతకోత్సవంలో 50 మంది డాక్టరేట్ పండితులు, 240 మంది పీజీ విద్యార్థులు, 1,385 మంది గ్రాడ్యుయేట్లకు పట్టాలు, ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ డైరెక్టర్ డాక్టర్ సి.హెచ్. శ్రీనివాసరావు, ఏఎన్జీ ఆర్‌ఏయూ వైస్‌చాన్సలర్ డాక్టర్ పి.వి. సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి., బాపట్ల ఎమ్మెల్యే వేగేశిన నరేంద్ర వర్మరాజు, జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు,

# వంధత్వంపై అపోహలు వీడి.. సమయానికి వైద్యులను సంప్రదించాలి: వైద్య నిపుణులు

## ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవం సందర్భంగా అవగాహన నడక..




డాక్టర్ దుర్గా ప్రసాద్ ను సత్కరిస్తున్న ఓయాసిస్ పెర్టిలిటి వైద్య సిబ్బంది...

**గుంటూరు మెడికల్ , జూలై 25ద (ప్రభాతవార్త):** ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరులోని ఓయాసిస్ ఫెర్టిలిటీ ఆధ్వర్యంలో వంధ్యత్వం, పునరుత్పత్తి ఆరోగ్యం, సహాయక సంతానోత్పత్తి వైద్య విధానాలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు శనివారం అవగాహన నడక నిర్వహించారు. ఈ అవగాహన నడకను గుంటూరు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి. దుర్గాప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నారాయణరావు, డాక్టర్ శైలజ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంధ్యత్వంపై సమాజంలో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమన్నారు. సంతానలేమితో బాధపడుతున్న దంపతుల పట్ల అపోహలు, వివక్షకు తావులేకుండా సమాజం అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ఓయాసిస్ ఫెర్టిలిటీ గుంటూరు క్లినికల్ విభాగాధిపతి డాక్టర్ రమ్య నాయకత్వం వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది దంపతులను ప్రభావితం చేస్తున్న వైద్య సమస్యల్లో వంధ్యత్వం ఒకటని తెలిపారు. సరైన సమయంలో వైద్యులను సంప్రదించడం, ముందస్తు నిర్ధారణ, తగిన చికిత్స ద్వారా అనేక మంది దంపతులు తల్లిదండ్రులు కావాలనే తమ కలను సాకారం చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ అవగాహన నడకలో వైద్య నిపుణులు, ఓయాసిస్ ఫెర్టిలిటీ సిబ్బంది, రోగులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వంధ్యత్వంపై అవగాహన, పునరుత్పత్తి ఆరోగ్యం, సమయానికి వైద్య సలహా తీసుకోవాల్సిన అవసరాన్ని తెలియజేసే సందేశాలతో కూడిన ఫలకాలను ప్రదర్శిస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా ఓయాసిస్ ఫెర్టిలిటీ ప్రతినిధులు మాట్లాడుతూ నైతిక విలువలు, శాస్త్రీయ ఆధారాలు, మానవీయ దృక్పథంతో అత్యుత్తమ సంతానోత్పత్తి వైద్య సేవలను అందించేందుకు తమ సంస్థ కట్టుబడి ఉందన్నారు. వంధ్యత్వంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు అందుబాటులో ఉన్న ఆధునిక చికిత్సా విధానాలను పరిచయం చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని తెలిపారు.

# కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలి!

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, జూలై25, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ విశ్వవిద్యాలయాల్లో బోధన చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు 9రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ పిలుపుమేరకు చేస్తున్న శాంతియుత ఆందోళన నిర్వహిస్తున్నారు. శనివారం దీక్షా శిబిరం వద్ద డాక్టర్ బసవయ్య, డాక్టర్ కె.చైతన్య, డా.సిహెచ్.పుణ్యశేఖర్, డాక్టర్ డి.సుమలత, డాక్టర్ కె.విజయ్‌కిషోర్‌లు రిలే దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రెగ్యులరైజేషన్ ఆఫ్ సర్వీసెస్ ఆఫ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ చట్టం 2023 ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీ.ఓ ఎం.ఎస్.నెం.144ను ప్రకారం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల సేవలను క్రమబద్ధీకరించే అవకాశం ఉన్నా ఆ ప్రయోజనం వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు వర్తింపచేయకపోవడం తీవ్ర వివక్షే అన్నారు. అది న్యాయ సమ్మతం కాదని పేర్కొన్నారు. సేవలు క్రమబద్ధీకరణ, సమానపనికి సమానవేతనం, యూజిసి పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు వర్సిటీలో నిరంతరం సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించాలని విన్నవించారు. వర్సిటీలలో అనేక విద్యావిషయక సంబంద విధులు నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వర్సిటీల్లో ఖాళీల భర్తీ ప్రక్రియను ప్రారంభించే ముందు రాష్ట్రంలోని వివిధ వర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీకి అనుగుణంగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని జీ.ఓ ఎంఎస్ నెం.114ను తక్షణమే అమలు చేయాలన్నారు. ప్రభుత్వం మా న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించిన తరువాతే వర్సిటీల్లో పోస్టుల భర్తీకి ముందుకెళ్ళాలని విన్నవించారు. ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ, వర్సిటీల యాజమాన్యంలు తమ న్యాయమైన డిమాండ్‌లను పరిశీలించి పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

# నిడమర్రు రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు

## 14 మంది రైతులకు 95 ప్లాట్లు

### ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందించిన సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ కార్తీక్

మంగళగిరి, జూలై 25, ప్రభాతవార్త : రాజధాని అమరావతి నిర్మాణానికి భూములు ఇచ్చిన నిడమర్రు గ్రామ రైతులకు రాయపూడిలోని సీఆర్డీఏ కార్యాలయంలో ఈలాటరీ విధానంలో శనివారం



రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. రైతుల సమక్షంలో ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ముందుగా ట్రయల్ రన్ నిర్వహించి, అనంతరం నివాస, వాణిజ్య ప్లాట్లకు ప్రత్యక్ష లాటరీ చేపట్టారు. ల్యాండ్ పూలింగ్ స్కీమ్ (ఎల్‌పీఎస్) కింద భూములు ఇచ్చిన 14 మంది రైతులకు మొత్తం 95 రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించారు. వీటిలో 64 నివాస (రెసిడెన్షియల్), 31 వాణిజ్య (కమర్షియల్) ప్లాట్లు ఉన్నాయి. ప్లాట్లు పొందిన రైతులకు సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ కె. కార్తీక్, ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా రైతులు ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు.

# యూనివర్సిటీలలో బీసీ టీచింగ్ బ్యాక్లాగ్ పోస్టుల భర్తీ పై హర్షం

మంగళగిరి, జూలై 25, ప్రభాతవార్త : దశాబ్దాల తరబడి విశ్వవిద్యాలయాలలో బీసీ బ్యాక్లాగ్ పోస్టులు భర్తీ చేయక, ప్రమోషన్లు రాక, అవే పోస్టులలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులకు న్యాయం చేసేలా బిసి టీచింగ్ బ్యాక్లాగ్ పోస్టులు ప్రభుత్వం భర్తీ చేస్తున్నందుకు ప్రభుత్వానికి ముఖ్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా1996 నుండి పనిచేస్తున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని బోధనేతర సిబ్బంది బ్యాక్లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని వారు కోరారు. మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో "యూనివర్సిటీ నాన్ టీచింగ్ సిబ్బంది బీసీ బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ" అనే అంశంపై జరిగిన మీడియా సమావేశంలో ఆ మేరకు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 1997 లో ఆనాటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం బిసి బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని జారీచేసిన జీవోను తదనంతర ప్రభుత్వాలు అమలు చేయలేదన్నారు. ఈ అంశంపై అనేక దశాబ్దాలుగా పోరాడుతుంటే తిరిగి ఈనాటికి సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వం లోని ఎన్డీఏ కూటమి



ప్రభుత్వ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఎట్టకేలకు తొలిసారిగా బోధనా సిబ్బంది అసిస్టెంట్ అసోసియేట్ ప్రొఫెసర్లు మరియు ఆచార్యుల పోస్టులకు బ్యాక్లాగ్ మరియు క్యారీ ఫార్వర్డ్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి చరిత్ర సృష్టించడాన్ని బీసీ ఉద్యోగులతో పాటు మొత్తం బీసీ సమాజం హర్షిస్తుందన్నారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ, రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్, మంగళగిరి పట్టణ అధ్యక్షులు వెంకటకృష్ణ, మహిళా అధ్యక్షురాలు జి జయలక్ష్మి, జిల్లా యువజన నాయకులు ధనుంజయరావు, పలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

# సహజ వనరుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

## - కెఎల్‌యు డీన్ డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్

తాడేపల్లి, జులై 25, ప్రభాతవార్త. ప్రకృతి ప్రసాదించిన సహజ వనరులను సంరక్షించి భావితరాలకు అందించడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని కెఎల్ యూనివర్శిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధికారి డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్ పేర్కొన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మంగళగిరి మండలంలోని నూతక్కి గ్రామంలో కెఎల్ యూనివర్శిటీ సిఎస్ఈ2, ఏఐ డీఎస్ ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ



సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్లకార్డులతో గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, భూమి, నీరు, గాలి కాలుష్యాన్ని నివారించడం, విస్తృతంగా మొక్కలు నాటడం, అడవులను పరిరక్షించడం, అలాగే ఖనిజాలు, చమురు, సహజ వాయువులు, నీటి వనరులు, సారవంతమైన నేల మరియు వన్యప్రాణులను సంరక్షించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సి.హెచ్. నాగమణి వివరించారు. సుస్థిరమైన పర్యావరణాన్ని అందించాలనే సంకల్పాన్ని బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ సమన్వయకర్త డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను ఫీల్డ్ కోఆర్డినేటర్ పి. సురేష్‌ను కెఎల్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, విభాగాధిపతులు డాక్టర్ బి. తిరుపతి రెడ్డి, డాక్టర్ ఎం. వెంకట నరేష్ తదితరులు అభినందించారు.


# ఎన్నారై కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీలో వైట్ కోట్ వేడుకలు

మంగళగిరి, జూలై 25, ప్రభాతవార్త : మంగళగిరి నగర పరిధిలోని చినకాకానిలోని ఎన్నారై కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ నందు శుక్రవారం 2025 బ్యాచ్ విద్యార్థులకు "వైట్ కోట్ వేడుకలు, 2021 బ్యాచ్ విద్యార్థులకు "ఫేర్‌వెల్ కార్యక్రమం" ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ విద్యావేత్త, భాష్యం గ్రూప్స్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ వ్యవస్థాపకులు, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ హాజరై మాట్లాడారు.



ప్రస్తుత జీవన విధానంలో ఫిజియోథెరపీ ప్రాముఖ్యతను వివరిస్తూ, వృత్తిపట్ల నిబద్ధతతో పనిచేయాలని, క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా సాధన చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఎన్నారై కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ డా. బి రాజేష్ మాట్లాడుతూ, అంకితభావంతో ఉత్తమ నైపుణ్యాలను అలవర్చుకొని మంచి ఫిజియోథెరపిస్ట్‌లుగా ఎదగాలని, సీనియర్లకు సేవాభావంతో వైద్యసేవలు అందించి ఎన్నారై కాలేజ్ కు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రెసిడెంట్ డా. ఆవుల సురేంద్ర, సెక్రటరీ సోము కృష్ణమూర్తి, జాయింట్ సెక్రటరీ డా. మణి అక్కినేని, ట్రెజరర్ కె. బాపిరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డా. ఎన్ లక్ష్మి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డా. జి శ్రీనివాసరావు, డా. కెవిఎస్ కుమార్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# ఈ వీడియోనే నా వాంగ్మూలం... అంటూ రైతు నాగరాజు సెల్ఫీ వీడియో.. అనంతరం ఆత్మహత్య



అచ్చంపేట, జులై 25 (ప్రభాత వార్త ): పల్నాడు జిల్లా పెద్దకూరపాడు నియోజకవర్గం పరిధిలోని అచ్చంపేట మండలం నిండుజర్ల గ్రామానికి చెందిన రైతు కడిమెళ్ల నాగరాజు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం జిల్లాలో తీవ్ర సంచలనానికి దారితీసింది. ఆత్మహత్యకు ముందు నాగరాజు విడుదల చేసిన సెల్ఫీ వీడియోలో "ఈ వీడియోనే నా వాంగ్మూలం" అంటూ తన మరణానికి అచ్చంపేట సీఐ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ సురేష్, గ్రామానికి చెందిన బాగేశ్వరరావుతో పాటు మరికొందరు కారణమని ఆరోపించినట్లు వీడియోలో కనిపిస్తోంది. ఈ వీడియో ప్రస్తుతం పల్నాడు జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, ప్రేమ వ్యవహారానికి సంబంధించిన వివాదంలో నాగరాజు తీవ్ర మనోవేదనకు గురయ్యాడని, న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించినప్పటికీ ఫిర్యాదుపై సరైన చర్యలు తీసుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. అనంతరం మనస్తాపంతో పురుగుల మందు తాగిన నాగరాజు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. నాగరాజు మృతి అనంతరం సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు మృతదేహంతో ఆందోళనకు దిగారు. సెల్ఫీ వీడియోలో చేసిన ఆరోపణలపై వెంటనే నిష్పాక్షిక విచారణ చేపట్టి, విచారణలో ఆరోపణలు నిజమని తేలితే అచ్చంపేట సీఐ శ్రీనివాసరావుతో పాటు బాధ్యులైన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటనతో పల్నాడు జిల్లా పెద్దకూరపాడు నియోజకవర్గంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సెల్ఫీ వీడియోలో వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులు పారదర్శకంగా విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని శిబిరం

చిలకలూరిపేట, జూలై 25, ప్రభాతవార్త: నాదెండ్ల మండలంలో స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని శిబిరం పరిశీల నఆరోగ్యంపై అవగాహనతో పాటు ప్రతి ఇంటా న్యూట్రి గార్డెన్ ఏర్పాటు చేయాలి: స్పెషల్ ఆఫీసర్ కె. అమల కుమారినాదెండ్ల, జూలై 25 : జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఖీస్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని (సంజీవని)ఖీ కార్యక్రమంలో భాగంగా శనివారం నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ కె. అమల కుమారి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చిరుమామిళ్ల గ్రామ ప్రత్యేకాధికారి ఎం. కృష్ణారెడ్డి, వైద్య ఆరోగ్య సూపర్వైజర్ దిలీప్ కుమార్, పంచాయతీ కార్యదర్శి యాకోబు, గ్రామ పెద్దలు శ్రీనివాస్ రెడ్డి, శివారెడ్డి, హరికృష్ణ, నాగిరెడ్డి, స్వర్ణ గ్రామ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. శిబిరంలో డయాబెటిస్, రక్తపోటుతో బాధపడుతున్న వారికి అందిస్తున్న వైద్య సేవలు, మందుల పంపిణీ, వైద్య పరీక్షల నిర్వహణపై స్పెషల్ ఆఫీసర్ ఆరా తీశారు. అలాగే గ్రామంలోని గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిస్థితి, వారికి అందిస్తున్న సేవలు, క్రమం తప్పకుండా చేపడుతున్న ఫాలోఅప్ వివరాలను ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. తల్లి–శిశు ఆరోగ్య పరిరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అనంతరం చిరుమామిళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఆర్ (దిశిళి) నిర్వహణ విధానం, పాముకాటు సంభవించినప్పుడు అత్యవసరంగా తీసుకోవాల్సిన చర్యలను ప్రాక్టికల్గా ప్రదర్శించి అవగాహన కల్పించారు. తదుపరి పాఠశాలలో ఏర్పాటు చేసిన న్యూట్రి గార్డెన్ను పరిశీలించారు. ప్రతి పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, పీహెచ్సీ ప్రాంగణంలో ఖాళీ స్థలం ఉన్నచోట న్యూట్రి గార్డెన్లు ఏర్పాటు చేయాలని, ప్రతి ఇంటా కూరగాయలు పండించి పోషకాహారం తీసుకోవడం ద్వారా కుటుంబ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని కె. అమల కుమారి సూచించారు. సహజ పద్ధతుల్లో పండించిన తాజా కూరగాయల వినియోగం ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని ఆమె పేర్కొన్నారు.

## ఉచిత వైద్యశిబిరాల్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 25, ప్రభాతవార్త: ప్రభుత్వ వైద్యసేవలతో పాటు.. ప్రముఖ వైద్యులు, కార్పొరేట్ ఆసుపత్రులు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాల్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. ఆయన నాదెండ్ల మండల కేంద్రంలో నల్లమోతు రాజేంద్ర ప్రసాద్ జ్ఞాపకార్థం కిమ్స్ శిఖర ఆసుపత్రి ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామస్తుల్ని ఉద్దేశించి ప్రత్తిపాటి ప్రసంగించారు. తక్కువ ఖర్చుతో కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు ప్రజలకు నాణ్యమైన వైద్యసేవల్ని అందిస్తున్నాయని, వాటిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. కిమ్స్ శిఖర ఆసుపత్రి యాజమాన్యం నియోజకవర్గంలో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి, ప్రజల ఆరోగ్య రక్షణకు తమవంతు కృషి చేయాలని ప్రత్తిపాటి కోరారు. ఈ మెడికల్ క్యాంప్ లో 500 మంది ప్రజలకు పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మదన్ మోహన్, సొసైటీ చైర్మన్ నల్లమోతు హరిబాబు, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, టీడీపీ నాయకులు గంగా శ్రీనివాసరావు, నెల్లూరి విజయ సారధి, వేములపల్లి వెంకటేశ్వర్లు, నెల్లూరి పూర్ణయ్య, నల్లమోతు శివరామ ప్రసాద్, యనమదల సూర్యనారాయణ, వేములపల్లి బసవయ్య , శరత్, నిర్వాహకులు కంచర్ల శ్రీనివాసరావు, డాక్టర్ నల్లమోతు ప్రవీణ్, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సౌమ్య, కరీం, వెంకట నవీన్, అనూష, టీడీపీ నాయకులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీలోకి టిడిపి మాజీ కౌన్సిలర్



చిలకలూరిపేట, జూలై 25, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలోని 21వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ పల్లపు రమణ, సుమారు 20 కుటుంబాలతో కలిసి మాజీ మంత్రి విడదల రజిని సమక్షంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి విడదల రజిని వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తూ, ప్రజా సంక్షేమం కోసం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## విద్యార్థి,యువజనుల పోరాటాలతో దిగివచ్చిన కేంద్రం



చిలకలూరిపేట, జూలై 25, ప్రభాతవార్త: విద్యార్థి,యువజనుల పోరాటాలతో దిగివచ్చిన కేంద్రంనీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంత్రి పదవికి రాజీనామావిగితి ను కూడా రద్దు చేయాల్సిందే అని పరీక్షల నిర్వహణ ఆయా రాష్ట్రాలకు అప్పగించాలని రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ సుభాని డిమాండ్ చేశారు.

## తేనేటి విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా



సత్తెనపల్లి, జూలై 25, ప్రభాతవార్త: చిలకలూరిపేట శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు స్వగృహం వద్ద జరిగిన తేనేటి విందు కార్యక్రమం లో పల్నాడు జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు మరియు సహచర శాసన సభ్యులతో మరియు జిల్లా అధ్యక్షులు లతో కలిసి విందు కార్యక్రమం లో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ తదితరులు.

## విద్యార్థుల పై లాఠీ ఛార్జి ప్రజాస్వామ్యం పై దాడి గా భావించాలి. ..

సత్తెనపల్లి, జూలై 25, ప్రభాతవార్త: ఢిల్లీలో విద్యార్థులపై పోలీస్ దాడి, క్లాఫ్ జనతా పార్టీ పాశ్చికంగా సాధించిన విజయం పై పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఢిల్లీ ఘటన పై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన సూచించారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకా చంద్రశేఖర్ మాట్లాడుతూ రాత్రింబవళ్లు కష్టపడి చదివిన విద్యార్థులు ప్రశ్నపత్రాలు లాఠీలతో సమాధానం చెప్పారా...?" అది కేవలం విద్యార్థులపై జరిగిన దాడి కాదు. ఈ దేశ ప్రజాస్వామ్యం, రేపటి తరం భవిష్యత్తు పై జరిగిన ఘోరమైన దాడని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు న్యాయవాది దానవ జ్యాన్ రాజ్ పాల్ మాట్లాడుతూ



ప్రశ్నించే గొంతులను లాఠీలతో నొక్కేయవచ్చని ప్రభుత్వం అనుకుంటోందని కానీ వారికి తెలియంది ఏంటంటే విద్యార్థుల పై పడుతున్న ప్రతి లాఠీ దెబ్బ ఈ ప్రభుత్వ పతనానికి పునాది రాయి అవుతుందని ఆయన హెచ్చరించారు. సీనియర్ న్యాయవాది బత్తిన శ్రీనివాస్ బాబు, సిపిఐ పట్టణ కార్యదర్శి వల్లెం వెంకటేశ్వర్లు, పీడీఎం నాయకులు వై.వెంకటేశ్వర్లు లు ప్రసంగించారు. తొలుత కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి స్థానిక తాలూకా సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వర్ రెడ్డి పూల మాల వేసి నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాది చిన్నం మణి బాబు, మామిడి ప్రకాష్, గార్లపాటి ప్రభాకర్, దావులూరి కోటేశ్వరరావు, చిలకా జైపాల్, మాలపాటి విజయ్, జిల్లెల్ల పాల్ రాజ్, ఉన్నం రాణి, కొడవటి దేవానంద్, సిద్దెల మోహన్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

## సత్తెనపల్లిలో హై టెన్షన్





సత్తెనపల్లి, జూలై 25, ప్రభాతవార్త: తాలూకా సెంటర్ ఏరియా హాస్పిటల్ వద్ద బాధితుల మానవహారం అచ్చంపేట సీఐ శ్రీనివాసరావు కానిస్టేబుల్ రమేష్ సస్పెండ్ చేసి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుల కుటుంబం నడిరోడ్డుపై బైఠాయించారు పోలీసులకి బాధితులకు మధ్య గొడవ ఎక్కువ అవటంతో ట్రాఫిక్ అంతరాయం జరిగింది ఈ సంఘటన మరింత ఉద్రిక్తం కావడంతో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు రంగంలోకి దిగి బాధితులను అదుపులోకి తీసుకున్నారు

## వాగ్దేవి డిగ్రీ కాలేజి లో సీపీఆర్ అవగాహన సదస్సు

నరసరావుపేట, జులై 25, ప్రభాతవార్త: :స్థానిక రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కాలేజి (అటానమస్) లో అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడగల సీపీఆర్ పై అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే. రాజేంద్రప్రసాద్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సిపిఆర్ విధానాలను ఎంతో చక్కగా వివరించి, విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చామన్నారు. సేవాభావం, అంకితభావం మరియు సామాజిక బాధ్యత పట్ల చూపిన నిబద్ధత విద్యార్థులకు తెలుస్తుంది అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను ఎలా కాపాడాలో ప్రత్యక్షంగా నేర్చుకునే అవకాశం పొందారు. ఈ సదస్సు వల్ల విద్యార్థుల్లో ప్రథమ చికిత్స పట్ల అవగాహన పెరిగింది. గుండెపోటు, శ్వాస ఆగిపోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించి సరైన



పద్ధతిలో సీపీఆర్ అందించే నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకున్నారు. అలాగే ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యత మరియు మానవతా దృక్పథం కూడా పెంపొందాయి. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఎస్ఎస్ఎన్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు నిర్వహించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, కళాశాల చైర్మన్ కాట్ల రామకోటేశ్వరరావు, కళాశాల డైరెక్టర్స్ ఒగూరి నాగేశ్వరరావు, సూదా సురేష్ బాబు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి క్రిష్ణకిషోర్, అధ్యాపకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## .త్రికోటేశ్వర స్వామికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ ప్రత్యేక పూజలు..

నరసరావుపేట టౌన్ , జులై 25 ప్రభాతవార్త : పరమ పవిత్రమైన తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మీడియాతో ఆయన మాట్లాడారు. తొలి ఏకాదశి నేపథ్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వారం రోజుల ముందు నుంచే ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు తెలిపారు .కొండపైన,దిగువున ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. దేవస్థాన ప్రాంగణం మొత్తాన్ని శుభ్రం చేయించడంతో పాటు కొండపై, కింద ఉన్న దేవతా మూర్తుల విగ్రహాలకు రంగులు వేసి నూతన శోభ తీసుకువచ్చినట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం మంచినీటి వసతి, నిరంతర విద్యుత్ సరఫరా, క్యూలైన్లలో ప్రత్యేక షెడ్లు, మెట్ల మార్గం శుభ్రత, పర్యాటక





శాఖ ఆధ్వర్యంలో కొండపై ఉన్న పార్కు సుందరీకరణ వంటి అన్ని ఏర్పాట్లను ప్రత్యేకంగా పర్యవేక్షించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. శనివారం ఉదయం స్వామివారిని దర్శించుకుని భక్తులతో మాట్లాడారు. భక్తజనకోటి కీ తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. కోటప్పకొండ మీద త్రికోటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి వేలాదిగా భక్తులు వచ్చారని పేర్కొన్నారు. గిరి ప్రదక్షిణ కార్యక్రమంలోనూ పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నట్లు తెలిపారు. అదేవిధంగా పశువులకి, ఆవులకి, ఎద్దులకి, జీవాలన్నింటికీ గిరి ప్రదక్షిణ చేయించి పూజ చేయడం జరిగిందన్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి, సహాయ కమిషనర్ డి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ ఏకాదశికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామ న్నా రు.మూలవిరాట్ వద్ద అభిషేకానికి ఇబ్బంది కాబట్టి అభిషేక మండపాల్లో అభిషేకాలు చేయించుకుని అదే టికెట్ పై దర్శనానికి అనుమతించినట్లు తెలిపారు. స్వామివారి స్వయం దర్శనం, ప్రత్యేక దర్శనం, ఉచిత దర్శనాలు ఉన్నాయి. ఉచిత ప్రసాదం, వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేశామని సహాయ కమిషనర్ డి చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఆ లయ అధికారి చల్లా శ్రీనివాసరావు, సిబ్బంది, పాల్గొన్నారు.

## కోటప్పకొండ లో ఘనంగా తొలి ఏకాదశి పర్వదినం..

నరసరావుపేట, జూలై 25 ప్రభాతవార్త : మండలంలోని ప్రముఖశైవక్షేత్రమైన కోటప్పకొండ లో ఏకాదశి పర్వదినం శనివారం ఘనంగా జరిగింది. త్రికోటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు జిల్లాలోని






వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అదేవిధంగా ఇతర జిల్లాలు,రాష్ట్రాల నుండి సైతం భక్తులు,యాత్రికులు స్వామివారి దర్శనం కొరకు తరలివచ్చారు. ఏకాదశి పర్వదినం స్వామివారిని దర్శించుకుని పవిత్రమైన రోజు దైవ ఆశీస్సులు అందుతాయనే నమ్మకంతో భక్తులు ఆయా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొండపై భాగంలో ఉన్న పర్యాటక కేంద్రంలో, పిల్లల రాజ్యంలో, కాలింది మడుగు వద్ద,జింకర పార్కు వద్ద ,అక్వేరియం వద్ద కుందేళ్ళ పార్కు, బ్రహ్మ,విష్ణు,ముగ్గురమ్మ విగ్రహాల వద్ద,గణనాథని విగ్రహాల వద్ద భక్తుల సందడి కనిపించింది.ప్రైవేటు వాహనాలతో పాటు ఆర్టీసీ వాహనాలు పెద్ద సంఖ్యలో ప్రయాణికులను కోటప్పకొండకు తరలించాయి.

**ప్రత్యేక పూజలు :** త్రికోటేశ్వర స్వామికి తెల్లవారుజామునుండే ఆలయ అర్చకులు ప్రత్యేక అలంకరణలు,అభిషేకాలు పూజలునిర్వహించారు.సాధారణ భక్తజనంతో పాటు పలువురు వీఐపీలు, ప్రముఖులు, రాజకీయ ప్రతినిధులు ప్రత్యేక పూజలు పాల్గొన్నారు. స్వామివారి ఉచిత దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు అదే విధంగా లడ్డు, అరిశ, ప్రసాదాల కొరకు భక్తులు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున నుండి ప్రారంభమైన పూజలు, అభిషేకాలు రోజు మొత్తం కొనసాగుతూనే ఉన్నాయి. అదే విధంగా మెట్ల మార్గంలోనూ పూజా కార్యక్రమాలు జరిగాయి.స్వామి వారి ఆలయం వరకు భక్తులు మెట్ల పూజలు చేసి మొ క్కులు చెల్లించుకున్నారు. మహిళలు నాగేంద్ర స్వామి పుట్ట వద్ద, చెట్టు వద్ద దీపారాధన చేశారు. పొం గళ్లు పొంగించి ప్రసాద వితరణ చేశారు. దీంతోపాటు గొల్లభామ గుడి, పాతకోటయ్య స్వామి వద్ద సాలంకయ్య గుడి వద్ద భక్తుల సందడి నెలకొంది. రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఎద్దులను, పశువులను, వాహనాలను స్వామి చెంతకు తీసుకొని వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. స్వచ్ఛంద సంస్థలతో పాటు పలు అన్నదాన సత్రాల వద్ద భక్తుల కొరకు పులిహోర,గుగ్గిళ్ళు, అల్పాహారం, మంచినీరు పంపిణీ చేశారు. పోలీసులు ఘాట్ రోడ్ లోనూ కొండ దిగు వద్ద త్రికోటేశ్వరుని ఆలయం వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఆర్టీసీ వాహనాలు, ప్రైవేటు వాహనాలను, ద్విచక్ర వాహనాలను ట్రాఫిక్కు ఇబ్బంది కలగకుండా క్రమబద్ధీకరించారు.

## ఈశ్వర్ కళాశాలలో ఫస్ట్ ఎయిడ్' పై అవగాహన సదస్సు



నరసరావుపేట టౌన్, జులై 25 ప్రభాతవార్త :: స్థానిక ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్లో ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు "ప్రథమ చికిత్స ప్రాణ రక్షణ " పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్, వైద్య నిపుణులు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డా" భార్గవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు, గుండెపోటు, కుక్కకాటు, చౌకింగ్ పాము కాటు వంటి అత్యవసర సమయాల్లో చేయవలసిన ప్రథమ చికిత్స పద్ధతులపై ప్రత్యక్ష నిరూపణ (డెమో) ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాఖిఖి జి నాగమల్లేశ్వర రావు మాట్లాడుతూ మా కళాశాల విద్యార్థులు సమాజంలో ఒక బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలనే ఉద్దేశంతో ఇలాంటి ప్రత్యక్ష అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా డా"భార్గవి మాట్లాడుతూ గోల్డెన్ అవర్ లో అందించే సరైన వైద్యం లేదా ప్రథమ చికిత్స బాధితుడిని మృత్యుముఖం నుండి కాపాడుతుందన్నారు. ముఖ్యంగా ఈ రోజుల్లో గుండెపోటు రాగానే ఎలాచేయాలోప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రెటరీ అండ్ కరెస్పాండెంట్ షేక్ కరీం మోహిద్దీన్ , మేనేజింగ్ డైరెక్టర్ డా" షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ "సాంకేతిక విద్యతో పాటు విద్యార్థులలో సామాజిక బాధ్యత, మానవీయ విలువలు పెంపొందించడమే మా లక్ష్యం. అనుకోని ప్రమాదం జరిగినప్పుడు భయపడకుండా, సరైన సమయంలో స్పందించి ప్రథమ చికిత్స అందించడం వల్ల అమూల్యమైన ప్రాణాలను కాపాడుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, నాన్టీచింగ్ సిబ్బంది, వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ పిఓ హెచ్ గంగాధర్ రావు, ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్, సిపిఆర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్

రాజుపాలెం, జూలై 25, ప్రభాతవార్త: మండలంలోని అన్ని గ్రామ పంచాయతిలలో స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శని కార్యక్రమం ప్రతినెల నాలుగవ నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ రాంబాబు నాయక్ తెలియచేసినారు మండలంలోని మొక్కపాడు పంచాయతి లో వైద్యాధికారి డాక్టర్ రాంబాబునాయక్ మాట్లాడుతూ ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్, సిపిఆర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ గూర్చి ఆశా వర్కర్లు, అంగన్వాడీలు, ఏఎన్ఎం లకు, గ్రామ ప్రజలకు ఇలా చేయాలని నేర్పించిన్నారు, పాము కాటుకు ,కుక్క కాటుకు, బ్లీడింగ్




అవుతుంటే ఎలా కాపాడాలి, కరెంట్ షాక్ తగిలినప్పుడు ఏం చేయాలి , అంగన్వాడి స్కూల్ పిల్లలు ఏవైనా వస్తువులు మింగిన ఏం చేయాలని దానిమీద వివరంగా డెమో చేసి వివరించినారు. వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఇంటిలో, ప్రతి స్కూలులో ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేసుకోవాలని ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబు నాయక్ తెలియచేసినారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు జీవనరావు, సచివాలయం సెక్రటరీ మహంకాలమ్మ, హరిత,ఏ.ఎన్.ఎమ్ దుర్గ , ఉపాధ్యా యులు నాగేశ్వరావు ఆశా కార్యకర్తలు పాల్గున్నారు

## ఎల్ నినో తీవ్రత దృష్ట్యా రైతులు వరి సాగుపై పునరాలోచించాలి: గొట్టిపాటి

చిలకలూరిపేట, జూలై 25, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా అభివృద్ధితో పాటు.. ప్రజల సంక్షేమం, ప్రభుత్వ పనితీరు సహా పలు ప్రధానాంశాలపై ప్రతినెలా కూటమి ప్రజాప్రతినిధులు నిర్వహించే విందు సమావేశంలో భాగంగా నేడు చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు నివాసంలో సమావేశమైనట్టు జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు నివాసంలో మంత్రి గొట్టిపాటి ఆధ్వర్యంలో జిల్లా ప్రజాప్రతినిధుల విందు సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రి గొట్టిపాటి, చీఫ్ విప్ జీ.వీ. ఆంజనేయులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవిందబాబు, యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్, టీడీపీ జిల్లా అధ్యక్షులు షేక్



జానీ సైదా పాల్గొన్నారు. సమావేశానంతరం మంత్రి గొట్టిపాటి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి, చీఫ్ విప్ జీవి విలేకరులతో మాట్లాడారు. ఎల్ నినో ప్రభావం దృష్ట్యా రైతులు వరిసాగుపై పునరాలోచించాలి : గొట్టిపాటి ఎల్ నినో ప్రభావ తీవ్రతపై నిన్న జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా చర్చించామని, ఎన్నడూ లేని విధంగా మొదటిసారి గోదావరి నీటి మట్టం కూడా తగ్గిందని, కృష్ణా నదికి ఎప్పుడు నీళ్లు వస్తాయో తెలియని పరిస్థితని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరిసాగు చేపట్టకపోవడమే మంచిదని, రైతులు కూడా దీనిపై పునరాలోచన చేయాలని గొట్టిపాటి సూచించారు. వర్షాధార పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలన్నారు. తాగునీటి సరఫరాతో పాటు. పశుగ్రాసంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. ఎల్ నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ అధికమై.. సరఫరాలో సమస్యలు ఏర్పడుతున్నాయని గొట్టిపాటి చెప్పారు. ప్రజా ప్రతినిధుల ఆత్మీయ విందు సమావేశంలో భాగంగా నేడు పలు అంశాలపై ప్రజా ప్రతినిధులందరం చర్చించామన్న గొట్టిపాటి. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల్ని ప్రజలకు చేరువ చేయడంతో పాటు, పార్టీ కార్యక్రమాలపై చర్చించుకున్నట్టు గొట్టిపాటి వివరించారు. జిల్లా ప్రజా ప్రతినిధులందరం సమిష్టిగా, ఐక్యంగా ప్రభుత్వ కార్యక్రమాల్ని విజయవంతం చేస్తున్నామన్నారు. పల్నాడులో అన్ని స్థానాల్లో కూటమి స్వీప్ చేస్తుంది : జీ.వీ. ఆంజనేయులు (చీఫ్ విప్) ఐకమత్యమే బలమనే సూత్రానికి కట్టుబడి ప్రజా ప్రతినిధులందరం ప్రతినెలా జిల్లా అభివృద్ధిపై చర్చిస్తున్నామని, తమందరి మధ్య ఉన్న సత్సంబంధాలతో ప్రజలకు, జిల్లాకు మంచి మేలు కలుగుతుందని చీఫ్ విప్ ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ తరహా విందు సమావేశాల్లో అరమరికలు లేకుండా అన్ని అంశాలపై చర్చించడం బాగుందన్నారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో పల్నాడు జిల్లాలో అన్ని స్థానాల్లో విజయం సాధించి, కూటమిప్రభుత్వం స్వీప్ చేస్తుందని జీవీ అభిప్రాయపడ్డారు. స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నాం : ప్రత్తిపాటి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ సూచనలో భాగంగా ప్రతినెలా ఒక ప్రజా ప్రతినిధి నివాసంలో కూటమి ప్రజా ప్రతినిదులందరూ సమావేశమవుతున్నామని, దానిలో భాగమే నేటి సమావేశమని ప్రత్తిపాటి చెప్పారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో సమ అభివృద్ధి, ప్రజా సంక్షేమంతో పాటు. పార్టీ కార్యక్రమాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంపై సమగ్రంగా చర్చించామని ప్రత్తిపాటి తెలిపారు. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ఒక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని నిర్ణయించామన్నారు. వైసీపీ విషప్రచారాన్ని, ఆ పార్టీ నేతల దుర్మార్గాలు, అరాచకాలపై ప్రజల్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ, రాష్ట్రాభివృద్ధిలో ప్రజల్ని భాగస్వాముల్నిచేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. జిల్లాలో అందరూ టీడీపీఎమ్మెల్యేలే ఉన్నారని, ఈ తరహా ఆత్మీయ సమావేశాల్లో కూటమి ఎమ్మెల్యేలు అందరూ పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. టీడీపీ ఇంటింటి ప్రచారంపై చర్చించాం : షేక్ జానీ సైదా (టీడీపీ జిల్లా అధ్యక్షులు) పార్టీ, ప్రభుత్వపరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, విధివిధానాలపై ప్రతినెలా ఒక ప్రజా ప్రతినిధి ఇంట్లో విందు సమావేశం నిర్వహిస్తున్నామని, 27వ తేదీ నుంచి టీడీపీ నిర్వహించే ఇంటింటిప్రచారంపై నేటి సమావేశంలో చర్చించినట్టు టీడీపీ జిల్లా అధ్యక్షులు షేక్ జానీ సైదా తెలిపారు. వచ్చేనెలలో చీఫ్ విప్ జీ.వీ.ఆంజనేయులు నివాసంలో నాలుగో విందు సమావేశం జరుగుతుందన్నారు.

## రూ.10కోట్ల టీటీడీ నిధులతో బొప్పూడి వెకంటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 25, ప్రభాతవార్త: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు శనివారం బొప్పూడి వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ప్రత్తిపాటికి అర్చకులు, ఆలయ పాలకమండలి సభ్యులు ఘనస్వాగతం పలికారు. స్వామివారి సన్నిధిలో



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రత్తిపాటి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదానాన్ని ప్రారంభించి, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ అభివృద్ధిపై దేవస్థాన కమిటీ సభ్యులతో చర్చించిన ప్రత్తిపాటి.. టీటీడీ నుంచి రూ.10కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులతో కొండపై మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేయడంతో పాటు.. రోడ్లు మార్గాన్ని మరింత విస్తరీకరిస్తామని ఈ సందర్భంగా ప్రత్తిపాటి తెలిపారు. ప్రస్తుతం విడుదలైన నిధుల చాలని పక్షంలో భవిష్యత్ లో ప్రభుత్వం, దాతల సహకారంతో అవసరమైన నిధులు సమీకరించి, ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ప్రత్తిపాటి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు గంగా శ్రీనివాసరావు, అంబటి సొంబాబు, గుంటి కోటేశ్వరరావు, గుంటి హరిబాబు, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డల ఆరోగ్యమే ప్రతి కుటుంబానికి నిజమైన ఆస్తి

చిలకలూరిపేట, జూలై 25, ప్రభాతవార్త: మహిళల ఆరోగ్యం బాగుంటేనే సమాజం బాగుంటుందని, ఇంటిని ముందుకు నడిపించే స్త్రీ మూర్తులు అనారోగ్యంపాలైతే.. ఆ ఇంటితోపాటు.. సమాజం, తర్వాత రాష్ట్రమే వెనుకబడతాయని శాసనసభ్యులు ప్రత్తిపాట పుల్లారావు తెలిపారు. గ్రామీణ మహిళల ఆరోగ్యంపైనే కుటుంబాల సంక్షేమం ఆధారపడి ఉంటుందన్నారు. శుక్రవారం బొప్పూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏర్పాటు చేసిన స్వర్ణగ్రామం ఆరోగ్య దర్శిని (మహిళలు ఎదుర్కొనే అనారోగ్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధుల ప్రత్యేక అవగాహనా శిబిరం) ని జిల్లా కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లాతో కలిసి ప్రత్తిపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన గ్రామసభలో కలెక్టర్, ప్రత్తిపాటి మాట్లాడారు. అనంతరం వారు స్థానిక అంగన్ వాడీకేంద్రాన్ని పరిశీలించారు. ఆడబిడ్డల ఆరోగ్యమే ..కుటుంబానికి



మహాభాగ్యం ఆడబిడ్డల ఆరోగ్యమే ప్రతి కుటుంబానికి విలువైన ఆస్తి అని, గర్భధారణ, ప్రసవ సమయంలో వారు పడే వేదన మాటల్లో వర్ణించలేనిదన్నారు. మన మనుగడకు కారకులైన మహిళలు ఎంత సంతోషంగా ఉంటే.. ఆ ఇల్లు అంత వృద్ధి చెందుతుందని ప్రత్తిపాటి చెప్పారు. ఇల్లాలి చదువు...ఇంటికి వెలుగన్నది ఎంత నిజమో. ఆడబిడ్డల ఆరోగ్యం.. ప్రతికుటుంబానికి మహాభాగ్యం అనేది అంతే నిజమని ప్రత్తిపాటి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అంగన్ వాడీ కేంద్రాలు చిన్నారుల వ్యక్తిత్వ వికాస, ఆరోగ్యరక్షా కేంద్రాలుగా మారాయన్నారు. ప్రభుత్వం అందిస్తోన్న మంచి పౌష్టికాహారంతో చిన్నారులు ఉత్సాహంగా గడుపుతూ, ఆటపాటల్లో మునిగి తేలుతున్నారన్నారు. బాలింతలు, గర్భిణులకు అవసరమైన ప్రత్యేక వైద్యసేవలతో పాటు.. వారి ఆరోగ్యానికి అవసరమైన పోషకాహారాన్ని అంగన్ వాడీలు అందిస్తున్నాయన్నారు.

**అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్..** ప్రత్తిపాటి స్వర్ణగ్రామం – ఆరోగ్యదర్శిని కార్యక్రమానంతరం ఎమ్మెల్యే ప్రత్తిపాటి, కలెక్టర్ కృతికా శుక్లా స్థానిక అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించి, చిన్నారులు..బాలింతలు.. గర్భిణులకు అందుతున్న సేవలు, పౌష్టికాహార నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిన్నారులతో ప్రత్యేకంగా ముచ్చటించి, కాసేపు వారితో గడిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, టీడీపీ నాయకులు అంబటి సొంబాబు, గుంటి కోటేశ్వరరావు, గుంటి హరిబాబు, గంగా శ్రీనివాసరావు , డిప్యూటీ కలెక్టర్ బి లీలారాణి, ఎంపిడిఓ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

26MN 7PG-GNT_26MN 7PG-GNT.qxd 26-07-2026 AM 12:11 Page 1



## గుర్రం జాషువా చిరస్మరణీయులు

గుంటూరు విద్య జూలై 24 ప్రభాతవార్త : తెలుగు సాహిత్య రంగంలో సామాజిక చైతన్యాన్ని, మానవ సమానత్వాన్ని, అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని తన కలంతో శక్తివంతంగా ప్రతిధ్వనింపజేసిన మహాకవి గుర్రం జాషువా చిరస్మరణీయులని ఆయన వర్ధంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అర్పిస్తున్నామని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు యేసుబాబు మాదిగ తెలిపారు. గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గుర్రం జాషువా గారు తెలుగు సాహిత్యంలో ప్రగతిశీల ఆలోచనలకు దారిచూపిన కవిగా, కులవివక్షకు వ్యతిరేకంగా గళమెత్తిన మహనీయుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. జాషువా జీవితమంతా సామాజిక అసమానతలపై పోరాటానికి, మానవ విలువల పరిరక్షణకు అంకితమైందని ఆయన అన్నారు. గబ్బిలం వంటి రచనల ద్వారా దళితుల బాధలు, సమాజంలోని అన్యాయాలు, సమాన హక్కుల అవసరాన్ని అత్యంత హృద్యంగా ప్రజలకు చేరవేశారని చెప్పారు. ఈ సందర్భంగా యేసుబాబు మాదిగ మాట్లాడుతూ, "జాషువా గారి సాహిత్యం కేవలం కవిత్వం మాత్రమే కాదు; అది సమాజాన్ని ఆలోచింపజేసే శక్తి, అణగారిన మనుషుల గౌరవ పోరాటానికి మార్గదర్శక దీపం. నేటి తరాలు ఆయన భావజాలాన్ని అధ్యయనం చేసి, సామాజిక న్యాయం, సమానత్వం, మానవత్వం కోసం కట్టుబడి పనిచేయాలి" అని పిలుపునిచ్చారు. జాషువా గారి ఆశయాలు నేటికీ సమకాలీనమని, ఆయన చూపిన మార్గం సమాన సమాజ నిర్మాణానికి ప్రేరణనిస్తోందని పేర్కొన్నారు మాచవరపు డేవిడ్ మాచవరపు దాసు మాచవరపు దేవా, ప్రశాంత్, సుబ్బయ్య, చంద్రశేఖర్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఢిల్లీలో విద్యార్థులపై లాఠీ ఛార్జ్ అమానుషం

గుంటూరు విద్య జులై 24 ప్రభాతవార్త : ఢిల్లీలో విద్యార్థుల మీద ఎన్ డి ఏ బీజేపీ మోడీ సర్కార్ చేయించిన దాడి ని తీవ్రంగా ఖండిస్తున్నామని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ తెలిపారు. కార్యకర్తల సమావేశం లో ఆయన మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యాసంస్థల బంద్ కు మద్దత్తు ప్రకటించారు. దేశ వ్యాప్తంగా జరిగిన నీట్ పరీక్ష



పేపర్ లీకేజి, సి. బి. ఎస్. సి లో జరుగుతున్న అక్రమాలు, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఆర్ఆర్బి, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, బ్యాంకు ఉద్యోగ పరీక్షలు, ఆర్మీ ,నేవీ, ఎయిర్ ఫోర్స్ ల్లోని వివిధ ఉద్యోగ ఖాళీల భర్తీ కోసం జరుగుతున్న ఉద్యోగ పరీక్షలు సైతం బీజేపీ పెద్దల సహకారం తో లీకేజీలు జరిపిస్తూ కోట్లాది విద్యార్థి నిరుద్యోగుల భవిష్యత్తు ను మోడీ ఎన్డీఏ సర్కార్ సమాధి చేస్తుందని ఆందోళన వ్యక్తం చేసారు. అన్ని రంగాల్లో బీజేపీ సర్కార్ పూర్తి గా విఫలం చెందిందని ఇక ప్రధాని హోదాలో కొనసాగే నరేంద్ర మోడీ కి అర్హత లేదన్నారు. విద్యా శాఖ మంత్రి ధర్మేందర్ ప్రధాన్ తో పాటు ప్రధాని నరేంద్ర మోడీ రాజీనామా చేయాలనీ కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో విద్యార్థులలు పెద్ద ఎత్తున పోరాటం చేస్తున్న వారిపైన అమానుషం. కిరాతంగా దాడులు చేస్తుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీఎం చంద్రబాబు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రతిపక్షం వైస్. జగన్ మోహన్ రెడ్డి లు స్పందించకపోవడం దారుణం అన్నారు. మోడీ సర్కార్ ను విద్యార్థులే అతి తొందరి లోనే గద్దె దించుతారని కృష్ణ స్వరూప్ ప్రకటించారు. భారత ప్రజాస్వామ్యం. డాక్టర్ అంబేద్కర్ రూపొందించిన సమతా రాజ్యాంగం ను రక్షించికోకపోతే భారత పౌర సమాజానికి బౌషత్ లేదని..మానవ హక్కులు ఉండవన్నారు. బానిసత్వం తప్పదన్నారు. ఈ ఉద్యమం నకు అన్ని రాజకీయ పక్షం. అద్వకేట్లు. యావత్ ప్రజానీకం విద్యార్థుల. యువత ఉద్యమం కు అండదండలు అందించాలని కృష్ణ స్వరూప్ విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమం లో పార్టీ ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జ్ ఎస్. ఆంజనేయులు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ జిలాని. మాలమహానాడు ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జ్ ఎమ్. ప్నపడు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసద్గురు శ్రీనారాయణ తీర్థుల 351వ జయంతి మహోత్సవం

గుంటూరు కల్చరల్, జూలై 25, ప్రభాతవార్త : స్థానిక లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ మందిరం, శ్రీ త్యాగరాజ కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సమ్మండలి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సద్గురు శ్రీనారాయణతీర్థుల 351వ జయంతి మహోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చార్టర్డ్ అకౌంటెంట్ చావలి గణపతి, గుంటూరు మరియు విశ్రాంత మేనేజర్ స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ హైదరాబాద్, చల్లపల్లి సుబ్బారావు దంపతులు, సంస్థ అధ్యక్షులు డాక్టర్ పి.విజయ ప్రధానకార్యదర్శి ఎం.వై.శేషాచారి, త్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ తదితరులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం స్థానిక విద్వాంసులచే నారాయణ తీర్థ తరంగ గానం అభిమానులను అలరించింది. త్యాగరాజ కళావేదికలో భాగంగా ఆ.లీలావతి, హైదరాబాద్ వారి గాత్ర కచేరి శ్రావ్యంగా గానం చేసి సంగీతాభిమానులను అలరించారు. వీరికి వయొలిన్ పై చావలి శ్రీనివాస్, విజయవాడ, మృదంగంపై కామరాజు కిశోర్, విజయవాడ లు చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, ప్రధానకార్యదర్శి ఎం.వై.శేషాచారి, ఉపాధ్యక్షులు మాధవపెద్ది మీనాక్షి, డాక్టర్ రాజరాజేశ్వరి, పాటిబండ లలిత, కార్యదర్శి ఏ.వి.మంగాదేవి, కోశాధికారి మాధవపెద్ది విజయలక్ష్మి ఆతిథులను, కళాకారులను ఘనంగా సత్కరించారు.

## జాషువా కవితా పటిమను ధీరోదాత్తతను నేటి కవులు ఆదర్శంగా తీసుకోవాలి

గుంటూరు కల్చరల్, జూలై 25, ప్రభాతవార్త : నిత్య జీవితంలో కానీ, సాహితీజీవితంలో కానీ ఎన్ని కష్టాలు ఎదురైనా ధీరత్వంతో నిబ్బరంగా నిల్చిన గుర్రం జాషువా కవితా పటిమను, ధీరోదాత్తతను నేటి కవులు ఆదర్శంగా తీసుకొని నడుచుకోవాలని గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా రెండు రోజులు నిర్వహించిన కార్యక్రమ ముగింపులో ప్రసంగించిన కవులు, సాహితీవేత్తలు అన్నారు. అవగాహన సంస్థ కార్యాలయంలో రెండురోజులు జాషువా కవితాలాపన కార్యక్రమం అద్భుతంగా కొనసాగింది. కార్యక్రమానికి కవి జమదగ్ని అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సాహితీవేత్త ముప్పాళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ పుట్టుకతో దళితుడై కృషితో కవికోకిలై నవయుగ కవిచక్రవర్తియై తన కవితా యాత్ర విజయకేతనాన్ని తెలుగు సాహితీగగనంలో ఉన్నతస్థాన ఎగరేసిన విశ్వమానవుడు గుర్రం జాషువా అన్నారు. తెలుగు పండితులు రాజన్నశాస్త్రి మాట్లాడుతూ జాషువా కవిత్వం సంస్కరణ భరితంగా సాగిందని ఆయన రచనలు ఫిరదౌసి, గబ్బిలం, ముంతాజ్ మహల్, స్మశానవాటిక వంటి ఖండకావ్యాలు సామాన్యులను కూడా ఆలోచింపచేయున్నాయి. జాషువా రచించిన గబ్బిలం, ఫిరదౌసిలోని పద్యాలను కవులు సుబ్రహ్మణ్యం, పి.సుబ్బారావు, గాయనీగాయకులు రమణి, విజయలక్ష్మి, భాగ్యలక్ష్మి, సాయిబాబు, రాజశేఖర్ లు ఆలాపించారు.

## అంతరిక్ష రంగానికి ప్రైవేటు శక్తులకు అప్పగించేందుకు సాగుతున్న ప్రయత్నాలు ఆందోళనకరం

గుంటూరు కల్చరల్, జూలై 24, ప్రభాతవార్త : దేశ భద్రత, సర్వతోముఖాభివృద్ధికి ఎంతో కీలకమైన అంతరిక్ష రంగానికి ప్రైవేటు శక్తులు అప్పగించేందుకు సాగుతున్న యత్నాలు ఆందోళనకరమని అవగాహన సంస్థ విమర్శించింది. దశాబ్దాలపాటు ఎంతో అంకితభావంతో కృషిచేసిన ఇస్రోని మరింతగా ప్రోత్సహించి, తగినన్ని నిధులు కేటాయించి అభివృద్ధి చేయడానికి బదులుగా ఆ సంస్థను కార్పొరేట్ ప్రైవేటు శక్తుల చేతుల్లో పెట్టే నిబంధనలు ఒక్కొక్కటిగా సడలించడం దేశ ప్రయోజనాలకు విఘాతం కలిగించడమేనని అవగాహన సంస్థ విమర్శించింది. స్కైరూట్ ఏరో స్పేస్ నిర్మించిన విక్రమ్-1 రాకెట్ను ఐటీఐల శ్రీహరికోట నుంచి ప్రయోగించడం భారత అంతరిక్ష రంగాన్ని ప్రైవేటు రంగం చేతుల్లో పెట్టే తొలి ప్రయత్నమేనని అవగాహన సంస్థ ప్రకటించింది.

## ఘనంగా కళాభివంచి వార్షికోత్సవ వేడుకలు

గుంటూరు కల్చరల్, జూలై 25, ప్రభాతవార్త : స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై కళావంచి 20వ వార్షికోత్సవ వేడుక ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభకు సంస్థ అధ్యక్షులు బొప్పన నరసింహారావు అధ్యక్షత వహించారు.



అతిథులుగా వేదిక అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ రామరాజు శ్రీనివాస రావు, ప్రముఖ న్యాయ వాది వట్టిబొప్పన బ్రహ్మారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య, యువ కళావాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని ఏ.పి.ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్గా నియమితులైన సందర్భంగా డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావును, రంగస్థల టీవీ నటుడు దర్శకుడు డాక్టర్ గోవాడ వెంకట్ దంపతులను, డాక్టర్ అవుల శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ ఫిలిం చాంబర్స్ కార్యనిర్వాహక సభ్యులు వేమూరి బాలరత్నంలను కళా విపంచి పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సంస్థ నిర్వాహకులు బొప్పన నరసింహారావును ఆలయ కమిటీ వారు కళాకారులు, అభిమానులు ఘనంగా సత్కరించారు. సభానంతరం గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారు జ్యోతిరాధిత్య భీశెట్టి రచనకు డాక్టర్ గోవాడ వెంకట్ దర్శకత్వం వహించిన అమ్మ చెక్కిన బొమ్మ నాటికలు ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమాన్ని భాగి శివశంకరశాస్త్రి, డి.తిరుమలేశ్వరరావు, జి.మల్లికార్జునరావు, సయ్యద్ జానీభాష, జి.వి.జి.శంకర్ తదితరులు పర్యవేక్షించారు.

## నేడు అవగాహన...లో ఆరోగ్యసభ

గుంటూరు కల్చరల్, జూలై 25, ప్రభాతవార్త : అవగాహన సంస్థ గత 18సంవత్సరాల నుండి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న ఆరోగ్యసభల్లో భాగంగా ఈఆదివారం స్వరసమస్యలు-దుష్ప్రభావాలు-వాడే విధానం అనే అంశాలపై నిర్వహించబడుతుంది. జూలై 26 ఆదివారం ఉదయం 11గంటలకు సంస్థ కార్యాలయంలో జరిగే ఆరోగ్యసభలో ప్రముఖ ఈఎన్టి వైద్యులు డాక్టర్ వి.ఫణీంద్రకుమార్, ఫార్మాకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఏ.మీనాకుమారిలు వక్తలుగా పాల్గొంటారన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధులపై మందులు ఎలా వాడాలి? ఏ మందులు దుష్ప్రభావాలు కలుగచేస్తాయో తెలియజేసేలా ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆరోగ్యాభిలాషులందరూ ఈ ఆరోగ్యసభకు హాజరు కావాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.

## చైనా వేదికపై పల్నాడు యువ కోచ్ అరుదైన విజయం..

## భారత్ తరపున ఏకైక ప్రతినిధిగా నక్కా శ్రీనివాసరావు

యడ్లపాడు, జూలై 25, ప్రభాతవార్త : యడ్లపాడు మండలం మైదవోలు గ్రామానికి చెందిన యువ వాలీబాల్ కోచ్ నక్కా శ్రీనివాసరావు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన ఘనత సాధించి పల్నాడు జిల్లా ఖ్యాతిని ప్రపంచ వేదికపై చాటారు. చైనాలో జూలై 17 నుంచి 25 వరకు నిర్వహించిన ఫెడరేషన్




ఆఫ్ ఇంటర్నేషనల్ వాలీబాల్ డెవలప్మెంట్ లెవెల్-3 ఇంటర్నేషనల్ కోచెస్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసి అంతర్జాతీయ కోచ్గా గుర్తింపు పొందారు. భారతదేశంలోని పలు రాష్ట్రాల నుంచి ఎంపిక కోసం పంపిన కోచ్ల దరఖాస్తులను చైనా వాలీబాల్ అసోసియేషన్ పరిశీలించిన అనంతరం భారత్ తరపున నక్కా శ్రీనివాసరావును మాత్రమే ఎంపిక చేయడం విశేషం. ప్రతిష్ఠాత్మకమైన ఈ కోర్సును విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా ప్రపంచ స్థాయి కోచ్గా గుర్తింపు పొందిన ఆయన పల్నాడు జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా నక్కా శ్రీనివాసరావు లోని క్రీడా స్ఫూర్తిని గుర్తించి ఆర్థికంగా సహకరించి ప్రోత్సహించిన ముత్తవరపు సుబ్బారావు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, చిన్ననాటి నుంచే వాలీబాల్పై ఆసక్తి పెంచుకుని జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ కనబరిచిన శ్రీనివాసరావు, నేడు అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం యువతకు ఆదర్శమని అన్నారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, వాలీబాల్ అభిమానులు, దాతల సహకారంతో ఈ ఘనతను సాధించడం ఆయన పట్టుదల, కృషికి నిదర్శనమని కొనియాడారు. నక్కా శ్రీనివాసరావు సాధించిన ఈ అరుదైన విజయంపై వాలీబాల్ అభిమానులు, క్రీడాకారులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు. ఈ విజయం భారతదేశానికి, ఆంధ్రప్రదేశ్కు, పల్నాడు జిల్లాకు, యడ్లపాడు మండలానికి, మైదవోలు గ్రామానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిందని పేర్కొన్నారు.

## పీఎండీఎస్తో అధిక లాభాలు.. రైతులకు ప్రకృతి వ్యవసాయమే లాభసాటి

యడ్లపాడు, జులై 25, ప్రభాతవార్త : ప్రకృతి వ్యవసాయంలో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ విధానాన్ని అనుసరించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె అమల



కుమారి తెలిపారు. శుక్రవారం ఎడ్లపాడు మండలం సొలస గ్రామానికి చెందిన రైతు సాగి విజయలక్ష్మి ్మ పొలాన్ని ఆమె పరిశీలించారు. రెండు ఎకరాల్లో గత తొమ్మిది సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తుండగా, గత ఐదు సంవత్సరాలుగా 30 రకాల విత్తనాలతో పీఎండీఎస్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. పీఎండీఎస్ ద్వారా పెరిగిన పచ్చిమేతను భూమిలో కలియదున్నడంతో పాటు పశువులకు మేతగా వినియోగిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా రైతు పొలంలో 5 5 మీటర్ల విస్తీర్ణంలో నిర్వహించిన పంట కోత ప్రయోగంలో 63 కిలోల పచ్చిమేత దిగుబడి నమోదైనట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కె అమల కుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఆహార పదార్థాలను వినియోగించడం వల్ల కుటుంబ ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు వైద్య ఖర్చులు తగ్గి రైతుల ఆదాయం పెరుగుతుందని తెలిపారు. భూమాత ఆరోగ్యాన్ని కాపాడే ప్రకృతి వ్యవసాయం వల్ల నేలలో జీవవైవిధ్యం పెరిగి, వానపాముల సంఖ్య అధికమై నేల సారం సహజంగా వృద్ధి చెందుతుందని వివరించారు. అదేవిధంగా పీఎండీఎస్ విధానం ద్వారా భూమిలో జీవవైవిధ్యం మరింత పెరిగి, మొక్కలకు అవసరమైన పోషకాలు సహజసిద్ధంగా అందుతాయని, దీంతో పంటల దిగుబడి మెరుగై రైతులకు అధిక లాభాలు చేకూరుతాయని చెప్పారు. రైతుల ఆర్థికాభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వ్యవసాయ వ్యవస్థను అందించడంలో ప్రకృతి వ్యవసాయమే ఉత్తమ మార్గమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సాగి శ్రీనివాసరావు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

## ఎల్.ఎన్.పురం ప్రాథమిక పాఠశాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించిన జిల్లా విద్యాశాఖ అధికారి డా. షేక్ సలీమ్ బాషా

గుంటూరు విద్య జులై 25 ప్రభాతవార్త: జిల్లా విద్యాశాఖ అధికారి డా. షేక్ సలీమ్ బాషా గుంటూరు రూరల్ మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ఎల్.ఎన్.పురం, వెంగళాయపాలెం గ్రామంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. వంటశాల



పరిశుభ్రత, ఆహార నాణ్యత, మెనూ ప్రకారం భోజన తయారీ, తాగునీటి సౌకర్యాలు, భోజన పంపిణీ విధానం మరియు పరిశుభ్రత ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి డా. షేక్ సలీమ్ బాషా గారు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం రుచి, నాణ్యత, పరిశుభ్రతపై విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకు ప్రధానోపాధ్యాయులు, వంట సిబ్బంది మరియు సంబంధిత సిబ్బందిని అభినందించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి పఠన, రచన, గణిత నైపుణ్యాలు మరియు అభ్యాస స్థాయిని పరిశీలించారు. విద్యార్థులు ప్రశ్నలకు ఆత్మవిశ్వాసంతో సమాధానాలు ఇవ్వడం, పాఠ్యాంశాలపై మంచి అవగాహన కలిగి ఉండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పోషకాహారం, పరిశుభ్రత మరియు విలువలతో కూడిన విద్యను అందించడం అత్యంత ముఖ్యమని డా. షేక్ సలీమ్ బాషా తెలిపారు. ఈ ఆకస్మిక తనిఖీలో మండల విద్యాశాఖ అధికారి శ్రీమతి నాగేంద్రమ్మ ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి సూచనలను అమలు చేస్తూ విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తామని ఉపాధ్యాయులు తెలియజేశారు.

## వివిఐటియూ లో "ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వాడకం"పై సదస్సు

గుంటూరు విద్య జులై 25 ప్రభాతవార్త: వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్సిటీ నందు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం ఖిది ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియాఖి (ıని) ఆధ్వర్యంలో "ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్లో కౌంటర్ ఫ్యాక్చువల్స్ మరియు




ఎక్స్ప్లైలబుల్ ఏఐ" పై సదస్సును నిర్వహించినట్లు వివిఐటియూ ప్రోఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా దక్షిణ కొరియాలోని క్యూంగ్పూక్ నేషనల్ యూనివర్సిటీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ రామ్మోహన్ మల్లిపెద్ది హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రామ్మోహన్ మాట్లాడుతూ.. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం వేగంగా పెరుగుతోందన్నారు. విద్యుత్ వ్యవస్థలు, ఎలక్ట్రిక్ వాహనాలు, ట్రాన్స్ఫార్మర్లలో సురక్షితమైన నిర్ణయాలు తీసుకోవడానికి ఖిఎక్స్ప్లైలబుల్ ఏఐఖి ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్యుత్ వ్యవస్థలో ఏదైనా సాంకేతిక సమస్య లేదా అస్థిరత ఏర్పడినప్పుడు కేవలం సమస్యను మాత్రమే చెప్పకుండా, పరిష్కార మార్గాలను కూడా ఖికౌంటర్ ఫ్యాక్చువల్స్ఖి సాంకేతికత చూపుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిఐటియూ రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఏ.వి. నరేష్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

## దేశంలోని ఫార్మసీ కళాశాలలకు క్యూసిఐ అక్రిడేషన్ గ్రేడ్స్ విడుదల

గుంటూరు విద్య జూలై 25 ప్రభాతవార్త: భారతదేశంలోని వివిధ ఫార్మసీ కళాశాలలకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(శిది) వారి ఆధ్వర్యంలో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (శీది) అనుబంధ విభాగం అయిన నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఫర్ ఎడ్యుకేషన్ మరియు (ట్రైనింగ్ (వితిళినిగి) వారు నిర్వహించిన అక్రిడేషన్ అండ్ అసెస్మెంట్ ప్రాసెస్లో వివిధ కళాశాలకు గ్రేడ్లు మరియు ర్యాంకులను విడుదల చేసింది. దేశంలోని సుమారు 400 ఫార్మసీ కళాశాలలో ఈ అక్రిడేషన్ అండ్ అసెస్మెంట్లో తమ కళాశాలల సమాచారాన్ని సమర్పించి తదుపరి వితితీనిగి వారి త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో వారి కళాశాలను అసెస్మెంట్ చేసి రిపోర్టులను సబ్మిట్ చేయడం జరిగింది. ఫార్మసీ కళాశాలల విద్యా ప్రామాణికాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, రీసెర్చ్ మరియు అధ్యాపక క్వాలిఫికేషన్స్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ఈ గ్రేడ్లను ఇవ్వడం జరిగింది. దేశవ్యాప్తంగా 400 ఫార్మసీ కళాశాలలో 64 కళాశాలలకు ఏ గ్రేడ్, 104 కాలేజీలకు బి గ్రేడ్, 71 కాలేజీలకు సీ గ్రేడ్, మరియు 159 కళాశాలకు డి గ్రేడ్ ఇవ్వడం జరిగింది. ఈ గ్రేడులు పర2సెంటైల్ ఆధారంగా 75 పర2సెంట్రల్ పైన స్కోరు సాధించిన కళాశాలకు ఏ గ్రేడు అంతకంటే తక్కువ కళాశాలకు బీ, సీ, మరియు డి గ్రేడులు ఇవ్వడం జరిగింది. దేశంలో మణిపాల్ కాలేజీ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, కర్ణాటక ఎష్ణు ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, మెదక్, శ్రీమతి, కిశోరీతై బోయర్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ, మహారాష్ట్ర ఏ గ్రేడు సాధించినవి. అంతేకాకుండా మన రాష్ట్రం నుండి 24 ఫార్మసీ కళాశాలకు ఈ అక్రిడేషన్ అండ్ అసెస్మెంట్లో పాల్గొనగా కళాశాలలకు ఏ గ్రేడు, 5 కళాశాలలకు బి గ్రేడు, 4 కళాశాల కు సి గ్రేడ్, 7 కళాశాలలకు డీ గ్రేడ్ రావటం జరిగింది. ఏ గ్రేడు సాధించిన కళాశాలలో చేబ్రోలు హనుమయ్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, చౌడవరం, గుంటూరు, ప్రథమ స్థానంలో నిలిచింది.

రాష్ట్ర స్థాయిలో ఏ గ్రేడు సాధించి ఉత్తమ విద్యా ప్రామాణికాలు పాటిస్తున్న కళాశాల వివరాలు ఈ క్రింద పొందుపరచటం జరిగింది.

## డిజిటల్ యాప్ ఆవిష్కరణ

గుంటూరు క్రైమ్, జులై25, ప్రభాతవార్త: సమాజంలో మహిళలు, సామాన్య ప్రజల ప్రయాణ రక్షణే ధ్యేయంగా గుంటూరు జిల్లా పోలీస్ యంత్రాంగం సరికొత్త డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టింది. శనివారం గుంటూరు పోలీస్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అభయ్ ఆటో గుంటూరు డిజిటల్ యాప్ను, ఆటోలకు కేటాయించిన డిజిటల్ క్యూ.ఆర్ కోడ్లను గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ లాంచ్ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ నగరంలోని ఆటో రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఫిట్నెస్ సరిగ్గా ఉన్న ఆటోలకు పరిశీలన అనంతరం



ప్రత్యేక క్యూఆర్ కోడ్ కూడిన రిజిస్ట్రేషన్ నెంబర్ను కేటాయించడమైనది. ఈ క్యూ.ఆర్ కోడ్ను ఆటో ముందు, వెనుక భ్భాగలో పాటు ప్రయాణికులకు స్పష్టంగా కనిపించేలా లోపలి వైపు కూడా అతికిస్తారన్నారు. ప్రయాణికులు తమ మొబైల్ ద్వారా ఈ కోడ్ను స్కాన్ చేయగానే ఆటో డ్రైవర్, యజమాని వివరాలు, వాహనం నెంబర్, ఫోన్ నెంబర్, చిరునామా ప్రత్యక్షంగా కనిపిస్తాయి. దీనివల్ల ప్రయాణికుల్లో నమ్మకం, ధైర్యం పెరుగుతాయని తెలిపారు. ప్రయాణికులు ఆటోలోని క్యూ.ఆర్ కోడ్ను స్కాన్ చేయడం ద్వారా లేదా గూగుల్ ప్లే స్టోర్ నుండి ˇఅభయ్ ఆటో గుంటూర్ఖ యాప్ను సులభంగా డౌన్లోడ్ చేసుకోవచ్చు. "99.9 ఆటో డ్రైవర్లు ఎంతో నిజాయితీపరులు. అయితే, ఇతర రంగాల మాదిరిగానే 0.1 మంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అవకాశముంది. మహిళలను అగౌరవపరచడం లేదా ఇతర అరాచకాలకు పాల్పడకుండా నిరోధించి, ప్రయాణికులు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి ఈ డిజిటల్ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుంది." అని ఎస్పీ పేర్కొన్నారు. ఇటీవల విజయవాడ నుండి పెదకాకానికి వెళ్లే క్రమంలో ఆటో డ్రైవర్ వేధింపులకు గురిచేయగా, బాధితురాలు వెంటనేˇశక్తి యాప్ఖలోని ఖీవీఖీ బటన్ను నొక్కిన వెంటనే మంగళగిరి రూరల్ పోలీసులు స్పందించి, ఆటో డ్రైవర్ను అదుపులోకి తీసుకుని అమ్మాయిని సురక్షితంగా తండ్రికి అప్పగించిన ఉదంతాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. అదే రీతిలో ˇఅభయ్ ఆటో యాప్ఖి కూడా ప్రతి ఒక్కరికీ నిరంతరం రక్షణగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు, ఎస్బి డీఎస్పీ అలహరి శ్రీనివాసరావు, వెస్ట్ ట్రాఫిక్ సిఐ సింగయ్య, ఈస్ట్ ట్రాఫిక్ సిఐ అశోక్, ఐటికోర్ ఇన్స్పెక్టర్ నిషార్ బాషా తదితరులు పాల్గొన్నారు. ఈ యాప్ తయారీలో శేఖర్ కమ్యూనికేషన్స్ పెంచలరెడ్డి సహకరించిన సహకరించారు. ప్రతినిధులు, పోలీసు సిబ్బంది, మీడియా ప్రతినిధులు, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో ఈస్ట్ ట్రాఫిక్ సిఐ అశోక్ విచ్చేసిన అధికారులకు, మీడియా మిత్రులకు, ఆటో డ్రైవర్లకు ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన సిఐ



గుంటూరు క్రైమ్, జులై25, ప్రభాతవార్త: గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ని నగరంపాలెం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ)గా బాధ్యతలు స్వీకరించిన మునిపల్లి రాజేష్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మునిపల్లి రాజేష్ కి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలతో స్నేహపూర్వక సంబంధాల పెంపుదల దిశగా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. మునిపల్లి రాజేష్ ఇంతకుముందు ప్రకాశం జిల్లాలో విధులు నిర్వహించి బదిలీపై గుంటూరు జిల్లా నగరంపాలెం పోలీస్ స్టేషన్ సీఐగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన నగరంపాలెం సీఐగా బాధ్యతలు స్వీకరించారు.

## ఘనంగా శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం

తెనాలి జులై25(ప్రభాతవార్త): స్థానిక బాలాజీ రావు పేట లో నారాయణ అష్టాక్షరి దివ్య క్షేత్రంగా రూపు దిద్దుకోనున్న కోట బద్రీనాథ్ గుప్తా స్థల ప్రాంగణంలో శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తొలుత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కి, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజాది కార్యక్రమంలో నిర్వహించారు. అనంతరం శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి సంకీర్తన బృందం



అధ్యక్షరాలు మూర్తి అనురాధ నేతృత్వంలో బృంద సభ్యులు, మహిళలు విశేష సంఖ్యలో పాల్గొని శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ గావించారు . కార్యక్రమంలో భాగంగా శ్రీ గోవర్ధన స్వామి దేవస్థానం వంశపారంపర్య అర్చకులు తమిరీశ రఘు, భార్గవి లక్ష్మి దంపతులను ట్రస్ట్ సభ్యులు సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని , నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు ఆర్ .వి .కిరణ్ కుమార్ మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ రావు పేటలో నారాయణ అష్టాక్షరి దివ్య క్షేత్రం ను నెలకొల్పేందుకు స్వామి వారి ఆశీస్సులతో చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. దివ్య క్షేత్రం రూపకల్పనకి భక్తుల నుండి భూదాన విరాళాలను సేకరించడం జరుగుతుందనీ, భక్తులందరూ భూదాన కైంకర్య సేవలో భాగస్వాములు కావాలని తెలిపారు. ఎనిమిది వారాలపాటు నిర్వహిస్తున్న విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమం ఏడో వారం వైభవంగా జరిగిందని, ఆగస్టు ఒకటో తేదీన 8వ శనివారం విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమం జరుగుతుందని భక్తులందరూ విశేషంగా పాల్గొని స్వామి ఆశీస్సులు పొందాలన్నారు. ఆత్మీయ అతిధి తమిళస రఘు మాట్లాడుతూ ట్రస్టు చేపట్టిన బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ తమ శక్తి కొలది సహకారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, ముదుపల్లి చంద్రశేఖర్, గుడివాడ బాలకృష్ణ, జంధ్యం రామారావు, ట్రస్ట్ జీవితకాల సేవాసభ్యులు అంబటి శ్రీనివాసరావు, మాజేటి వెంకటేష్, రొంపిచర్ల సురేష్, బచ్చు లీలా ప్రసాదరావు, గోలి సోమశేఖర్, కాలేపల్లి రాజశేఖర్, సభ్యులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శని కార్యక్రమం

పెదకూరపాడు:జులై25(ప్రభాతవార్త): స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శని కార్యక్రమంలో భాగంగా పెదకూరపాడు మూడో సెంటర్ నందు సిహెచ్ఓ అనుపమ ఫస్ట్ ఎయిడ్ మీద ప్రజలకు అవగాహన కల్పించారు. సిపిఆర్ విధానాన్ని విచ్చేసిన ప్రజలకు క్షుణ్ణంగా ప్రాక్టికల్ రూపంలో చూపించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శని కార్యక్రమం జరుగుతుందని



ఆయన అన్నారు. స్పెషల్ ఆఫీసర్ సుభాని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇరువురు వ్యక్తులు అరెస్ట్

గుంటూరు క్రైమ్, జులై25, ప్రభాతవార్త: బ్రాంచ్ మేనేజర్ గా పనిచేసిన వ్యక్తి, ఆపరేషన్ మేనేజర్ గా పనిచేసిన మరో వ్యక్తి ఇరువురు కలిసి బ్యాంకు విధులను దుర్వినియోగం చేసి నేరానికి పాల్పడినందుకు ఆరెండల్ పేట పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఆరెండల్ పేట



4వ లైను ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు బ్రాంచ్ లో పనిచేసిన సయ్యద్ నౌషాద్ ఆధ్వర్యంలో, ఆపరేషన్ మేనేజర్ షేక్ బాజీలు మని మ్యూల్ ఎకౌంట్స్ తెరిపించి నగదు బ్యాంకుల ద్వారా విత్ డ్రా చేసి సైబర్ నెరగాళ్లకు మల్లించారు. వీరు తద్వారా వచ్చిన కమిషన్ తో జల్సాలు చేశారు. 25,11000 రూపాయలు ఒకసారి, నేపాల్ లో కూడా 4,87,000 ఇండియన్ మ్యూల్ బ్యాంకు కు బదిలీ చేసిన మోసంలో కూడా పాల్గొన్నారు. వీరితోపాటు మరికొందరు కమిషన్ పొందారు. కమిషన్ పొంది లోన్స్ కోసం వచ్చే వారి ద్వారా కొంతమంది చేత చెక్కు విత్ డ్రా చేయించి ఆ తర్వాత నగదును రామకృష్ణ ద్వారా దగ్గుపాటి సాయి కిరణ్ కు చేర్చి కమిషన్7 తీసుకున్నారు. ఇలా మోసాలకు పాల్పడిన వారిలో ఇరువురు అయిన సయ్యద్ నౌషాద్, కె రామకృష్ణ ను ఆరెండల్ పేట పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.

## గ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమంలో సిపిఆర్ పై ప్రత్యేక అవగాహన

క్రోసూరు( జూలై 25 ప్రభాతవార్త ): పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం పల్నాడు జిల్లా క్రోసూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో శనివారం స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శిని కార్యక్రమం విజయవంతమైనట్లు , ఈ కార్యక్రమంలో ముఖ్యంగా ప్రథమ చికిత్స గూర్చి, కార్డియో పల్మనరీ రెస్పిటేషన్ (సిపిఆర్) పై ప్రజలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు వైద్య అధికారులు రవికుమార్, అనిల్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా



శాంసన్ లు శనివారం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాముకాటు, కుక్క కాటుకు ప్రధమ చికిత, కరెంటు షాక్ తగిలినప్పుడు ఏమి చేయాలి? అంగన్వాడి స్కూల్ పిల్లలు ఏవైనా వస్తువులు మ్రింగితే ఏమి చేయాలన్నా దానిమీద ప్రధమ చికిత్స గూర్చి తెలియజేసినట్లు వారు తెలిపారు ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ మాట్లాడుతూ కార్డియో పల్మనరీ రెస్పిటేషన్ సిపిఆర్ ప్రమాదాలు, గుండెపోటు, శ్వాస ఆగిపోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో సమయానికి సిపిఆర్ అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని వివరించారు వైద్య సిబ్బంది సరైన విధానం, చాతి పై ఒత్తిడి, కృత్రిమ శ్వాస, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సి న జాగ్రత్తలను ప్రాక్టికల్ డెమో ద్వారా వివరించినట్లు శాంసన్ తెలిపారు పాముకాటు, కుక్కకాటు ప్రథమ చికితలను గూర్చి ఆయన వివరిస్తూ కొంతమంది పాముకాటు ప్రదేశాన్ని నోటితో పీల్చటానికి ప్రయత్నిస్తారని ఇది అతి ప్రమాదకరమని తెలియజేశారు ఫీల్చే వ్యక్తి నోటిలో చిన్న గాయాలు ఉన్న విషం నేరుగా శరీరంలోకి వెళ్లే అవకాశం ఉందన్నారు పాముకాటు జరిగిన వెంటనే పేషెంట్ కు భరోసా ఇవ్వాలన్నారు భయం, ఒత్తిడి, ఆందోళన నివారించాలని పేర్కొన్నారు కుక్క కాటుకు ప్రధమ చికిత్స వివరిస్తూ కుక్క కరిచిన చోట శుభ్రమైన నీరు మరియు యాంటీ సెప్టిక్ సబ్బుతో కనీసం 10 నుండి 15 నిమిషాల పాటు బాగా కడగాలి అన్నారు. మండలంలోని అన్ని పంచాయతీలలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని అందరూ ఆరోగ్య కార్యకర్తలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ లు , ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## కార్గిల్ విజయ్ దివస్ విజయోత్సవాలు

తాడేపల్లి, జూలై 25, ప్రభాతవార్త.కేఎల్ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఎక్సటెన్షన్ ఆక్టివిటీస్(దినితి) ఆధ్వర్యంలో దుగ్గిరాల మండలం లోని పెదకొండూరు గ్రామంలోని జెడ్.పి. హైస్కూల్లో విద్యార్థులకు కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా వ్యాసరచన మరియు డ్రాయింగ్ పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ



కార్యక్రమం ద్వారా కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు చేసిన త్యాగాలు, వీరత్వం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు దేశభక్తి భావాన్ని పెంపొందించారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు మరియు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు కార్గిల్ విజయ్ దివస్ చారిత్రక ప్రాముఖ్యతను తెలుసుకుని భారత సైనికుల సేవలను గౌరవించే భావనను పెంపొందించుకున్నారు. క్విజ్ మరియు డ్రాయింగ్ పోటీలలో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేయడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగి, భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాల్లో మరింత చురుకుగా పాల్గొనే ఆసక్తి ఏర్పడింది. ఈ కార్యక్రమం విద్యార్థులు మరియు స్థానిక సమాజంలో దేశభక్తి, జాతీయ ఐక్యత, సైనికుల పట్ల గౌరవ భావాలను మరింత బలోపేతం చేసింది. యువతలో దేశసేవ పట్ల స్ఫూర్తిని నింపడంతో పాటు బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి ప్రేరణనిచ్చింది. సమాజంలో దేశభక్తి సందేశాన్ని విస్తృతంగా వ్యాప్తి చేయడంలో ఈ కార్యక్రమం విశేషంగా దోహదపడింది. ఈ యొక్క కార్యక్రమాన్ని సీఏ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు మరియు దిళిని2 డిపార్ట్మెంట్ ఫ్యాకల్టీ ఇంచార్జ్ డాక్టర్ నాగమణి పర్యవేక్షించారు. ఈ యొక్క కార్యక్రమంలో సీఈఓ విద్యార్థిని విద్యార్థులు మరియు ప్రొఫెసర్ ఇంచార్జ్ శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రతి గడపకూ వెళదాం.. పాలన విజయాలను వివరిద్దాం

### పార్టీ నాయకుల సమావేశంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూలై 25,ప్రభాతవార్త : సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో సంక్షేమం, అభివృది, పరిపాలన, మోలిక సదుపాయాలు, ప్రజా సేవల పంపిణీలో సాధించిన విజయాలను ప్రజలకు నేరుగా వివరించడానికి 27 నుంచి ఇంటింటికీ ప్రచారం కార్యక్రమం చేపట్టామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శనివారం స్థానిక తూర్పు కార్యాలయంలో పార్టీ నాయకులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారం కార్యక్రమం ప్రణాళికపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కేడర్ అంతా కచ్చితంగా పాల్గొనాలని సూచించారు. ప్రజలకు కూటమి ప్రభుత్వం చేసిన మంచి ప్రజలకు తెలియజేయాలన్నారు. 45 రోజులపాటు పండుగలా నిర్వహించాలని చెప్పారు. ప్రచార సమయంలో ప్రతి బూత్ నుంచి



కనీసం 50 మంది కారకరలను మై టీడీపీ యాప్ లో నమోదు చేయాలన్నారు. ప్రతి రోజూ 30 గృహాలను సందర్శించాలని చెప్పారు. ఒక్కో ఇంటి వద్ద కనీసం 3 నిమిషాలు కేటాయించాలని, ప్రభుత్వ పాలనలో అభివృద్ధి సంక్షేమం గురించి వివరించాలని తెలిపారు. ఇదే సమయంలో ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్నిలీడర్ నుంచి కేడర్ వరకు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలనే కాకుండా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను అమలు చేశామన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించి, సంక్షేమ పథకాల ఫలాలను నేరుగా ప్రజల గుమ్మం ముంగిటకే చేర్చామని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, దీపం2 పథకం, స్త్రీశక్తి పథకం, సూపర్ సిక్స్ అమలు వంటి పథకాలు సమర్థవంతంగా అమలు చేశామన్నారు. తాజాగా తల్లికివందనంతో ప్రతి విద్యార్థికి నిధులు అందించామని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని, వీటిని ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

## వైకుంఠపురంలో వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు

అమరావతి, జూలై 25,ప్రభాతవార్త : వైకుంఠపురం గ్రామంలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా



మారింది. దేవస్థానం తరఫున ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శనం కల్పించారు.

**భారీ స్థాయిలో అన్నదానం:** పండగ సందర్భంగా దేవస్థానం తరఫున సుమారు 9,000 మంది భక్తులకు ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి లోటు రాకుండా అన్ని ఏర్పాట్లు ఈవో విశ్వనాథ్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఈవో విశ్వనాథ్‌తో పాటు ఆలయ అర్చకులు, దేవస్థానం సిబ్బంది, గ్రామ నాయకులు ప్రముఖులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

## మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు : ఎస్సై కందుల తిరుపతిరావు

చెరుకుపల్లి, జూలై 25, ప్రభాతవార్త : చెరుకుపల్లి మండల పరిధిలో ఎక్కడైనా సరే గంజాయి వంటి మత్తు పదార్థాలు కు పాల్పడితే అటువంటి వారిపై కఠినమైన చర్యలు తప్పవని ఎస్సై కందుల కృష్ణ తిరుపతిరావు అన్నారు. పల్లె పాటలు ఈగల్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రమైన చెరుకుపల్లి ప్రధాన కూడళ్ళలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఐజి ఆకె రవి కృష్ణ, జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు ఈగల్ సెల్ ఆధ్వర్యంలో ఎస్ఐ తిరుపతిరావు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ చైతన్యం ,ఆపరేషన్ గరుడ, ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్, జాయింట్ ట్రైన్ ఆపరేషన్ మరియు ఈగల్ గురించి స్థానికులకు వివరించారు. ముఖ్యంగా గంజాయి సేవించే వారి, గంజాయి అమ్మే వారి వివరాలను 1972 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వడం ద్వారా వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత బానిస కాకుండా అవగాహన పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. మత్తు పదార్థాలు, డ్రగ్స్ కు అలవాటైన జీవితాలును సమాజం హర్షించదని గుర్తుంచుకోవాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు అమ్మిన లేక సేవించిన అటువంటి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి రౌడీషీట్లు తెరిచి చట్టపరంగా కఠినమైన చర్య తీసుకోబడతాయని ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన మరియు రాత్రి 10 దాటిన తర్వాత మద్యం సేవించి రోడ్లమీద అనవసరంగా తిరిగిన, ప్రజానీకానికి ఎటువంటి ఇబ్బంది కలిగించిన కఠిన చర్యలు తప్పవని సూచించారు. కార్యక్రమంలో ఈగల్ సెల్ సిబ్బంది, స్థానిక సిబ్బంది, స్థానికులు, ప్రయాణికులు పలువురు పాల్గొన్నారు.

## నేడు ఇంటర్ స్కూల్ డ్రాయింగ్ కాంపిటేషన్

పిడుగురాళ్ల, జూలై 25 ప్రభాతవార్త : ప్రపంచ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని జానపాడు రోడ్డులో గల తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల ప్రాంగణంలో ఆదివారం ఇంటర్ స్కూల్ డ్రాయింగ్ కాంపిటేషన్ నిర్వహించనున్నట్లు తిరుమల ఆక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల డీన్ ఎస్వి శ్రీనివాసరావు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## తెనాలిలో రెడ్ క్రాస్-రోటరీ రక్తనిధి కేంద్రం ప్రారంభించిన మంత్రి నాదెండ్ల,ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి జులై25(ప్రభాతవార్త): పట్టణంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్-రోటరీ రక్తనిధి కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెనాలి నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా సమాజ సేవలో విశేష కృషి చేస్తున్న రామచంద్ర రాజు, శ్రీమతి భానుమతి మరియు వారి బృందాన్ని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో భానుమతి అంకితభావం కీలకమని పేర్కొంటూ, దాతల విరాళాలు



సరిపోని పరిస్థితిలో ఆమె స్వయంగా సుమారు ..8 లక్షలు వెచ్చించి ఈ సేవా కార్యక్రమాన్ని పూర్తి చేయడం స్ఫూర్తిదాయకమని కొనియాడారు.తెనాలికి వైద్య సేవల విషయంలో గొప్ప చరిత్ర ఉందని గుర్తు చేసిన మంత్రి, జిల్లా ఆసుపత్రిని ఈ ఏడాదిలోనే 300 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. అలాగే జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో సుమారు ..30 కోట్ల వ్యయంతో ఆయుష్ ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు.తెలంగాణలోని మోయినాబాద్ రోటరీ క్లబ్ తెనాలి ప్రజల కోసం ..15 లక్షల ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్న మంత్రి, రక్త కొరత లేకుండా ఉండేందుకు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిరంతర రక్తదాన శిబిరాలు నిర్వహించాలని సూచించారు. అవసరమైన ప్రతి సందర్భంలో జనసేన పార్టీ నాయకులు కూడా పూర్తి సహకారం అందిస్తారని హామీ ఇచ్చారు.2009 వరదల సమయంలో రెడ్ క్రాస్, భానుమతి బృందం అందించిన సేవలను గుర్తు చేస్తూ, విపత్తుల సమయంలో వారి సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. అలాగే రెడ్ క్రాస్ కార్యకలాపాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. తెనాలి మున్సిపాలిటీని దేశంలోనే ఆదర్శవంతమైన పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన, సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని మంత్రి పిలుపునిచ్చారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, దాతలు, ప్రజలు కలిసి పనిచేస్తేనే సమాజంలో శాశ్వత మార్పులు సాధ్యమవుతాయని, భావితరాలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## సౌజన్య ని అభినందించిన పద్మశాలి ఉద్యోగుల సంఘం

తెనాలి మున్సిపాలిటీ జులై25(ప్రభాతవార్త): ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు అమలులో ఈ విశేష కృషిచేసిన సచివాల సచివాలయ ఆరోగ్య కార్యదర్శి ఆర్య సౌజన్యకు ఉత్తమ సేవ పురస్కారం రావడం అభినందనీయమని పద్మశాలీయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జేవీఎస్ రామకృష్ణ అన్నారు.గర్భిణీ స్త్రీలను నూరు శాతం ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్లో అనుసంధానం చేసిన ఆరోగ్య కార్యకర్తలను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్ మరియు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి లు ప్రశంసించారు. ఈ సందర్భంగా గుంటూరు కలెక్టరేట్ లోని డిఆర్సి సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో తెనాలి గంగానమ్మపేట సచివాలయంలో ఆరోగ్య కార్యదర్శిగా పనిచేయుచున్న ఆరే



సౌజన్యకు ఉత్తమ సేవలను అందించినందుకు జాయింట్ కలెక్టర్ ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు. ప్రజారోగ్య పరిరక్షణ, కుటుంబ సంక్షేమ కార్యక్రమములు సమర్థవంత మైన అమల్లో సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యక్రమంలోను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేసేందుకు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. పద్మశాలీయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గర్భిణీ స్త్రీలను నాణ్యమైన వైద్య సేవలు అందించుటలో ప్రతి అర్హురాలిని అనుసంధానం చేయడంలో సిబ్బంది చూపిన అంకితభావం అభినందనీయమని పద్మశాలీయ ఉద్యోగుల రాష్ట్రఅధ్యక్షులు గుద్దంటి వెంకటశివరామకృష్ణ, తెనాలి యూనిట్ అధ్యక్షులు తిరువీధుల నాగేశ్వరరావు ఉపాధ్యక్షులు అందెబాలచంద్రమోళి,ప్రధాన కార్యదర్శి బిట్రా సుబ్బారావు ఆర్థిక కార్యదర్శి పడవల శివయ్య మాచర్ల లీలా శ్రీనివాసమూర్తి, కందుల శ్రీనివాసరావు,జి. సుబ్బారావు ,ఎం.వి.ప్రసాద్, విశ్రాంత డిప్యూటీ డెమో వంకదారసుబ్బారావు,మైలా అప్పారావు తదితరులు అభినందనలు తెలిపారు.

## తెనాలి జిల్లా వైద్యశాలకు పూర్వ వైభవం తీసుకొస్తాం: మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి జులై25(ప్రభాతవార్త): తెనాలి జిల్లా వైద్యశాలను మళ్లీ రాష్ట్రంలో ఆదర్శవంతమైన ప్రభుత్వ ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి, నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.శనివారం తల్లి-శిశు వైద్యశాల ఆవరణలో జరిగిన జిల్లా వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ అధ్యక్షతన అజెండాలోని 15 అంశాలను చర్చించి



ఆమోదించారు.ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, ఒకప్పుడు పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో తెనాలి జిల్లా వైద్యశాల రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉండేదని, ఆ పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకురావడం లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.అనంతరం సమావేశంలో ఆసుపత్రి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ముఖ్యంగా ఎంఆర్ఐ స్కానింగ్ సెంటర్, ఇతర నిర్ధారణ పరీక్షల సమయంలో జరుగుతున్న అవినీతిపై జిల్లా వైద్యాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆసుపత్రిలో అవసరమైన మౌలిక సదుపాయాలపై అధికారులు స్పష్టమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ప్రతి నెలా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించాలని సూచించారు.

**ఆసుపత్రి అభివృద్ధికి కీలక నిర్ణయాలు**

రూ.17 లక్షల వ్యయంతో 15 పడకల సామర్థ్యం గల మాతృ-నవజాత శిశు సంరక్షణ కేంద్రం ప్రారంభం.

రూ.9 లక్షలతో గంటకు 1,000 లీటర్ల సామర్థ్యం గల ఆర్వో ప్లాంట్ ఏర్పాటు.

రూ.36 లక్షలతో ఆర్థోపెడిక్ విభాగానికి ఆధునిక వైద్య పరికరాల కొనుగోలుకు అనుమతి.

పార్కింగ్, దోబీఘాట్ తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధి.

ఆసుపత్రి పరిసరాల్లో పారిశుధ్య మెరుగుదలకు ప్రత్యేక చర్యలు.

రూ.40 లక్షలతో ఆసుపత్రి రహదారి కాల్వల నిర్మాణం, ఆవరణలో డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి.

సిబ్బంది కొరత నివారణకు ఔట్‌సోర్సింగ్ విధానంలో ఆరుగురు స్టాఫ్ నర్సుల నియామకం.

అలాగే, వేసవి కాలంలో రోగులకు ఇబ్బందులు లేకుండా దాతల సహకారం, జిల్లా కలెక్టర్ సమన్వయంతో మొత్తం 43 ఎయిర్ కండీషనర్లు సమకూర్చి అన్ని వార్డుల్లో ఏర్పాటు చేసే చర్యలు తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు.ఈ సమావేశంలో తెనాలి ఆర్డీవో కె శ్రీరమణి, డీఎస్‌హెచ్ఎస్ డాక్టర్ రంగారావు, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, మున్సిపల్ కమిషనర్ జేఆర్ అప్పల నాయుడు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ ఆవుల చక్రవర్తి, డాక్టర్ కొత్తమాసు శ్యామ్ ప్రసాద్, డాకా సాయికృష్ణ, సుభద్ర , డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ మజీదా బేగం, నర్సింగ్ సూపరిటెండెంట్ రాజేశ్వరి, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ది తెనాలి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నూతన భవనం ప్రారంభం

తెనాలి జులై25(ప్రభాతవార్త): పట్టణంలోని కొత్తపేట టిబి రోడ్డులో గల ది తెనాలి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ నూతనంగా పునరుద్ధరించిన గ్రౌండ్ ఫ్లోర్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెనాలి శాసనసభ్యులు, రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు మరియు వినియోగదారుల



వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తున్న పాలకవర్గాన్ని అభినందించిన మంత్రి , సహకార బ్యాంకులు ప్రజలకు నమ్మకమైన ఆర్థిక సేవలు అందిస్తూ స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఆధునిక సౌకర్యాలతో పునరుద్ధరించిన ఈ భవనం వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు దోహదపడుతుందని ఆకాంక్షించారు.శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ఎంతో ఘన చరిత్ర కలిగిన ది తెనాలి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు అధ్యక్షులుగా పనిచేసిన పెద్దలు మహానుభావులు చూపిన మార్గదర్శకంలో నేటి పాలకవర్గం పనిచేసి ప్రజల్లో బ్యాంకు కి పూర్వ వైభవం తీసుకువచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి ప్రభుత్వ నాయకులు,కార్యకర్తలు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మంగమూరి హరిప్రసాద్, డైరెక్టర్లు,పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష్మినారాయణ వర్ధంతి

గురజాల, జూలై 25 ప్రభాతవార్త : పట్టణంలోని ఆనిగ్రేస్ వృద్ధాశ్రమంలో శనివారం సీనియర్ పాత్రికేయుడు, సీపీఐ నేత లక్ష్మినారాయణ 14వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బడేజాని, సీపీఐ జిల్లా నేత హుస్సేన్‌లు ముందుగా లక్ష్మినారాయణ చిత్రపటానికి



పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ వామపక్ష పార్టీలో ఏదైనా ఉద్యమం ఉంటే లక్ష్మినారాయణ ముందుండి నడిపించే వారని, పేద ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంతగానో కృషి చేశారన్నారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ బండి వీరభద్రుడు, సీనియర్ పాత్రికేయుడు అలరాజు, ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడు జోష్ణబాబు, ఉపాధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా, షేక్ సైదా, వేదమని, కుటుంబసభ్యులు మణిదీప్, ప్రదీప్, ఆశ్రమ నిర్వాహకుడు యేసయ్య తదితరులు పాల్గొన్నారు.


## శ్రీసాయి వాసవి విద్యా సంస్థల ఆధ్వర్యంలో పిటిఏ సమావేశం

కొల్లూరు, జులై 25 (ప్రభాతవార్త) : మండల కేంద్రమైన కొల్లూరులోని శ్రీ కాకతీయ కళ్యాణ మండపంలో శనివారం శ్రీసాయి వాసవి విద్యా సంస్థల ఆధ్వర్యంలో పిటిఏ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి శ్రీసాయి విద్యా సంస్థల డైరెక్టర్ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాజీ కృష్ణ పశ్చిమ డెల్టా కమిటీ చైర్మన్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ పాల్గొని



మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యార్థులకు విద్యను అందించి ఇటీవల 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడం అభినందనీ యమని ఆయన అన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు యోగ నేర్పించడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ద్వారా మంచి మార్పు సాధిస్తున్నారన్నారు. అనంతరం ఇటీవల పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కూటమి ప్రభుత్వం ద్వారా శ్రీసాయి వాసవి విద్యా సంస్థలలో పదో తరగతి అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు సైనిక్ స్టార్ అవార్డు, మెడల్, రూ.20వేల చెక్కులను మైనేని మురళీకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కొల్లూరులోని ప్రైవేట్ హాస్పటల్ డాక్టర్ కృష్ణంరాజు, స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసరావు, కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, స్కూల్ మాస్టర్ హరికృష్ణలను ఆయన దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు గుమ్మడి రామ్మోహన్‌రావు, డాక్టర్ కృష్ణంరాజు, వెంకటేశ్వరరావు, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు లావణ్య, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్వర్ణ గ్రామ..స్వర్ణవార్డు అధ్యక్షుడిగా దానయ్య



కొల్లిపర,జూలై 25 ప్రభాతవార్త: జిల్లాలో స్వర్ణ గ్రామ..స్వర్ణవార్డు నందు విధులు నిర్వహిస్తున్న మండల స్వర్ణ గ్రామ..స్వర్ణవార్డు అధికారుల సంఘం జిల్లా స్వర్ణ గ్రామ..స్వర్ణవార్డు కార్యాలయంలో జిల్లా అధికారి రామలింగేశ్వరరెడ్డి సమక్షంలో ఎన్నిక నిర్వహించారు.ఈ ఎన్నికలో కొల్లిపర మండలంలో డిప్యూటి ఎంపీడీవో గా పనిచేస్తున్న దానయ్య ను అధ్యక్షుడిగా,పొన్నూరుకు చెందిన జి.రాజశేఖర్‌ను ఉపాధ్యక్షుడిగా పెదనందిపాడుకు చెందిన ఎస్‌కె.కరీముల్లాను కార్యదర్శిగా,పత్తిపాడుకు చెందిన లక్ష్మిని సహాయ కార్యదర్శిగా,గుంటూరు రూరల్‌లో పనిచేస్తున్న ఆర్.అంబయ్యను ట్రెజరర్‌గా ఎన్నుకోవటంతో జిల్లా స్వర్ణ గ్రామ..స్వర్ణవార్డు కార్యాలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేసారు.

## పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోండి

కొల్లిపర,జూలై 25 ప్రభాతవార్త: గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని తహశీల్దార్ సిద్ధార్ధ పేర్కొన్నారు.శనివారం మండల పరిధిలోని మున్నంగి, వల్లభాపురం, తూములూరు గ్రామాలలో స్వచ్ఛపథం కార్యక్రమంలో



భాగంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సిద్ధార్ధ మాట్లాడుతూ పారిశుద్యం పట్ల గ్రామీణ ప్రజలు సహకరించాలన్నారు.ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచటం వలన మన ఆరోగ్యానికి భద్రత కలుగుతుందన్నారు.కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీవోలు భార్గవ్,దానయ్య,పంచాయతీ కార్యదర్శులు,సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భక్తితో పూజించండి...దేవుని కటాక్షం పొందండి --అర్చకులు పరాశరం జగన్నాధాచార్యులు

కొల్లిపర,జూలై 25 ప్రభాతవార్త: దేవుని భక్తితో పూజిస్తే...ఆ దేవదేవుని కటాక్షాలు తప్పక లభిస్తాయని అర్చకులు పరాశరం జగన్నాధాచార్యులు అన్నారు.శనివారం తొలి ఏకాదశి పురస్కరించుకుని





మండలంలోని కొల్లిపర,వలభాపురం, మున్నంగి..పిడపర్తి పాలెం,తూములూరు, హనుమాన్‌పాలెం, దావులూరు,చివలూరు,అత్తోట,అన్నవరం శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.శివాలయాల్లో..విష్ణుఆలయాల్లో వివిధ అభిషేకాలు నిర్వహించటంతో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.తొలి ఏకాదశి విశిష్టత గురించి వివరించి తీర్ధప్రసాదాలు అందజేసారు.ఇదేవిధంగా మండల కేంద్రం కొల్లిపరలో శ్రీదేవి..భూదేవి..సమేత శ్రీజనార్ధనస్వామి ఆలయంలో,శ్రీగంగా పార్వతీ సమేత శ్రీముక్త్వేశ్వరస్వామి ఆలయంలో పండితులు జగన్నాధాచార్యులు,పిచ్చయ్యశర్మ,నిరంజన్‌లు దేవతా మూర్తులకు వివిధ అభిషేకాలు నిర్వహించారు.శ్రీషిర్డిసాయిబాబా మందిరంలో తొలి ఏకాదశి పర్వదినరం పురస్కరించుకుని బాబాను ప్రత్యేకంగా అలంకరించి వివిధ అభిషేకాలు నిర్వహించారు.

## నాగిరెడ్డి సేవలు ఎనలేనివి --సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి

కొల్లిపర,జూలై 25 ప్రభాతవార్త: పేదవర్గాల కోసం జీవితాంతం కృషి చేసిన గుదిబండి నాగిరెడ్డి సేవలు ఎనలేనివని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి అన్నారు.శనివారం మండల కేంద్రం కొల్లిపరలో ప్రముఖ కమ్యునిస్టు నాయకుడు గుదిబండి నాగిరెడ్డి ద్వితీయ వర్ధంతి ఘనంగా



నిర్వహించారు.నాగిరెడ్డి చిత్రపటానికి ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు..సీపీఎం సీనియర్ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో నేతాజీ మాట్లాడుతూ నేడు యువతరం విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం..మంచి సమాజం కోసం పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్నారని ఇది దేశ భవిష్యత్తుకు ఆశవహమైన పరిస్థితి అని చెప్పారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి,సీపీఎం జిల్లా కార్యదర్శి ఎన్.భవన్నారాయణ,ప్రజా సంఘాల నాయకులు భీమవరపు సుబ్బారెడ్డి,కొల్లి శివనాగిరెడ్డి,గుదిబండి హితేంద్ర,గుదిబండి మిత్రవర్ధన్,కోటా శేఖర్,బెన్‌హర్‌బాబు,పిల్లి గంగాధర్,ఉన్నం నాని,నాలాది బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## దోమలు నివారణతో ఆరోగ్యకర సమాజం:డాక్టర్ దార రమేష్.

తెనాలి మున్సిపాలిటీ జులై25(ప్రభాతవార్త): దోమల నివారణతో వ్యాధి రహిత,ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యపడు తుందని మారీస్ పేట ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ ధారా రమేష్ పేర్కొన్నారు. స్తానిక మారీస్ పేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది, మలేరియా, సిబ్బంది శుక్రవారం ఫ్రైడే డ్రై డే , డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమాన్ని చంద్రబాబు నాయుడు కాలనీ లో నిర్వహించారు. మారిస్ పేట వైద్యాధికారి డాక్టర్ దార రమేష్ మలేరియా సిబ్బందితో కలిసి సుందరయ్య నగర్ లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో పాల్గొని దోమలు పెరుగుదలకు అవకాశం ఉన్న మూలాలను గుర్తించి వాటిని తొలగింప చేశారు. ప్రజలకు ఫ్రైడే డ్రై డే కార్యక్రమము యొక్క ప్రాముఖ్యతను , మరియు డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల యొక్క ఆవశ్యకతను గురించి క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించారు. యుయల్ బి ఆరోగ్యవిస్తరణాధికారి అందె బాలచంద్రమోళి మాట్లాడుతూ,ప్రతి సంవత్సరం జులై మాసాన్ని డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవముగా జరుపుకుంటున్నామని అన్నారు., దీని యొక్క ముఖ్య ఉద్దేశ్యం జులై మాసం నుండి వర్షాలు కురవడం వల్ల నీటి నిలువల తో దోమలు గుడ్లు పెట్టి వాటి యొక్క సంతతిని పెంచుకొనుట ద్వారా మలేరియా ,డెంగ్యూ ,చికెన్ గునియా, మెదడువాపు, బోదకాలు వంటి అనేక వ్యాధులు వ్యాప్తి చెందటానికి కారణం అవుతాయని తెలిపారు.

26-7Pg5_26-7Pg5.qxd 25/Jul/26 10:49 PM Page 1



# పేపర్ లీక్ మాఫియాపై ఉక్కుపాదం




## 3 నెలల్లోనే విచారణ ప్రక్రియ ముగింపు

### రూ.10కోట్లు జరిమానా, 5 నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష

### పరీక్షల అక్రమాల నిరోధక సవరణ బిల్లు డ్రాఫ్ట్ విడుదల చేసిన కేంద్రం

### రేపు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం

**న్యూఢిల్లీ, జులై 25:** పేపర్ లీకులను నివారించడానికి, పరీక్షలకు సంబంధించిన మోసాలకు వ్యతిరేకంగా చట్టపరమైన వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం మరింత కఠినమైన నిబంధనలను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఇందుకు సంబంధించి తాజాగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో మంత్రివర్గం ఆమోదించిన పరీక్షల అక్రమాల నిరోధక సవరణ బిల్లు 2026 డ్రాఫ్ట్‌ను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. సోమవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. దేశంలో పోటీ పరీక్షల విశ్వసనీయతను కాపాడేందుకు, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే పేపర్ లీక్ మాఫియాపై కేంద్ర ప్రభుత్వం అత్యంత కఠినమైన చర్యలకు శ్రీకారం చుట్టింది.

ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ యాక్ట్ 2024'ను మరింత పటిష్టం చేసింది. పేపర్ లీక్ మాఫియాపై రూ.10 కోట్లకు పైగా జరిమానాలు, 7ఏళ్ల వరకు జైలు శిక్షలతో పాటు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) ఏర్పాటు ద్వారా 2 నెలల్లో విచారణ, ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా 3 నెలల్లో తీర్పులు వెలువరించేలా కొత్త మార్గదర్శకాలను తీసుకొస్తోంది. అధికార వర్గాల ప్రకారం, వ్యవస్థీకృత పరీక్షల అవకతవకలను అరికట్టడానికి, ప్రతిపాదిత సవరణల లక్ష్యం [illegible] శిక్షలను గణనీయంగా పెంచడం, దర్యాప్తును వేగవంతం చేయడం, విచారణలను త్వరితగతిన ముగించడం. కేంద్ర మంత్రి వర్గం తాజాగా ఆమోదించిన పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్, 2024కు కొనసాగింపుగా ఈ ప్రతి పాదిత మార్పులు ఉన్నాయని వర్గాలు తెలిపాయి. 2024 చట్టం పేపర్ లీక్ మాఫియాకు వ్యతిరేకంగా ఒక ప్రధాన నిరోధకంగా పనిచేసినప్పటికీ, ప్రభుత్వం ఇప్పుడు దాని నిబంధనలను మరింత కఠినతరం చేయాలని భావిస్తోంది. ప్రతిపాదిత సవరణల ప్రకారం, పేపర్ లీక్‌లో పాల్గొన్న వ్యక్తికి ఐదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.50 లక్షల జరిమానా విధించవచ్చు. పరీక్షల నిర్వహణలో సర్వీస్ ప్రొవైడర్ దోషిగా తేలితే రూ.5కోట్ల జరిమానాతో పాటు ఎనిమిదేళ్లపాటు బ్లాక్‌లిస్ట్ చేయవచ్చు. అలాంటి సర్వీస్ ప్రొవైడర్ యాజమాన్యానికి రూ.5 కోట్ల జరిమానాతో పాటు ఐదేళ్ల జైలు శిక్ష విధించవచ్చు. 'పేపర్ లీక్‌లో పాలుపంచుకున్న వ్యవస్థీకృత నేర బృందాలకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10 కోట్ల జరిమానా విధించవచ్చు. ఈ పెంచిన శిక్షలు పరీక్షల మోసానికి వ్యతిరేకంగా మరింత బలమైన నిరోధకాన్ని సృష్టిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ప్రతిపాదిత సవరణలు పేపర్ లీక్‌లు, పరీక్షల మోసాలను దర్యాప్తు చేయడానికి చట్టబద్ధమైన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ల ఏర్పాటుకు కూడా వీలు కల్పిస్తున్నాయి. ఏదైనా పేపర్ లీక్ కేసును ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తు చేయవచ్చు, అది తన దర్యాప్తును రెండు నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనివల్ల దర్యాప్తులు వేగవంతం అవుతాయని, ప్రాసిక్యూషన్ మరింత కేంద్రీకృతమై ఉంటుందని భావిస్తున్నారు. అదనంగా, ఈ సవరణలు ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టుల కోసం చట్టబద్ధమైన నిబంధనలను ప్రతిపాదిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు సంబంధిత హైకోర్టులతో సంప్రదించి ఈ కోర్టులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ కోర్టులు రోజువారీ ప్రాతిపదికన కేసులను విచారిస్తాయి. మూడు నెలల్లోగా విచారణలను పూర్తి చేస్తాయి. ఈ ప్రతిపాదనల ప్రకారం, పెండింగ్‌లో ఉన్న అన్ని దర్యాప్తులను ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లకు బదిలీ చేస్తారు, అలాగే పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటినీ మూడు నెలల్లోగా పరిష్కరించేందుకు ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు తరలిస్తారు.

పరీక్షలకు సంబంధించిన కేసుల కోసం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించేందుకు కూడా ఇవి వీలు కల్పిస్తు న్నాయి. అధికారవర్గాల సమాచారం ప్రకారం, ఈ సవరణలు నేర నివారణను బలోపేతం చేస్తాయి, దర్యాప్తులను వేగవంతం చేస్తాయి. నేరస్థులకు త్వరితగతిన శిక్ష పడేలా చూస్తాయి.



## మహారాష్ట్ర టెట్ పేపర్ లీక్
## ప్రధాన సూత్రధారి బిజేంద్ర గుప్తా అరెస్ట్

**ముంబై, జులై 25:** సుమారు ఆరు లక్షల మంది అభ్యర్థుల పరీక్షా ప్రక్రియకు అంతరాయం కలిగించిన మహారాష్ట్ర టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టిఇటి) ప్రశ్నపత్రం లీక్ ఘటన జరిగి దాదాపు ఒక నెల తర్వాత, ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న వ్యక్తిని థాణె సిటీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు బిజేంద్ర గుప్తాను శనివారం బీహార్‌లో అరెస్టు చేశారు. కొన్ని వారాల పాటు పరారీలో ఉన్న అతను, అక్కడ నకిలీ గుర్తింపుతో జీవిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో కోచింగ్ క్లాస్ టీచర్‌గా పనిచేసిన గుప్తా, పలు పరీక్షాపత్రాల లీక్ కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొం టున్నారు. రద్దయిన టెట్ పరీక్షకు మహారాష్ట్ర ప్రభుత్వం ఇంకా కొత్తతేదీని ప్రకటించని తరుణంలోనే అతని అరెస్టు జరిగింది. ఈ ఘటనపై పాఠశాల విద్యాశాఖ మంత్రి దాదా భూసే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు తమ నిరసనలను ఉధృతం చేశాయి. లీక్ అయిన ప్రశ్నపత్రాన్ని కొనుగోలు చేయడానికి అంగీకరించిన మరికొందరు అనుమానితులు ఇంకా పరారీలోనే ఉన్నారని పోలీసులు తెలిపారు. 'అరెస్టు అయిన వారు ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు, త్వరలోనే ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేస్తాము' అని ఒక పోలీసు కమిషనర్ తెలిపారు.




## హెచ్-1బి వీసాకు లక్ష డాలర్ల ఫీజుపై
## ట్రంప్‌కు మళ్లీ ఎదురుదెబ్బ

**వాషింగ్టన్, జులై 25:** విదేశీ వృత్తి నిపుణుల హెచ్-1బి వీసాలకు లక్ష డాలర్ల ఫీజు విధింపు విషయంలో ట్రంప్‌నకు మళ్లీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఫీజులు చట్టబద్ధం కాదంటూ ఇటీవల దిగువ న్యాయస్థానం తీర్పుపై స్టే ఇచ్చేందుకు అప్పీల్స్ కోర్టు నిరాకరించింది. దీనిపై స్టే ఇవ్వకపోవడంవల్ల దేశానికి వచ్చే నష్టం ఏమిటో తెలియజేయడంలో ట్రంప్ యంత్రాంగం విఫలమైందని పేర్కొంది. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు దీనిపై నిర్ణయం తీసుకోలేరని పేర్కొంది. విదేశాల్లో ఉండి అమెరికా తాత్కాలిక వలస వీసా అయిన హెచ్-1బికి ఎంపికైన వారు లక్షడాలర్ల ఫీజును చెల్లించాలని గత సెప్టెంబరులో ట్రంప్ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని సవాల్ చేస్తూ 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ బోస్టన్ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వాటిని విచారించిన యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సొరొకిన్ లక్ష డాలర్ల ఫీజు చట్ట విరుద్ధమని ప్రక టించారు. అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకపో వడంతో దానిని చట్ట విరుద్ధ పన్నుగా పరిగణిస్తున్నామని తీర్పుచెప్పారు. దీంతో ట్రంప్ యంత్రాంగం అప్పీల్స్ కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన న్యాయ్యస్థానం దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. సాధారణంగా వీసాల కోసం అయ్యే ఖర్చును కంపెనీలు భరిస్తాయి. గతంలో ఇందుకోసం 2 నుంచి 5 వేల డాలర్ల వరకూ ఖర్చు కాగా, గతేడాది సెప్టెం బరులో ఈ వీసా ఫీజును ట్రంప్ సర్కార్ ఏకంగా లక్షడాలర్లకు పెంచేసింది. విదేశీ ఉద్యోగులపై ఆధారపడ కుండా కంపెనీలు అమెరికన్లను నియమించుకోవాలనే ఉద్దేశంతో ఈఫీజును పెంచారు. దీంతో భారతీయులపై పెనుప్రభావమే పడింది.




## ఢిల్లీ అల్లర్లలో పాక్ దేశీయ సోషల్‌మీడియా కుట్రలు
### 480 ఖాతాలు స్తంభింప చేసినట్లు పోలీసుల వెల్లడి

**న్యూఢిల్లీ,జులై 25:** జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసనలపై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న 480 సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేసినట్లు ఢిల్లీ పోలీసులు శనివారం వెల్లడించారు. ఈ ఖాతాలన్నింటికీ పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించారు. ఈ ఆందోళనలపై కృత్రిమ మేధ (ఏఐ)తో రూపొందించిన వీడియోలు, డీప్‌ఫేక్‌లు, ఎడిట్ చేసిన క్లిప్పింగ్‌లు మరియు నకిలీ పోస్టుల ద్వారా ఒక ప్రణాళికాబద్ధమైన దుష్ప్రచారం జరుగుతోందని సీనియర్ అధికారులు మీడియాకు వివరించారు. ఇటువంటి తప్పుడు సమాచారంతో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం జరుగుతోందని వారు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ఏఐ, డీప్‌ఫేక్ మరియు ఇతర తప్పుడు పోస్టుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సమాచారంలోని నిజానిజాలను గుర్తించాలని పోలీసులు కోరారు.

## ఢిల్లీ అల్లర్లలో నిరసనకారులపై హత్యాయత్నం కేసులు
### మొత్తం 15 ఎఫ్ఐఆర్‌లు నమోదు
### 18మంది డిసిపిలతో భద్రత కట్టుదిట్టం



**న్యూఢిల్లీ,జులై 25:** ఢిల్లీలోని పార్లమెంట్, రైల్ భవన్ సమీపంలో జులై 20న జరిగిన నిరసన ప్రదర్శనలో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి నమోదైన ఎఫ్ఐఆర్‌లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 109(1) కింద హత్యాయత్నం అభియోగాన్ని చేర్చారు. ఈ కేసులో మొత్తం 13 తీవ్రమైన సెక్షన్లను నమోదు చేసినట్లు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. కర్తవ్య పథ్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశారు. హైసెక్యూరిటీ జోన్‌లో భద్రతా విధుల్లో ఉండగా, రైల్ భవన్ రౌండ్అబౌట్ వద్దకు వేలాది మంది నిరసనకారులు చేరుకున్నారని వైర్‌లెస్ ద్వారా సమాచారం అందినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని, నిరసనకు ఎలాంటి అనుమతి లేదని లౌడ్ స్పీకర్ల ద్వారా పదేపదే హెచ్చరించినా ఆందోళనకారులు వెనక్కి తగ్గలేదని తెలిపారు. కొంతమంది వ్యక్తులు రెచ్చగొట్టడంతో నిరసనకారులు బారికేడ్లను దాటుకుని పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారని ఫిర్యాదులో ఆరోపించారు. పార్లమెంట్, ఇతర కీలక ప్రభుత్వ కార్యాలయాల భద్రత దృష్ట్యా, ఆందోళనకారులను చెదరగొట్టేందుకు లాఠీఛార్జ్ చేసి, బాష్పవాయువు ప్రయోగించాల్సి వచ్చిందని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ఘర్షణల్లో మొత్తం 129 మంది పోలీసు సిబ్బంది, 60 మందికి పైగా నిరసనకారులు గాయపడినట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ ఘటనలకు సంబంధించి ఇప్పటివరకు సుమారు 15 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఢిల్లీలోని పలు మార్గాల్లో 18 మంది డీసీపీల పర్యవేక్షణలో భద్రతను కట్టుదిట్టం చేశారు. కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) లేదా మరే ఇతర సంస్థ ఈ ఘటనపై ఏవైనా ఆరోపణలు చేస్తే, వాటిని కూడా విచారించి, నిజానిజాలను బయటపెడతామని ఢిల్లీ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

## ఇది సత్యానికి దక్కిన విజయం: మల్లిఖార్జున ఖర్గే



**న్యూఢిల్లీ,జులై 25:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్‌యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. విద్యార్థుల నుంచి వెల్లువెత్తిన తీవ్ర నిరసనలు, విపక్షాల ఒత్తిడి నడుమ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ పరిణామంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రముఖ నటి ప్రియాంక చోప్రా సహా పలువురు ప్రముఖులు స్పందించారు. దేశంలోని విద్యార్థుల గొంతుక ఎట్టకేలకు అహంకారపూరిత ప్రభుత్వ గడపను తాకిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. విద్యావ్యవస్థ ప్రక్షాళనను కోరుతూ దేశవ్యాప్తంగా వీధుల్లోకి వచ్చి గళమెత్తిన లక్షలాది మంది యువత సాధించిన విజయమిదని ఆయన పేర్కొన్నారు. ఇది సత్యానికి లభించిన విజయం. ప్రధాని మోడీ మొండివైఖరికి దక్కిన ఓటమి. అవినీతిమయమైన ఈ ప్రభుత్వం కారణంగా నష్ట పోయిన కుటుంబాలందరిదీ ఈ విజయమని ఖర్గే అభివర్ణించారు. నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి చేసి, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నటి ప్రియాంక చోప్రా సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించారు. విద్యార్థుల పోరాటాన్ని ప్రస్తావిస్తూ, "తమ డిమాండ్ల కోసం దృఢంగా నిలబడి నిరసన తెలిపిన యువతకు, ప్రజాస్వామ్యానికి ఇది దక్కిన భారీ విజయమని ఆమె పేర్కొన్నారు. ఈ పోస్ట్ క్షణాల్లో వైరల్ కాగా, దీనిపై ప్రియాంక చోప్రా స్పందిస్తూ నమస్కారం, లవ్ ఎమోజీలను జత చేసి తన మద్దతును చాటారు.

## రాజీనామాల కంటే సమగ్ర సంస్కరణలు ముఖ్యం: మాయావతి



**న్యూఢిల్లీ,జులై 25:** నీట్‌యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ వివాదంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్ కంటే, విద్యా మరియు పరీక్షా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టడమే అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి పేర్కొన్నారు. ఈ అంశంపై విద్యార్థుల నిరసనలు, రాజకీయ ఘర్షణలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఆమె శనివారం ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వివాదంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న శాంతి యుత నిరసనలకు ప్రజల నుంచి సానుభూతి లభిస్తోందని మాయావతి తెలిపారు. రాజకీయ పార్టీలు కేవలం మంత్రి రాజీనామా చుట్టూ రాజకీయం చేస్తున్నాయని, ఈ క్రమం లో అసలు సమస్య అయిన విద్యా వ్యవస్థ ప్రక్షాళన పక్కదారి పట్టే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. ప్రతి పక్షాలు ఈ సమస్యను వీధుల నుంచి పార్లమెంటు వరకు రాజకీయ లబ్ధికోసం వాడుకుంటున్నా యని మాయావతి ఆరోపించారు. ఈ వివాదం వల్లే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఒక్కరోజు కూడా సజావుగా సాగలేదని, దీనివల్ల ఇతర ప్రజా సమస్యలపై జవాబుదారీతనం లేకుండా పో యిందని విమర్శించారు. పార్టీ కార్యకర్తలు దూకుడుగా ప్రవర్తించ కుండా, లక్ష్యం కోసం క్రమశిక్షణతో పనిచేయాలని ఆమె సూచించారు.

## ఈ ఘనత కాక్రోచ్ జనతాపార్టీదే: ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ,జులై 25:** కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, వాయనాడ్ లోక్‌సభ సభ్యురాలు ప్రియాంక గాంధీ స్పందించారు. ఈ ఘనత కాక్రోచ్ జనతా పార్టీకే దక్కుతుందని వ్యాఖ్యానించారు. యువత, విద్యార్థిలోకం ఐక్యంగా ఉద్యమించడం వల్లే కేంద్ర ప్రభుత్వం దిగొచ్చిందని పేర్కొన్నారు. ఈ పని ఎప్పుడో చేసి ఉండాల్సిందని అన్నారు. అదే సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై విమర్శలు గుప్పించారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న నిరుద్యోగ సమస్య పరిష్కారంలోనూ, యువత, విద్యార్థుల ఆవేదనలను ఆలకించడంలోనూ కేంద్రం విఫలమైందని ఆరోపించారు. దేశాన్ని సరైన మార్గంలో నడిపించే నాయకుడికి ధైర్యం, తెగువ, బాధ్యతాయుత ప్రవర్తన అత్యంత అవసరమని, ప్రధాని మోడీ ఎప్పుడోగానీ వీటిని ప్రదర్శించలేదని గుర్తు చేశారు. ఆ నాయకత్వ లక్షణాలను ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైందని ప్రియాంక గాంధీ స్పష్టం చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంలో నెలకొన్న జాప్యం, ఇన్ని రోజులూ కేంద్రం అనుసరించిన మొండి వైఖరి వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని, చివరికి తమ ప్రాణాలను పణంగా పెట్టి ఢిల్లీలో ఈ స్థాయిలో ఆందోళన చేయా ల్సి వచ్చిందని అన్నారు. పోటీ పరీక్షల నిర్వహణలో జరుగుతోన్న పేపర్ లీకేజీలు, ఇతర అవకతవకలపై విద్యార్థులు సుదీర్ఘ కాలంగా ఆందోళనలు చేస్తు న్నప్పటికీ ఇన్నాళ్లూ పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిం చారని మండిపడ్డారు. నిజమైన నాయకత్వం అంటేఎన్నికల వేదికలపై సుదీర్ఘ ఉపన్యాసాలు ఇవ్వడంకాదని, ప్రజా కష్టాలను ప్రత్యక్షంగా ఆలకించి వాటికి తగిన పరిష్కారాలు చూపడమేనని ఆమె వ్యాఖ్యానించారు.

## బ్రిటన్ మంత్రివర్గంలో ముగ్గురు భారత సంతతి మంత్రులు



**లండన్,జులై 25:** బ్రిటన్ కొత్త ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన ఆండీ బర్న్‌హమ్ తన కొత్త కేబినెట్‌ను ప్రకటించారు. లేబర్‌పార్టీకి చెందిన ముగ్గురు భారత సంతతి ఎంపీలకు ఆయన ప్రభుత్వంలో కీలక పదవులు దక్కాయి. ఆ జాబితాలో కనిష్క నారాయన్, సత్‌వీర్ కౌర్, హర్‌ప్రీత్ ఉప్పల్ ఉన్నారు. కనిష్క నారాయన్‌కు కేబినెట్‌లో చోటు దక్కింది. బ్రిటన్ సర్కారులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శాఖకు తొలి మంత్రిగా నియమితులయ్యారు. ఇక సత్‌వీర్ కౌర్, హర్‌ప్రీత్ ఉత్పల్ అత్యున్నత ప్రభుత్వ హోదాలో నియమితులయ్యారు. వీరితో పాటు శ్రీలంక తమిళ సంతతికి చెందిన హిందూ ఎంపీ ఉమా కుమరన్ ఆ దేశ విదేశీ ఆఫీసులో జూనియర్ మంత్రి పదవి దక్కించుకున్నారు. కీర్ స్టార్మర్ ప్రధానిగా ఉన్న సమయంలో సీమా మల్హోత్రా, ప్రీత్ కౌర్ గిల్ మంత్రులుగా చేశారు. ఇప్పుడు వాళ్లు వెనక బెంచీలకు వెళ్లిపోయారు. కనిష్క నారాయన్ బీహార్‌లోని ముజాఫర్‌పూర్‌లో జన్మించారు. ఆయన ఫ్యామిలీ వేల్స్‌కు వలసవెళ్లింది. 12 ఏళ్ల వయసులో ఆయన లండన్ వెళ్లారు. ఈటన్ కాలేజీ, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీల్లో చదువుకున్నారు. గ్లామోర్గన్ సీటు నుంచి ఆయన ఎంపీగా ఎన్నియ్యారు. గతంలో సైన్స్, ఇన్నోవేషన్, టెక్నాలజీ శాఖ కార్యదర్శిగా చేశారు. సత్‌వీర్ కౌర్ సౌతాంప్టన్ నుంచి ఎంపీ అయ్యారు. 2024 జూలైలో పార్లమెంట్‌కు తొలి సారి ఎన్నికయ్యారు. ఆమె పేరెంట్స్ పంజాబ్‌కు చెందినవారు. సౌతాంప్టన్‌లో చీరల షాపు ఉండేది. మినిస్ట్రీ ఫర్ ఈక్వాలిటీస్‌లో సహాయ మంత్రిగా చేశారు. హోంశాఖలో కూడా సెక్రటరీగా చేశారు. పార్లమెంటరీ సెక్రటరీగా కూడా ఆమె కొంత కాలం చేశారు. 2025 సెప్టెంబర్ నుంచి ఫిబ్రవరి 2026 వరకు ఆమె మెటర్నిటీ లీవ్‌లో ఉన్నారు. హర్‌ప్రీత్ ఉత్పల్ హడ్డర్స్‌ఫీల్డ్ నుంచి ఎన్నియ్యారు. అసిస్టెంట్ విప్‌గా నియమితులయ్యారు. పార్లమెంటరీ బిజినెస్‌కు చెందిన ఆదేశాలు ఇస్తుంటారు. ఓటింగ్ సమయంలో ఎంపీలకు కీలక ఆదేశాలు ఇస్తారు. గతంలో ఆమె గ్రేటర్ మాంచెస్టర్ మేయర్ క్యాంపెన్‌లో బర్న్‌హమ్‌తో కలిసి పనిచేశారు.



## రాజీనామాలు చేసిన కేంద్ర మంత్రులు ఎందరో!

**న్యూఢిల్లీ,జులై 25:** నీట్ ప్రశ్నాపత్రం లీక్, విద్యా వ్యవస్థలో అవకతవకలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళనలతో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకున్నారు. అయితే, స్వతంత్ర భారతదేశ చరిత్రలో రాజకీయ ఒత్తిళ్లు, అవినీతి ఆరోపణలు లేదా ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రులు రాజీనామా చేయడం సాధారణంగా జరుగుతున్నదే. భారతదేశంలో పలు వివాదాలు, ఆరోపణలు లేదా విపక్షాలు, ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకత కారణంగా గతంలో చాలా మంది కేంద్ర మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. స్వతంత్ర భారత చరిత్రలోరైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ పదవి నుంచి తప్పుకున్న తొలి కేంద్ర మంత్రిగా లాల్ బహదూర్ శాస్త్రినిలిచారు. 1956లో తమిళనాడులోని అరియలూర్‌వద్ద సంభవించిన భారీ రైలు ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ అప్పటి రైల్వే మంత్రిగా ఉన్న శాస్త్రి రాజీనామాచేసారు. దేశంలోనే తొలి అవినీతి కేసుగా గుర్తింపు పొందిన 1958 నాటి ఎల్ఐసీ కుంభకోణంలో అప్పటి ఆర్థిక మంత్రి కృష్ణమాచారి పదవి నుంచి తప్పుకున్నారు. వ్యక్తిగతంగా ప్రత్యక్ష ప్రమేయం ఏదీ రుజువు కానప్పటికీ ఎంసీ చాగ్లా కమిషన్ నివేదికలోని అంశాల ఆధారంగా ఆయన రాజీనామా చేశారు. తర్వాత 1962 భారతచైనా యుద్ధంలో వైఫల్యాలకు బాధ్యత వహించాలని విపక్షాల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో అప్పటి రక్షణ మంత్రిగా ఉన్న వీకే కృష్ణ మీనన్ తన పదవి నుంచి తప్పుకున్నారు. 1993లో విమాన ప్రమాదానికి నైతిక బాధ్యత వహిస్తూ విమానయాన మంత్రిగా, 1996లో హవాలా కుంభకోణంలో ఆరోపణలు రావడంతో మాధవరావ్ సింధియా రాజీనామా చేశారు. అటల్ బిహారీ వాజ్పేయి క్యాబినెట్లో రైల్వే మంత్రిగా నితీష్ కుమార్1999లో పశ్చిమ బెంగాల్లోని గైసాల్లో రైళ్లు ఢీకొట్టిన ఘటనలో 280 మంది ప్రాణాలు కోల్పోవడంతో నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే రాజీనామా చేశారు. ఆ తర్వాత 2008 నవంబరు 26 ముంబయి ఉగ్రదాడుల సమయంలో జరిగిన జాతీయ భద్రతా వైఫల్యాలపై ప్రజాగ్రహం, నైతిక విమర్శలను ఎదుర్కొన్న అప్పటి కేంద్ర హోం మంత్రి శివరాజ్ పాటిల్ తన రాజీనామాను సమర్పించారు. యూపీఏ 2 హయాంలో 2బి స్పెక్ట్రమ్ కుంభకోణం ఆరోపణలు, విపక్షాల తీవ్ర నిరసనలతో అప్పటి కేంద్ర టెలికం మంత్రి ఎ.రాజా 2010లో తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. రైల్వే బోర్డు నియామకాల లంచం కేసులో తన మేనల్లుడు చిక్కుకోవడంతో, విపక్షాల ఒత్తిడి మేరకు 2013లో పవన్ కుమార్ బన్సల్ రైల్వే మంత్రిపదవికి రాజీనామా చేశారు. ఇక, ప్రధాని నరేంద్ర మోదీ క్యాబినెట్లో విదేశాంగశాఖ సహాయ మంత్రిగా ఉన్న ఎంజే అక్బర్పై 2018లో "Me Too" ఉద్యమం సమయంలో వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలు,రాజీనామా డిమాండ్ల కారణంగా పదవికి రాజీనామా చేశారు. బీజేపీ సీనియర్ నేత ఎల్కే అద్వానీ 1996లో హవాలా కుంభకోణంలో తన పేరు ప్రస్తావన రావడంతో నైతిక బాధ్యతగా పదవికి రాజీనామా చేశారు. హవాలా డైరీలలో ఆయన పేరు వెలుగులోకి వచ్చిన తర్వాత అద్వానీ ప్రతిపక్ష నేత పదవితో పాటు ఎంపీగానూ రాజీనామాచేసి కోర్టులు నిర్దోషిగా ప్రకటించే వరకు పార్లమెంటులో తిరిగి ప్రవేశించబోనని ప్రతిజ్ఞ చేశారు.

## ఫడ్నవిస్,షిండేలకు కేంద్రం పిలుపు
## అమిత్‌షా, ప్రధాని మోడీలతో భేటీ



**న్యూఢిల్లీ,జులై 25:** ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత ఢిల్లీలో వేగంగా రాజకీయ పరిణామాలు మారుతున్నాయి. మరోవైపు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు బీజేపీ హైకమాండ్ నుంచి పిలు పువచ్చింది. దీంతో ఆయన హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరారు. ఫడ్నవీస్‌తో పాటు మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే కూడా ఢిల్లీకి బయలుదేరారు. ప్రధాన్ రాజీనామా చేయగానే ఫడ్నవీస్, షిండేకు బీజేపీ హైకమాండ్ నుంచి ఫోన్ వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో, ఫడ్నవీస్‌ను కేంద్ర మంత్రి మండలిలోకి తీసుకుంటారే ప్రచారం ఊపందుకుంది. ఇటీవల మహారాష్ట్రలో కూడా ఇదే విష యం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గం ఎంపీ సంజయ్ రౌత్ మాట్లా డుతూ సీఎం పదవికి దేవేంద్ర ఫడ్నవీస్ రాజీనామా చేసి, ఢిల్లీకి వెళ్తారని అన్నారు. ఈ వ్యాఖ్యలు మహారాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారాయి. తాజాగా చోటు చేసుకుంటున్న పరిణామాలు కూడా రౌత్ వ్యాఖ్యలకు బలాన్ని ఇస్తున్నాయి. మహారాష్ట్రకు చెందిన ఓ సీనియర్ బీజేపీ నేతను సీఎంగా ఎన్నుకోవచ్చని ఆ సమయంలో ఆయన అన్నారు. అయితే ఇందుకు సంబంధించి భిన్న కథనాలుకూడా వచ్చాయి. మహారాష్ట్రలో టెట్‌పేపర్ లీక్‌కకు సంబంధించి వివాదం నడుస్తోంది. ఈకేసులో కీలక వ్యక్తిని బీహార్‌లో పోలీసులు అరెస్టులు చేసారు. దీనితో ఇపుడు నీట్‌తరహాలో ఉద్యమం మళ్లీ ప్రారంభం కాకుండా మహారాష్ట్ర ప్రభుత్వంచేపట్టిన కార్యాచరణను తెలుసుకునేందుకే ఇద్దరినీ పిలిపించారని తెలుస్తోంది. ఫడ్నవిస్, షిండేలు ఇద్దరూ శనివారం ప్రధాని మోడీని కలిసే ముందుగా హోంమంత్రి అమిత్‌షాతో సుదీర్ఘ భేటీ జరిపినట్లు సమాచారం.

# సంక్షిప్త వార్తలు

## 50 ఒటిటిలపై నిషేధం విధించిన కేంద్రం




**న్యూఢిల్లీ, జులై 25:** దేశంలో ఒటిటి యాప్స్ విషయంలో కేం ద్రం కఠినంగా వ్యవహరిస్తోంది. దీనిలో భాగంగా అభ్యంతరకర కంటెంట్ ప్రసారం చేస్తున్న ఒటిటిలపై కేంద్రం ఉక్కు పాదం మోపుతోంది. తాజాగా ఇలాంటి 500 ఒటిటి యాప్స్ ను నిషేధించినట్లు కేంద్ర సమాచార, ప్రసా రశాఖ మంత్రి ఎల్. మురుగన్ వెల్లడించారు. దేశ చట్టాలను ఉల్లంఘించి, అసభ్యకర కంటెంట్‌ను ప్రసారం చేసినందుకే వాటిని నిషేధించామని మంత్రి లోక్‌సభలో తెలిపారు. అయితే, ఇలా ఒటిటిలను నిషేధించడం ఇదే మొదటిసారి కాదు. నిబంధనలు ఉల్లంఘించి, అభ్యంతరకర కంటెం ట్ ప్రసారం చేస్తున్న ఒటిటిలపై కేంద్రం నిషేధం విధిస్తూనే ఉంది.

## ప్రశ్నించే తరం ఇది: ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్



**న్యూఢిల్లీ,జులై 25:** దేశవ్యాప్తంగా పేపర్ లీకులు, పరీక్షల అక్రమాలపై విద్యార్థుల నిరసనలు కొనసాగుతున్న వేళ ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ యువత గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. నేటి తరం ప్రశ్నించే తరం అని, వారికి ఆదేశాలు ఇవ్వడం కంటే చర్చించి అర్థం చెప్పడం అవసరమని అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన సమకాలీన మాతృత్వం అంశంపై జాతీయ అవగాహన సమావేశంలో భాగవత్ మాట్లాడారు. తమ చిన్నతనంలో పెద్దలు చెప్పిన మాట వినేవాళ్లమని చెప్పారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారాయని పేర్కొన్నారు. నేటి యువత ప్రతి విషయాన్నీ ప్రశ్నిస్తోందని, అందుకే వారికి కారణాలు వివరించి నమ్మకం కల్పించాలని చెప్పారు.

## అంతర్జాతీయ కోర్టు నుంచి చీఫ్ ప్రాసిక్యూటర్ తొలగింపు



**హేగ్,జులై 25:** అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ)లో తీవ్ర కలకలం నెలకొంది. లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో ఆ సంస్థ చీఫ్ ప్రాసిక్యూటర్ కరీం ఖాన్‌ను పదవి నుంచి తొలగించారు. అత్యంత కీలకమైన హోదాలో ఉన్న వ్యక్తిపై ఇటువంటి చర్యలు తీసుకోవడం అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. బ్రిటిష్ న్యాయవాది అయిన కరీం ఖాన్, ఐసీసీలో చీఫ్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తనతో పనిచేసే ఓ మహిళా ఉద్యోగి పట్ల ఆయన లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.

## ఆయుధాలు విక్రయిస్తే ఆ రెండుదేశాలకే నష్టం: ట్రంప్



**వాషింగ్టన్,జులై 25:** ఇరాన్‌కు చైనా, రష్యా ఎలాంటి ఆయుధాలు విక్రయించకూడదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అలా చేస్తే అది ఆ రెండు దేశాల ప్రయోజనాలకు మంచిది కాదని స్పష్టంచేశారు. అయితే ప్రస్తుతం ఇరాన్‌కు ఆయాదేశాలు ఆయుధాలుఅందించడంలేదని తాను నమ్ముతున్నట్లు తెలిపారు. ఇరాన్‌కు చైనా, రష్యాలక్ష్యాన్ని నిర్ధారించుకునే సమాచారాన్ని అందిస్తున్నాయన్న వార్తల నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.

## భారతీయులున్న నౌకపై దాడి.. 28 మంది సురక్షితం



**టెహ్రాన్,జులై 25:** భారతీయులు 28 మంది పనిచేస్తున్న నౌకపై ఇరాన్ జలాల్లో దాడి జరిగింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ కలగలేదని, భారతీయులు సహా నౌకలోని సిబ్బంది అంతా సురక్షితంగా ఉన్నారని ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. మొజాంబిక్ దేశానికి చెందిన ఐఎంవో నెం. 8818219 అనే దిశ పేరుగల నౌకపై దాడి జరిగిందని రాయబార కార్యాలయం తెలిపింది. ఈ ఘటనపై సంబంధిత అధికారులను సంప్రదిస్తున్నామని తెలిపింది.

## కెనడాలో భారతీయ మహిళ దారుణ హత్య



**ఎడ్మంటన్,జులై 25:** భారతీయ మహిళ కెనడాలో దారుణ హత్యకు గురైంది. 23 ఏళ్ల దమన్‌ప్రీత్ కౌర్‌ను ఆమె భాగస్వామి హత్యచేశాడు. ఎడ్మంటన్‌లోని ఓ ఇంట్లో ఆమెను గొంతునులిమి చంపేశాడు. చికిత్స పొందుతూ ఆమె మృతిచెందినట్లు పోలీసులు చెప్పారు. ఈనెల 9వ తేదీన ఈ ఘటన జరిగింది. ఈ కేసులో 22 ఏళ్ల రితీశ్ కుమార్‌ను ఎడ్మంటన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పార్ట్నర్‌పై సెకండ్ డిగ్రీ మర్డర్ కేసు నమోదు చేశారు. బాధితురాలు దమన్‌ప్రీత్ కౌర్‌ది పంజాబ్‌లోని లుథియానా జిల్లా.

26-7Pg6exHMNWJQE_26-7Pg6exHMNWJQE.qxd 25/Jul/26 10:51 PM Page 1



# 50,114 సౌర విద్యుత్ కనెక్షన్లు పూర్తి

- 180 మెగావాట్ల సామర్థ్యం గ్రిడ్‌కు అనుసంధానం
- ఎపిసిపిడిసిఎల్‌లో పిఎం సూర్యఘర్

## ముఫ్త్ బిజ్లీ యోజన మరో మైలురాయి



సౌరవిద్యుత్తు అనుసంధాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎపిసిపిడిసిఎల్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ పి.పుల్లారెడ్డి

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిసిపిడిసిఎల్) పరిధిలో ప్రధానమంత్రి పిఎం సూర్యాఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన అమలులో మరో కీలక మైలురాయిని అధిగమించింది. ఈ పథకం కింద మొత్తం 50,114 సౌర విద్యుత్ (రూఫ్‌టాప్ సోలార్) కనెక్షన్లు పూర్తి చేసి, 180 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని రాష్ట్ర విద్యుత్ గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు ఎపిసిపిడిసిఎల్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ పి.పుల్లారెడ్డి తెలిపారు. అనుసంధాన కార్యక్రమం అనంతరం సిఎండి మీడియాతో మాట్లాడుతూ, ఏప్రిల్-2025 నాటికి కేవలం 6,489 కనెక్షన్లు మాత్రమే పూర్తి కాగా, గత ఒక్క సంవత్సరం కాలంలోనే మరో 43,625 కనెక్షన్లను పూర్తి చేయడం ద్వారా మొత్తం 50,114 సౌర విద్యుత్ కనెక్షన్ల మైలురాయిని చేరుకోవడం ఎపిసిపిడిసిఎల్‌కు గర్వకారణమని తెలిపారు. అధికారులు, ఇంజనీర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది సమష్టి కృషితో ఈ ప్రగతి సాధ్యమైందన్నారు. వినియోగదారులకు ఇంటింటికీ వెళ్లి పథకం ప్రయోజనాలపై అవగాహన కల్పించడం, దరఖాస్తు నుండి గ్రిడ్ అనుసంధానం వరకు నిరంతరం మార్గనిర్దేశం చేయడం, ప్రతి రోజు వెండార్లతో అధికారులు సమీక్షలు నిర్వహిస్తూ ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించడం, అన్ని విభాగాల మధ్య సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ అద్భుత విజయాన్ని సాధించగలిగామని సిఎండి పేర్కొన్నారు.

పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంపొందించడంలో, పర్యావరణ పరిరక్షణలో పిఎం సూర్యాఘర్ పథకం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. భవిష్యత్తులో మరింత వేగంగా సౌర విద్యుత్ కనెక్షన్లు అందించి రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ లక్ష్యాల సాధనకు ఎపిసిపిడిసిఎల్ కట్టుబడి పనిచేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఈ విజయానికి కృషి చేసిన డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) టివిఎస్ఎన్ మూర్తి, కార్పొరేట్ కార్యాలయ అధికారులు, ప్రాజెక్ట్స్ విభాగం బృందం, అన్ని సర్కిళ్ల చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, డివిజన్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది, వెండార్లను సిఎండి పి.పుల్లారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.



రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

# రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు అండగా మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** మచిలీపట్నంకు చెందిన ఒడుగు నరేంద్ర, వనమాడి కుమార్ రోడ్డు ప్రమాదంలో మరణించడం పట్ల మంత్రి తీవ్ర విచారం వ్యక్తంచేశారు. శనివారం ఉదయం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సంధ్య ఆక్వాలో రోజు వారీ పని కోసం వెళ్తుండగా లారీ ఢీ కొనడంతో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. బాధిత కుటుంబాల ఆవేదన తీర్చలేనిది. ప్రయాణ సమయంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి. అధికారులు కూడా రోడ్డు ప్రమాదాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బ్లాక్ స్పాట్స్ వద్ద స్పీడ్ బ్రేకర్లు, వార్నింగ్ లైట్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

# గోదావరిలో ఇన్‌ఫ్లో బాగా తగ్గిపోయింది

- జలవనరుల శాఖ ఇఎన్‌సి నరసింహామూర్తి

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** గోదావరిలో ఇన్‌ఫ్లో బాగా తగ్గిపోయిందని జలవనరుల శాఖ ఇఎన్‌సి నరసింహామూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో గోదావరి జిల్లాలో 71 శాతం వర్షపాతం తక్కువగా ఉంది. గోదావరి డెల్టా ఆయకట్టు ఖరీఫ్ పంటకు సాగునీటి కొరత ఉండదు. గత 70యేళ్లలో గోదావరి పరివాహక ప్రాంతంలో లేని నీటి కొరత ఇప్పుడు ఏర్పడింది. ప్రస్తుతం 50 టిఎంసిల నీరు గోదావరి డెల్టాకు అందించాం. గోదావరి డెల్టాకు 14,700 క్యూసెక్కులు ఇస్తున్నాం. మరో 80 టిఎంసిలు గోదావరి డెల్టాలో ఖరీఫ్ పంటకు అవసరం. గోదావరిలో లభ్యమయ్యే నీటి నిల్వలతో ఈ పరిస్థితిని అధిగమిస్తాం. డెల్టా గోదావరి నీరు ఇస్తాం. కాకినాడ జిల్లా మెట్ట కోసం వారికి సాగునీరు అందించలేని నీటి అవసరాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. కృష్ణా డెల్టాకు నీటి కొరతపై ప్రత్యేక చర్యలు చూస్తున్నాం. విశాఖ, కాకినాడ జిల్లాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని జలవనరుల శాఖ ఇఎన్‌సి నరసింహామూర్తి తెలిపారు.

# హోం మంత్రి అనిత 'ఎక్స్' అకౌంట్ హ్యాక్

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సామాజిక మాధ్యమం 'ఎక్స్' అకౌంట్ హ్యాక్ అయ్యింది. దీంతో హోం మంత్రి కార్యాలయ అధికారులు అలర్ట్ జారీ చేశారు. మంత్రి అనిత వ్యక్తిగత ఎక్స్ అకౌంట్‌ను కొందరు హ్యాక్ అయ్యిందని, ఈ సమయంలో ఆ అకౌంట్ నుంచి అనధికారిక పోస్టులు జరుగుతున్నట్లు అధికారులు గుర్తించారు. అకౌంట్ సైబర్ దాడికి గురైన నేపథ్యంలో పోస్ట్ చేసిన అంశాలను అధికారికంగా పరిగణించవద్దని హోంమంత్రి కార్యాలయం ప్రకటించింది. అకౌంట్ హ్యాక్ అవ్వడంపై ఇప్పటికే పోలీసులకు మంత్రి ఫిర్యాదు చేశారు. హ్యాక్ చేసిన వారిని గుర్తించేందుకు, అకౌంట్ రికవరీకి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# అగ్నిప్రమాదాల నివారణపైనే ప్రత్యేక దృష్టి

- అవగాహన కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యమే లక్ష్యం
- అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ పి.వి. రమణ



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 25 ప్రభాతవార్త:** అగ్నిప్రమాదాలు సంభవించిన తర్వాత స్పందించడం కంటే, అవి జరగకుండా ముందుగానే నివారించడమే అగ్నిమాపక శాఖ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ పి.వి.రమణ తెలిపారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, రాజా నగరంలలో నిర్వహించిన ఫైర్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం, మాక్ డ్రిల్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ జెనరల్ పి.వి. రమణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 60 శాతం ఆసు పత్రుల్లో ఫైర్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలు పూర్తి చేశామని, త్వరలోనే పాఠశాలల్లో కూడా ఇదే తరహా కార్యక్రమాలు చేపడతామని పి.వి.రమణ చెప్పారు.

ప్రతి అగ్నిమాపక కేంద్రం పరిధిలో నెలకు నాలుగు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నామని వెల్లడించారు. విద్యార్థులు, ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా యానిమేషన్ వీడియోలు, జింగిల్స్, కర పత్రాలు, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. సంప్రదాయ ఉప న్యాసాల కంటే దృశ్య రూపంలో ఇచ్చే అవగాహన కార్యక్రమాలు మరింత ప్రభావవంతంగా ఉంటున్నాయని పేర్కొన్నారు. అనంతరం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధికారులతో అగ్నిమాపక శాఖ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. ఆసు పత్రులు, విద్యాసంస్థలు, వాణిజ్య సముదా యాలు వంటి ప్రజలు అధిక సంఖ్యలో ఉండే భవనాల్లో అగ్ని భద్రతా ప్రమాణాలను రాజీ పడకుండా అమలు చేయాలని ఆయన కోరారు. నిర్మాణ దశలోనే అగ్ని భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా పెద్ద ఎత్తున ప్రాణనష్టాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి



# సమస్య పరిష్కారం తొలి ప్రాధాన్యత

## - ప్రజాదర్బార్‌లో టిడిపి ఇన్‌ఛార్జి శ్రీనివాస్

**తిరుపతి, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి నియోజకవర్గంలో ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తిరుపతి టిడిపి ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాస్ కసరత్తు చేపట్టారు. ఇందుకోసం శనివారం తొలిసారిగా తిరుపతి పార్లమెంట్ కార్యాలయంలో ప్రజాదర్బార్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) నిర్వహించారు. తిరుపతి నగరవాసుల నుండి డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, వీధి లైట్లు, సిసి రోడ్లు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై అర్జీదారులతో నేరుగా మాట్లాడి వినతులు స్వీకరించారు. 57మంది ఫిర్యాదులు అందించడం విశేషం. సిఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఆదేశాలతో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఇది దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి కుమారమ్మ, తాతయ్యగుంట ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జులు దంపూరి భాస్కర్ యాదవ్, శ్రీధర్ వర్మ, మునిశేఖర్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన్ రాజీనామాను స్వాగతిస్తున్నాం: ఆర్‌వైఎస్‌ఎఫ్

**విజయవాడ, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం పట్ల రైట్స్ ఫర్ యూత్ అండ్ స్టూడెంట్స్ ఫోరమ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, యువజన సంఘాలు దేశవ్యాప్తంగా సాగించిన ఉద్యమాలు, నిరసనలు, ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాల ఫలితంగానే ఈ పరిణామం చోటుచేసుకుందని ఆయన పేర్కొన్నారు. ఇది విద్యార్థి ఉద్యమాల విజయమే కాకుండా ప్రజాస్వామ్య విలువల విజయంగా భావిస్తున్నామని అన్నారు. నీట్ పరీక్షల నిర్వహణలో ఏర్పడిన వివాదాలు, అవకతవకలు, విద్యార్థుల ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీను రద్దు చేసి, ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమాల్లో పాల్గొన్న విద్యార్థులు, యువజనులపై నమోదు చేసిన అన్ని కేసులను ఎలాంటి షరతులు లేకుండా వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. అలాగే పరీక్షల నిర్వహణలో జరిగిన పరిణామాల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు కోటి చొప్పున పరిహారం చెల్లించి, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.



# గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నేతల శాంతియుత సత్యాగ్రహం

**తిరుపతి, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం నిరక్ష్యంగా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం దుర్మార్గమని ,దీన్ని నిరసిస్తూ విద్యార్థులు ఆందోళన చేస్తే వారిపై దారుణంగా పోలీసులతో లాఠీచార్జి చేయించడం అమానవీ యమని కాంగ్రెస్ నేతలు తీవ్రస్థాయిలో మండి పడ్డారు. నీట్, సిబీఎస్ఈ పరీక్షల్లో అవక తవకలు ప్రశ్నాపత్రాల లీకులు, విద్యార్థులపై పోలీసుల దాడులను నిరసిస్తూ శనివారం తిరుపతిలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు ఆధ్వర్యంలో కొవ్వొత్తులు చేతపట్టుకుని శాంతియుత సత్యాగ్రహం నిర్వహించారు. మాంగాటి గోపాల్ రెడ్డి, కంభంపాటి మురళీకృష్ణ, శివశంకర్, జ్యోతీశ్వర్ నాయక్, సుప్రజ, ముసీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం



## భక్తులతో తిరుమలకొండ కిటకిట

- వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు

**తిరుమల, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం లక్షమంది భక్తులు తిరుమలకు చేరుకోవడంతో కొండ కిటకిట లాడుతోంది. వారాంతం శనివారం ఉదయానికి వైకుంఠమ్2లో అన్ని కంపార్టుమెంట్లు నిండాయి. సాయంత్రానికి ఈ రద్దీ మరింతగా పెరిగింది. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 24గంటలు సమయం పడుతోంది. క్యూలైన్లు శిలాతోరణం వరకు విస్తరించాయి. టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. వారాంతం సెలవులు ఆపై తమతమ మొక్కుబడులు తీర్చుకునేందుకు సామాన్యభక్తులు పెద్ద సంఖ్యలో ఏడుకొండలకు చేరుకుంటుండటంతో తిరుమల కిటకిట లాడుతోంది. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. శనివారం సాయంత్రం వరకు 47వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. మరో 25వేల మంది భక్తులు అర్ధరాత్రి వరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. శుక్రవారం రాత్రి వరకు 78,721 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం 4.98 కోట్లుగా నమోదైంది.

## టిటిడి ఉద్యోగి సస్పెన్షన్

**తిరుమల, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ధార్మిక సంస్థలో అవినీతికి పాల్పడిన ఓ ఉద్యోగిపై వేటు పడింది. హర్యానాలోని కురుక్షేత్ర వేంకటేశ్వర స్వామి ఆలయంలో అసిస్టెంట్ షరాఫ్‌గా పనిచేస్తున్న పి.గిరిని శనివారం టిటిడి సస్పెండ్ చేసింది. టిటిడి పేరుతో అన్నదానం, కల్యాణోత్స వం, వాహనసేవల పేరుతో భక్తుల నుంచి డబ్బులు వసూలుచేసినట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు.

### మరో అవినీతి ఉద్యోగి...

దేవుని చెంత నిజాయతీగా విధులు నిర్వహించాల్సిన టిటిడి ఉద్యోగులు కొందరు అవినీతికి పాల్పడుతుండటంతో టిటిడి అధికారులు కొరఢా ఝుళిపించారు. తిరుమలలోని జిఎన్‌సి ప్రాంతంలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్.శరత్ బాబును శనివారం టిటిడి సస్పెండ్ చేసింది. భక్తుల నుండి డబ్బులు డిమాండ్ చేసినట్లు సామాజిక మాధ్యమంలో వీడియో వైరల్ కావడంతో ఆధారంగా విచారణ చేపట్టారు. ప్రాథమికంగా ఉద్యోగి ప్రవర్తన నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించిన టిటిడి క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఆయనను తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఆగస్టు 6న మిక్సిడ్ రైస్ ఇ వేలం

**తిరుమల, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు టిటిడి అనుబంధ ఆలయాల్లో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన బియ్యాన్ని ఆగస్టు 6న ఇ-వేలం ద్వారా విక్రయించనున్నట్లు టిటిడి తెలిపింది. ఈ వేలంలో మొత్తం 20 లాట్లలో సుమారు 7,938 కిలోల మిక్సిడ్ రైస్ అందుబాటులో ఉంచనున్నారు. ఆసక్తి గల వారు ఆగస్టు 5వ తేదీ సాయంత్రం లోపు కొనుగోలు పోర్టల్ ద్వారా రూ.50వేలు ఇఎండి ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు తిరుపతిలోని టిటిడి మార్కెటింగ్ కార్యాలయం 08772 26442నంబర్‌కు సంప్రదించవచ్చు.



## గోవిందరాజస్వామికి కవచ ప్రతిష్ఠ

**తిరుమల, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక జ్యేష్ఠాభిషేక మహోత్సవాల్లో శనివారం కవచ ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరిగింది. వేదఘోషలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శతకలశ స్నపనం, మహాశాంతి హోమం వైదిక పద్ధతిలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీరు, పసుపు, చందనంతో అభిషేకాలు జరిపి విశేషారాధనలు సమర్పించారు. ప్రత్యేక పూజల అనంతరం కవచ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనం ప్రసాదించారు. స్వామివారి దర్శనార్థం తరలివచ్చిన భక్తులు 'గోవింద' నామస్మరణతో ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, ఎఇఒ ఎ.బి. నారాయణ చౌదరి, సూపరింటెండెంట్లు శేషగిరి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయులు, ఆలయ అర్చకులు, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బృహన్నల వేషంలో అర్జునుని దివ్యదర్శనం

**శ్రీకాళహస్తి, జులై 13 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉత్తర గోగ్రహణం కార్యక్రమాలు జరిగాయి.



శుక్రవారం రాత్రి ఆలయంలో అర్జున తపస్సు తరువాత అర్ధరాత్రి దాటిన తరువాత అలుగు కుంభాగ్రాన నిలుపు పవిత్ర కార్యక్రమాల్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కుండపై కత్తిని నిలబెట్టడం అనేది అరుదైన కార్యక్రమాలు. రాత్రి పట్టణంలో ఊరేగింపు జరిపిన తరువాత స్థానిక పూజారులు పురుషోత్తం వారి సహచరులు మహిమాన్వితమైన ఈ కార్యక్రమాల్ని చేపట్టారు. అలుగు కుంభాగ్రాన నిలబెట్టు ఉత్సవాన్ని జరిపారు. శనివారం ఉదయం ఉత్తర గోగ్రహణం సందర్భంగా అర్జునుడు బృహన్నల వేషంలో పట్టణంలో ఊరేగించారు. ఆలయం వద్ద ఏర్పాట్లను ఆలయ ఎఇఒ హేమామాలిని, చిన్న ఆలయాల ఇన్‌ఛార్జి లక్ష్మయ్య పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవంతో పాటు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం ఉత్సవాల ఇన్‌చార్జి దుర్గా ప్రసాద్, దఫేదార్ పర్యవేక్షణలో ఉత్సవం జయరామారావు వీధి, బజారు వీధి, తేరువీధి, నెహ్రూవీధి, నగరి వీధుల మీదుగా సాగింది.

# దాససాహిత్య గాయకులకు ఆగస్టు 1 నుండి దరఖాస్తులు

**తిరుమల, జులై 25 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతిరోజూ నిర్వహించే శ్రీవారి సహస్ర దీపాలంకార సేవ, అలాగే తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో నిర్వహించే దాససాహిత్య సంకీర్తనలను ఆలపించేందుకు ప్రతిభావంతులైన, అర్హులైన సంగీత కళాకారుల నుంచి టిటిడి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ ఆడిషన్లు 2026 నవంబరు 27 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు ఆరు రోజులపాటు తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో నిర్వహించబడనున్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 1 నుండి 20వ తేదీ వరకు మాత్రమే ఆన్‌లైన్‌లో 'హెచ్‌టిటిపిఎస్://ఎపిపిఎస్.తిరురమల.ఒఆర్‌జి/డిఎస్‌పి' తమ దరఖాస్తులను సమర్పించాలి. అభ్యర్థుల అర్హతలు, ఆడిషన్ విధానం, సమర్పించాల్సిన ధ్రువపత్రాలు, మార్గదర్శకాలు, ఇతర నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాలు టిటిడి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు.

# 28న సింహాచలం గిరి ప్రదక్షిణ

**విశాఖపట్నం, జులై 25 ప్రభాతవార్త:** ఈ నెల 28, 29వ తేదీల్లో జరగనున్న సింహాచలం గిరి ప్రదక్షిణను ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హోం మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై ఆమె సమీక్షించారు. 32 కిలోమీటర్ల మేర జరిగే గిరి ప్రదక్షిణ మార్గంలో భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన ప్రతి చోటా సీసీకెమెరాలు ఏర్పాటు చేసి, అవి పనిచేస్తున్నాయో లేదో పరిశీలించాలని, నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరి ప్రదక్షిణ అనంతరం కొండపై దర్శనాలకు వచ్చే భక్తుల సంఖ్యను అంచనా వేసి తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. భక్తులకు అనువైన ప్రాంతాల్లో నమూనా ఆలయాలను ఏర్పాటు చేసి అక్కడ భద్రతా చర్యలు చేపట్టాలని, పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. తొలి




పావంచాతో పాటు నమూనా ఆలయాల వద్ద కూడా కొబ్బరికాయలు కొట్టి భక్తులు గిరి ప్రదక్షిణ ప్రారంభించుకునేలా చర్యలు తీసుకోవచ్చన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సేవలు, భద్రత, ట్రాఫిక్ తదితర అంశాల్లో తగిన చర్యలు తీసుకోవాలని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, ఎమ్మెల్యేలు గణబాబు, పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ కార్పొరేషన్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, తదితరులు పాల్గొన్నారు.

# మదనపల్లిలో అర్ధరాత్రి దొంగల హల్‌చల్

- మారణాయుధాలతో బెదిరించి ఏటిఎం మిషన్ ఎత్తుకెళ్లారు
- ఏటిఎంలో రూ. 13.5 లక్షలు ఉన్నట్లు ప్రాథమిక నిర్ధారణ
- డ్రోన్లతో పోలీసుల ముమ్మర గాలింపు
- నిమ్మనపల్లి వద్ద ధ్వంసమైన మిషన్ గుర్తింపు

**మదనపల్లె (క్రైమ్), జులై 25 ప్రభాతవార్త:** మదనపల్లి పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి దుండగులు దుశ్చర్యకు పాల్పడ్డారు. జాతీయ రహదారి పక్కన ఉన్న ఎస్బీఐ ఏటీఎంను దొంగలు బొలెరో వాహనంలో ఎత్తుకెళ్లిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఎస్బీఐ ఏటీఎంలో సుమారు రూ. 13.5 లక్షల నగదు ఉన్నట్లు బ్యాంక్ అధికారులు ప్రాథమికంగా ధ్రువీకరించారు. ఎస్పీ ధీరజ్ ఆదేశాలతో పోలీసులు చేపట్టిన ముమ్మర గాలింపు చర్యల్లో ధ్వంసమైన ఏటీఎం మిషన్ లభ్యమైంది. స్థానిక శివాజీ నగర్ వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న ఎస్బీఐ ఏటీఎం కేంద్రంలోకి శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు బొలెరో వాహనంతో దూసుకెళ్లారు. ఏటీఎం మిషన్‌ను వాహనంలోకి ఎక్కిస్తుండగా అలికిడి గమనించిన స్థానికఇరుగు పొరుగువారు కొందరు పెద్ద పెద్ద శబ్దాలను గుర్తించి బయటికి రావడానికి ప్రయత్నించగా అప్రమత్తమైన దుండగులు కత్తులు, తుపాకి చూపించి స్థానికులను బెదిరించి, ఏటీఎం మిషన్‌ను వాహనంలో ఎక్కించుకుని వేగంగా పరారయ్యారు. దీంతో వారు 112 కు కాల్ చేయగా సమాచారం అందుకున్న గస్తీ పోలీసులు వెంటనే ఎస్పీ ధీరజ్ కు సమాచారం అందించారు. స్పందించిన ఎస్పీ జిల్లా అంతటా పోలీసులను అప్రమత్తం చేసి, పకడ్బందీగా నాకాబంధీ నిర్వహించారు. ఏటీఎంను తరలిస్తున్న బొలెరో వాహనం వాల్మీకిపురం మండలం కురపతి గ్రామం మీదుగా వెళ్లినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఈ కోణంలో దర్యాప్తును వేగవంతం చేసి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.





**క్లూస్ టీం విస్తృత తనిఖీలు:** సీటీఎం రోడ్డు, ఇండస్ట్రియల్ ఎస్టేట్ సమీపంలోని శివాజీ నగర్ వద్ద దుండగులు ఎస్బీఐ ఏటీఎంను అపహరించిన ప్రదేశాన్ని శనివారం జిల్లా క్లూస్ టీం నిపుణులు సందర్శించి కీలక ఆధారాలు సేకరించారు. క్లూస్ టీమ్ సిబ్బంది.. ఘటన స్థలంలో నిందితుల వేలిముద్రలు, పాదముద్రలతో పాటు టెక్నికల్ ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే ఏటీఎం పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరా ఫుటేజీలను సేకరించి విశ్లేషిస్తున్నారు.

**8 ప్రత్యేక బృందాలతో గాలింపు:** పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఎస్బీఐ ఏటీఎం చోరీ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. పరారీలో ఉన్న దొంగల ముఠాను పట్టుకోవడానికి 8 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి తెలిపారు.

సీసీటీవీ ఫుటేజ్, సెల్‌ఫోన్ వీడియోల ఆధారంగా నిందితుల కదలికలను నిరంతరం ట్రాక్ చేస్తున్నామని, నిమ్మనపల్లె పరిసర ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో ముమ్మర గాలింపు చర్యలు కొనసాగిస్తున్నామని ఆయన చెప్పారు. త్వరలోనే దుండగులను అదుపులోకి తీసుకుంటామని స్పష్టం చేశారు.

## త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్న జనసేన నాయకులు

నరసరావుపేట టౌన్, జూలై 25 ప్రభాతవార్త :: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కోటప్పకొండ పై వేంచేసి ఉన్న శ్రీ త్రికోటేశ్వర స్వామిని జనసేన పార్టీ నాయకులు దర్శించుకున్నారు. శనివారం జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ సయ్యద్ జిలాని తో పాటు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. త్రికోటేశ్వరునికి భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికారులు ఈ సందర్భంగా సయ్యద్ జిలాని కి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. దేవస్థానం తరఫున తీర్థప్రసాదాలు అందజేశారు. సయ్యద్ జిలాని మాట్లాడుతూ త్రికోటేశ్వర స్వామి కృపాకటాక్షాలు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. తొలి ఏకాదశి రోజున రైతులు పెద్ద సంఖ్యలో తమ పశుసంపదలతో గిరి ప్రదక్షణలో పాల్గొంటారని తెలియజేశారు. దూర ప్రాంతాల నుండి సైతం స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు రావడం జరుగుతుందని తెలియజేశారు. అన్నదాతలతో పాటు అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని త్రికోటేశ్వరున్ని కోరినట్లు ఈ సందర్భంగా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలాని తెలిపారు.



## గ్రామీణ ఆరోగ్య సేవల్లో ఆర్ఎంపీల పాత్ర కీలకం..

నరసరావుపేట, జూలై 25 ప్రభాతవార్త :: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడంలో ఆర్ఎంపీ వైద్యుల పాత్ర ఎంతో కీలకమని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఆంధ్రప్రదేశ్ అనుభవ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా కార్యాలయాలను శనివారం వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు సంఘం ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా నూతన కార్యాలయాలను ప్రారంభించారు. ఈ సంఘం కార్యాలయ ప్రారంభోత్సవంలో రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకా అంకిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అత్తలూరి వెంకయ్య, పల్నాడు జిల్లా అధ్యక్షుడు సోమగిరి వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ అనుభవజ్ఞులైన వైద్యులంతా ఒకే వేదికపైకి వచ్చి సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. సంఘం ద్వారా వైద్యుల సంక్షేమంతో పాటు ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సేవలందిస్తూ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో ఆర్ఎంపీ వైద్యులు భాగస్వాములు కావాలని సూచించారు. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ బలోపేతానికి ఇలాంటి సంఘాలు సమన్వయంతో పనిచేయాలని, వైద్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, ఆర్ఎంపీ వైద్యులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కాపు ఉద్యమనేత ముద్రగడ ప్రజా నాయకుడు ::డా. గోపిరెడ్డి

నరసరావుపేట టౌన్, జూలై 25 ప్రభాతవార్త :: మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ప్రజా నాయకుడని వైయస్సార్సీపి పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం ముద్రగడ సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయాలలో దశాబ్దాల అనుభవం ఆయనకు ఉన్నత స్థానాన్ని కల్పించిందన్నారు. కాపు సామాజిక వర్గానికి సంబంధించిన సంక్షేమ, అభివృద్ధి కై తన చివరి శ్వాస వరకు కృషి చేశారని తెలిపారు. ఒక్క సామాజిక వర్గమే కాదని రాష్ట్రంలోనే వివిధ వర్గాల ప్రజల కోసం ప్రజా ఉద్యమాలను నిర్మించారని గుర్తు చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి తో ఆయనకు ఎంతో సాన్నిహిత్యం ఉండేదని తెలియజేశారు. వైయస్సార్సీపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డితో ఆయన చివరి వరకు ఎన్ని ఒత్తిడిలు వచ్చిన నిలిచారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ కుట్రలను ఎన్నో సందర్భాలలో తిప్పి కొట్టారని తెలిపారు. నరసరావుపేట నియోజకవర్గ వైయస్సార్సీపి కాపు నాయకులతో కలిసి గుంటూరు సంతాప సభకు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లినట్లు తెలియజేశారు. ముద్రగడ పద్మనాభం ఆశయాలను వైయస్సార్సీపి సాధించేందుకు కృషి చేస్తుందని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.




## ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

రొంపిచర్ల,జూలై 25 ప్రభాతవార్త : పట్టణంలోని కోటబజార్ పులుపుల వారి వీధిలో వేంచేసినటువంటివనమా వారి కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్నటువంటి శ్రీ వీరాంజనేయ సహిత శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి భక్తులు విరాళం శనివారం అందజేశారు. దేవాలయం రాతి నిర్మాణానికి, నరసరావుపేట వాస్తవ్యులైన ప్రముఖ రిటైర్డ్ ఎండోమెంట్ డిపార్ట్మెంట్ కి చెందిన మాదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి వారి ధర్మపత్ని పద్మావతి స్వచ్ఛందంగా విరాళం అందించారు. వారు రూ.1,00,116/, (ఒక లక్షనూటపదహారు రూపాయలు) స్వామి వారి రాతి నిర్మాణానికి దేవస్థాన కమిటీ వారికి అందజేయడం జరిగినది. కమిటీ సభ్యులు మాట్లాడుతూ దాతలకుటుంబానికి స్వామి వారి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటూ దేవస్థాన కమిటీ తరఫున వారికి ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే పట్టణానికి చెందిన మరో దాత కొత్తమాసు రామ వెంకట నరసింహ వేద్ కార్తికేయ (యు.ఎస్.ఎ) రూ.11,116 లను విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులైన వనమా కృష్ణ, వనమా శ్రీనివాసరావు, గజవల్లి మురళి, దేసు శ్రీనివాసరావు, నిడమనూరి శివరాం ప్రసాద్ లకు అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ స్వామివారి ఆలయ నిర్మాణానికి విరాళాలు ఇచ్చేందుకు భక్తులు ముందుకు రావాలన్నారు.


## శాస్త్రోక్తంగా-భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పర్వదినం

పొన్నూరు, జూలై 25,ప్రభాతవార్త: టెంపుల్ సిటీగా ప్రసిద్దిగాంచిన స్వర్ణపురి పట్టణంలో వేంచేసియున్న శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత సాక్షి శ్రీ భావనారాయణస్వామివారి దేవాలయంలో శనివారం తొలి ఏకాదశి పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీ సాక్షి భావనారాయణస్వామివారి మూలవిరాట్‌కు వేకువ జామునే వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. ఉభయదాతలుగా ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారి పేరున గోత్రనామార్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం అర్చకస్వామి గోవర్ధనం రామకృష్ణ మాట్లాడుతూ హిందూ సంప్రదాయంలో ఆషాఢ శుద్ధ ఏకాదశిని తొలి ఏకాదశిగా పిలుస్తారన్నారు. ఈ రోజునే శయన ఏకాదశి, దేవశయని ఏకాదశి అని కూడా అంటారని చెప్పారు. ఈ పర్వదినం రోజున శ్రీ మహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్ళే ప్రవిత్రమైన రోజని చెప్పారు. ఇక్కడి నుండే తెలుగువారికి పండుగలు ప్రారంభమవుతాయన్నారు. తొలి ఏకాదశి రోజున శ్రీ మహావిష్ణువు క్షీరసాగరంలో శేషపాన్పుపై యోగనిద్రకు ఉపక్రమిస్తారని చెప్పారు. ఈ ఏకాదశినే నాలుగు నెలల చాతుర్మాస్య వ్రతాలు ప్రారంభమవుతాయన్నారు. తొలి ఏకాదశితోనే తెలుగువారి నోములు, వ్రతాలు, పండుగలు ప్రారంభమవుతాయన్నారు. భక్తులు రోజంతా ఉపవాసం ఉండి, విష్ణు సహస్రనామ పారాయణ చేస్తే మంచిదన్నారు. తొలి ఏకాదశి రోజున పేల పిండిని ప్రసాదంగా స్వీకరించడం ఆచారంగా వస్తుందన్నారు. తొలి ఏకాదశి రోజున శ్రీ మహావిష్ణువును దర్శించుకొంటే సర్వసుఖాలు, సుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసమన్నారు. భక్తులు పెద్ద ఎత్తున దేవాలయానికి వచ్చి స్వామివారికి నారికేళాలు, కథళీఫలాలు తదితరాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తీర్థప్రసాద గోష్ఠి జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఇంచార్జి అసిస్టెంట్ కమిషనర్ మంతెన అనుపమ ఆదేశాల మేరకు సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు శిఖాకొల్లి గుర్నాధరావు, కాట్రగడ్డ రామచంద్రరావు, ఊటుకూరి బాజి శిరీష, ఆకురాతి శ్రీనివాసరావు, ధరణికోట సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఏకలవ్యుడే అందరికీ ఆదర్శం

పొన్నూరు, జూలై 25,ప్రభాతవార్త: గురుభక్తికి, పట్టుదలకు, త్యాగానికి ప్రతీక అయిన ఏకలవ్యుడే అందరికీ ఆదర్శం అని డిఎస్పీ దేవరకొండ ప్రసాద్ అన్నారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లో ఏకలవ్యుని జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిఎస్పీ దేవరకొండ ప్రసాద్ మాట్లాడుతూ మహాభారతంలో గొప్ప విలుకాడుగా పేరుగాంచిన ఏకలవ్యుని జీవిత విశేషాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ద్రోణాచార్యుని తన గురువుగా భావించి, ఆయన మట్టి విగ్రహం ముందు విలువిద్యను అభ్యసించి విజయం సాధించిన ఏకలవ్యుడు నుంచి యువత ఎంతో నేర్చుకోవాల్సి ఉందన్నారు. గురువు కోరిన వెంటనే వెనుకాడకుండా తన కుడి చేతి బొటనవేలును గురుదక్షిణగా సమర్పించిన ఏకలవ్యుని గురు భక్తిని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు షేక్ నాజర్ మాట్లాడుతూ నేటి యువత ఏకలవ్యునిలోని కృషి, పట్టుదల, అంకితభావంతో పనిచేస్తే ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోగలరన్నారు. ఏకలవ్యుని లాగే ప్రతి ఒక్కరూ ఆదర్శవంతమైన జీవితాన్ని గడపాలన్నారు. తొలుత ఏకలవ్యుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎస్టీసెల్ జిల్లా కార్యదర్శి దేవరకొండ గోపి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కట్టా సోమయ్య, కుంభా చంద్రయ్య, దేవరకొండ చినగోపి, దేవరకొండ మీరుబాబు, దేవరకొండ వెంకటేశ్వర్లు, కట్టా రమేష్, ప్రసాద్, మహేష్, శేషు, వాసు, గోపి తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి విద్యార్థి ఆరోగ్యం ప్రభుత్వం బాధ్యత..!

కారంపూడి, జూలై 25, ప్రభాతవార్త: కారంపూడి: ప్రతి విద్యార్థి ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ఎంతో బాధ్యతగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. శనివారం స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పీఎం శ్రీ పథకం ద్వారా రూ.69 లక్షలతో నూతనంగా నిర్మించిన సైన్స్ ల్యాబ్, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్ గదుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణలు నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతన గదులను ప్రారంభించారు. అనంతరం పాఠశాల అవరణలో మొక్కలు నాటి, భవిత కేంద్రం ద్వారా దివ్యాంగులకు అందించే ట్రై సైకిళ్లు, ఇతర పరికాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ.. విద్యావ్యవస్థలో సమూల మార్పులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేస్తూ పాఠశాలల్లో మౌలిక వసతులకు పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. తల్లికి వందనం పథకం ఆర్థిక ఇబ్బందులతో బడికి దూరమవుతున్న బిడ్డలను బడి వైపు అడుగులు వేసేందుకు దోహదం చేస్తోందని వివరించారు. ఇద్దరు బిడ్డల చదువుకు డబ్బులు ఇస్తానని చెప్పి.., ఒక బిడ్డకు మాత్రమే ఇచ్చి, జగన్ రెడ్డి మోసం చేస్తే.. చదువు విలువ,ప్రాధాన్యత తెలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంట్లో ఎంతమంది బిడ్డలు ఉంటే అంత మందికి తల్లికి వందనం నగదు జమ చేస్తున్నారని వెల్లడించారు. మాట ఇస్తే.., ఆ మాటపై నిలబడి ప్రజలకు మంచి చేయడం చంద్రబాబు నిజాయితీకి నిదర్శనమని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సురేష్, ఎంఈవో రవికుమార్, ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, ప్రధానోపాధ్యాయులు శివశశి రెడ్డి, సాగునీటి పంపిణీ సంఘాల చైర్మన్ పంగులూరు అంజయ్య, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మునుగోటి సత్యం, ఉన్న లక్ష్మీనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు గోళ్ల సురేష్ యాదవ్, చప్పిడి రాము, బాలకృష్ణ, తండా మస్తాన్ జానీ, బొమ్మిన శేషగిరిరావు, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల ఆస్తుల పరిరక్షణే చంద్రబాబు లక్ష్యం.! ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, జూలై 25, ప్రభాతవార్త: జగన్ రెడ్డికి ప్రజలు ఇచ్చిన ఒక్క అవకాశంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు లూటీకి గురైయ్యాయని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం మండల పరిధిలోని వేపకంపల్లి గ్రామంలో వేపకంపల్లి, చినకొదమగండ్ల గ్రామాల రైతులకు కూటమి ప్రభుత్వం అందజేసే రాజ ముద్రతో ముంద్రించిన నూతన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. దాదాపు 1500 మంది రైతులకు నూతన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేసి, మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో రైతుల భూములకు భద్రత లేదని, సర్వే రాళ్లపై, పాసుపుస్తకాలపై జగన్ బొమ్మ వేసుకుని, బ్యాంకుల్లో తాకట్టుపెట్టి దోచుకోవాలని చూశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వేను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఇంచార్జ్ ఆర్ఐ వేముల శ్రీనివాసరావు,వీఆర్వో వింజమూరి కోటేశ్వరరావు, సర్వేయర్ సాల్మాన్ రాజు, సాగునీటి పంపిణీ కమిటి చైర్మన్ పంగులూరు అంజయ్య, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మునుగోటి సత్యం, ఉన్న లక్ష్మీనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు గోళ్ల సురేష్ యాదవ్, చప్పిడి రాము, బాలకృష్ణ, తండా మస్తాన్ జానీ, కోటేశ్వరరావు, బొమ్మిన శేషగిరిరావు, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## దుర్గి సచివాలయంలో స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శని

దుర్గి, జూలై 25, ప్రభాతవార్త: దుర్గి మండలంలోని దుర్గి సచివాలయంలో శనివారం స్వర్ణ గ్రామ ఆరోగ్య దర్శని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల స్పెషల్ ఆఫీసర్ తమ్మాజీ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ తమ్మాజీ రావు మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం పంపిణీ, ఆరోగ్య పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో బరువు తక్కువగా ఉన్న పిల్లల వివరాలను సేకరించి, వారికి అదనపు పోషకాహారం అందించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో పోషకాహారం అందేలా చూడాలని, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్ రావు, ఏవో శ్రీనివాసరావు హాజరయ్యారు. వారితో పాటు సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



## మాచర్లలో యధావిధిగా రిజిస్ట్రేషన్లు ....ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దు: జొన్నాదుల శ్రీరామ మనోహర్



మాచర్ల రూరల్. జూలై 25, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా మాచర్ల సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలో రిజిస్ట్రేషన్లు యధావిధిగా కొనసాగుతున్నాయని. ప్రజలు ఎలాంటి భయాందోళనల కు గురికాకుండా నేరుగా కార్యాలయానికి వచ్చి తమ రిజిస్ట్రేషన్లు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మాచర్ల సబ్ రిజిస్టర్ జొన్నాదుల శ్రీరామ మనోహర్ శనివారం సూచించారు. గత కొద్దిరోజులుగా దస్తావేజు లేఖరులు చేపట్టిన నిరసనల నేపథ్యంలో రిజిస్ట్రేషన్ పై ప్రజల్లో అనవసరమైన అపోహలు. సందేహాలు నెలకొన్నాయని ఆయన తెలిపారు అయితే వాటిని నమ్మాల్సిన అవసరం లేదని, కార్యాలయంలో అన్ని సేవలు సజావుగా కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు సోమవారం నుండి రిజిస్ట్రేషన్ ప్రక్రియ యధావిధిగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎస్ ఆర్ ఓ. కొనుగోలు దారులు అమ్మక దారులు ఎలాంటి సంకోచం లేకుండా కార్యాలయానికి వచ్చి తమ ఆస్తుల రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. రిజిస్ట్రేషన్ కు సంబంధించిన ఏవైనా సమస్యలు, సందేహాలు ఉంటే కార్యాలయం అధికారులను నేరుగా సంప్రదిస్తే వెంటనే పరిష్కరించి సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. రిజిస్ట్రేషన్ సేవల విషయంలో ప్రజలు పుకార్లను నమ్మకుండా ప్రభుత్వం అధికారిక సేవలను వినియోగించుకోవాలని జున్నాదుల శ్రీరామ మనోహర్ విజ్ఞప్తి చేశారు.


## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కారంపూడి, జూలై 25, ప్రభాతవార్త: కారంపూడి 132/ 33 సబ్‌స్టేషన్‌లో అత్యవసరం గా కారంపూడి లైన్ లో మరమ్మతులు చేపట్టవలసివచ్చినది,,దీని వలన కారంపూడి,,గదేవారిపల్లి మరియు పెద్దగార్లపాడు,సబ్‌స్టేషన్స్ (ఉపకేంద్రాలలో ) పరిధి లోని అన్నిగ్రామాలకు విద్యుత్ సరఫరా రేపు అనగా ఆదివారం ఉదయం 9 గంటలనుండి మధ్యాహ్నం 2 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు,,తిని ఒగూరి రమణయ్య ముందస్తుగా,,ప్రకటన లో తెలియపరచుతూ,,విషయాన్ని గమనించి వినియోగదారులు మా డిపార్ట్మెంట్ వారికీ సహకరించగలరు అని కోరుకొనుచున్నామన్నారు.

## రైతులకు పగటిపూట విద్యుత్ అందించడమే ధ్యేయం: సీఎండీ పుల్లారెడ్డి

దుర్గి, జూలై 25, ప్రభాతవార్త: రాష్ట్రంలో రైతులకు పగటిపూట నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సీఎండీ పి. పుల్లారెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన దుర్గి మండల పరిధిలోని నెహ్రూ నగర్ తండా గ్రామ సమీపంలో పీఎం యోజన పథకం కింద నిర్మాణంలో ఉన్న ఆర్డీఎస్ (ఖిదీళీ) సోలార్ సిస్టం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత, ఉపయోగిస్తున్న పరికరాల వివరాలపై అధికారులతో చర్చించారు. విలేకరులతో మాట్లాడుతూ దేశీయ పరికరాలకే ప్రాధాన్యం ప్రభుత్వం లక్ష్మన్నారు, సోలార్ ప్రాజెక్టులో వాడుతున్న పరికరాలు నాణ్యమైనవేనా మరియు అవి భారతదేశానికి చెందినవేనా అని సిబ్బందిని ఆరా తీశారు. 11 ప్రాంతాల్లో పనులు: జిల్లావ్యాప్తంగా పీఎం యోజన కింద 11 చోట్ల ఒక్కొక్క యూనిట్‌ను ఒక్కొక్క ప్రత్యేక ఏజెన్సీకి అప్పగించి పనులు వేగవంతం చేసినట్లు తెలిపారు. యూనిట్ ధర సోలార్ సిస్టం పనుల కోసం ఏజెన్సీలకు యూనిట్‌కు ..3.09 పైసలు చొప్పున చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. మొదటి విడత జిల్లాలు: ఫేజ్1 లో భాగంగా ప్రస్తుతం పల్నాడు, ఎన్టీఆర్, బాపట్ల, ఒంగోలు జిల్లాల్లో పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. 3 నెలల కాలంలో 50 సబ్‌స్టేషన్లలో సోలార్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఏజెన్సీలను ఆదేశించినట్లు తెలిపారు. అంతకుముందు ఆయన ఓబులేసుని పల్లెలో నిర్మాణంలో ఉన్న విద్యుత్ ఉపకేంద్రాన్ని (సబ్‌స్టేషన్) తనిఖీ చేశారు. ఐదు నెలలైనా పనులను ఇప్పటివరకు ఎందుకు ప్రారంభించలేదని ఏజెన్సీ సిబ్బందిని తీవ్రంగా ప్రశ్నించారు. విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుంటూ నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఎండీ వెంట ఎస్సీ విజయ్ కుమార్, ప్రాజెక్ట్ డైరెక్టర్ టీవీఎస్ మూర్తి, డీఈ నాగేంద్ర నాగ సురేంద్ర కుమార్, ఏఈ సింగయ్య, విద్యుత్ శాఖ మరియు ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.





## ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మెలగాలి

పొన్నూరు, జూలై 25,ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మెలగాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు కోరారు. మానవత స్వచ్ఛంద సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మానవత సంస్థ సామాజాభివృద్ధికి చేస్తున్న సేవలను కొనియాడారు. తక్కువ కాలంలోనే అనేక మందిని సభ్యులుగా తయారు చేసుకున్న ఘనత మానవత సంస్థకే దక్కుతుందన్నారు. నూతన కార్యవర్గ సభ్యులు కూడా సమాజాభ్యుదయానికి ఉపయోగపడేవిధంగా కార్యక్రమాలు రూపొందించాలని కోరారు. నూతన అధ్యక్షుడిగా వై.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా లియాఖత్, కోశాధికారిగా ఎన్‌వి రమణ; కార్యదర్శిగా నన్నపనేని బాలకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా మాటూరి లక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా నాగమంజరి, అబ్దుల్లా, కొత్తపల్లి శివప్రసాద్, కూనల సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. వీరిని పలువురు సభ్యులు అభినందించారు.



## మోదీ ప్రభుత్వాన్ని నేలకు దించిన యువశక్తి

పొన్నూరు, జూలై 25,ప్రభాతవార్త: పుష్కర కాలంగా అనేక ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో అన్నీ వర్గాల ప్రజలను వేదిస్తూ వచ్చిన కేంద్రంలోని మోదీ సర్కార్‌ను నేలకు దిగివచ్చేలా ఈ తరం యువత తమ శక్తియుక్తులతో పోరాడిందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్ అన్నారు. కాంగ్రెస్, సీజెపి దేశవ్యాప్తంగా చేసిన పోరాటలకు దిగి వచ్చిన కేంద్ర ప్రభుత్వం ధర్మేంద్ర ప్రధాన్‌చే రాజీనామా చేయించిన నేపథ్యంలో దిలీప్ మాట్లాడారు. ఇది ముమ్మాటికి కాంగ్రెస్, సీజేపిల పోరాట ఫలితమేనన్నారు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఈ ఉద్యమానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో మద్దుగా నిలిచారన్నారు. వారందరూ ఈ విజయంలో భాగస్వాములేనన్నారు. బిజెపి తీసుకున్న తప్పుడు నిర్ణయాలను వెనక్కు తీసుకునేందుకు బిజెపి యువతపై అనేక రకాలుగా దుష్ప్రచారాలు చేసిందన్నారు. అమాయక యువతను దేశద్రోహులని, పాకిస్తాన్ ఏజెంట్లని, పెయిడ్ ఉద్యమకారులని, అయినా వెనకకు తగ్గకపోవడంతో 20వేల ఆర్ఎస్ఎస్ ఉన్మాదులకు పోలీస్ యూనిఫాం వేయించి యువతపై అత్యంత పాశవికంగా దాడికి తెగబడిందని గుర్తు చేశారు. ఈ దమన కాండకు బాధ్యత వహిస్తూ ప్రధానమంత్రి మోదీ యువతకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. యువతపై పెట్టిన కేసులన్నింటిని తక్షణమే తొలగించాలన్నారు. అమాయక యువతపై పోలీస్ సాగించిన దాష్టీకాలపై సమగ్ర విచారణ జరిపి కఠినంగా శిక్షించాలన్నారు. ఇకనైనా విద్యా వ్యవస్థ సమగ్ర పక్షాళనకై నడుంబిగించి ఇటువంటి పేపర్ లీకులు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ రాజీనామా వ్యవహారంతో మోదీ ప్రభుత్వం అవినీతి సముద్రపు ఒక్కబొట్టు మాత్రమే ప్రజలకు తెలియవచ్చిందన్నారు. ఇంకా ఇథనాల్ స్కాం, జాతీయ రహదారులు, ఫ్లైఓవర్ నిర్మాణంలోనే కూలుతున్న ఘటనలపై నితిన్ గడ్కరీ, యుద్ధ పరికరాల కొనుగోలులో జరుగుతున్న లక్షలాది కోట్ల అవినీతికి తెడబడిన రాజ్‌నాథ్ సింగ్ ఇలా రాజీనామా చేయాల్సిన మంత్రుల చిట్టా చాలా ఉందన్నారు. ఈ అవినీతి పరుల ఆట కట్టించే వరకు కాంగ్రెస్ పోరాటం ఆగదని హెచ్చరించారు.



## తెలగపాలెంలో భక్తిశ్రద్ధలతో లక్ష తులసీ దళార్చన

## జై శ్రీరామ్...జై శ్రీరామ్ నినాదాలతో హోరెత్తిన దేవాలయం

పొన్నూరు, జూలై 25,ప్రభాతవార్త: పట్టణంలోని తెలగపాలెంలో కొలువై ఉన్న శ్రీ కోదండ రామాలయంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని లక్ష తులసీ దళార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలగపాలెంలో జరుగుతున్న ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. జై శ్రీరామ్...జైజై శ్రీరామ్...అనే భక్తుల నినాదాలతో దేవాలయం మార్మోగిపోయింది. తొలుత స్వామి అమ్మవార్లకు విష్వక్సేనారాధన, వాసుదేవ, పుణ్యాహవాచనం, విశేష ద్రవ్యస్నపన, నీరాజన మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయం అర్చకస్వామి చిలకపాటి లక్ష్మణ్ రామాచార్యులు(రాము)పర్యవేక్షణలో అర్చకస్వాములు లక్ష తులసీ దళార్చనకు సంబంధించిన పూజాధికార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున తీర్థప్రసాద వినియోగం జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కమిటి సభ్యులు ఏర్పాట్లు చేశారు.



## విద్యార్థి ఐక్య యుద్ధంతో దిగొచ్చిన కేంద్రం

పొన్నూరు, జూలై 25,ప్రభాతవార్త: విద్యార్థి ఐక్య యుద్ధంతో కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పలేదని మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొందుగల చైతన్య అన్నారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ప్రభుత్వాలు తప్పులు చేస్తే ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందన్నారు. అయితే ప్రభుత్వాలు పోలీసులు, ఇతర మార్గాల ద్వారా ప్రశ్నించేవారిపై కేసులు నమోదు చేయడం, వారిని భయపెట్టడం సరైన విధానం కాదన్నారు. సుపరిపాలన అందించాల్సి బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. నీట్ పేపరు లీకుకు బాధ్యతవహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్‌ను రాజీనామా చేయాలని మొదటి నుంచి విద్యార్థిలోకం ఉద్యమించిందన్నారు. దీంతో కేంద్రం దిగిరాక తప్పలేదన్నారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిగా విద్యార్థి సంఘాలు,ప్రజా సంఘాల విజయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్, బిఎస్పీ నాయకుడు యాతాటి కిషోర్, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులున్నారు.




## గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించడమే ధ్యేయం

### -ఈశా ఫౌండేషన్ సేవలు నిరుపమానం-తమ ఆర్వీఐటీలో నిర్వహించడం సంతోషం

### -ఆర్వీఐటీ కళాశాల ఛైర్మన్ ఆర్.వంశీకృష్ణ

చేబ్రోలు(పొన్నూరు), జూలై 25,ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈశా గ్రామోత్సవం-2026నిర్వహించడం, అదీ తమ కళాశాలలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని ఆర్వీఐటీ కళాశాల ఛైర్మన్ ఆర్.వంశీకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని ఆర్వీఐటీ కళాశాలలో ఈశా గ్రామోత్సవం శనివారం అత్యంత ఘనంగా, కన్నుల పండువగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆర్వీఐటీ ఛైర్మన్ వంశీకృష్ణ మాట్లాడుతూ గ్రామీణ సంస్కృతిని, స్ఫూర్తిని పెంపొందించేదుకు ప్రతి సంవత్సరం ప్రముఖ అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఈశా పౌండేషన్ నిర్వహించే గ్రామోత్సవాలలో తాము కూడా భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపేందుకు ఈ గ్రామీణ క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. తమ కళాశాల ఆర్వీఐటీ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఎప్పుడూ సిద్దంగా ఉంటుందన్నారు. ఈశా వాలంటీర్ సాంబశివరావు మాట్లాడుతూ క్లస్టర్ లెవల్ పోటీల్లో పురుషుల విభాగంలో 40 వాలీబాల్ జట్లకు, స్త్రీల విభాగంలో 15త్రోబాల్ జట్లలో మొత్తం 400మంది క్రీడాదారులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భరతనాట్యం, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రారంభమైన ఈశా గ్రామోత్సవం స్త్రీలకు సరదా పాటలు, ఆటలు, మ్యూజికల్ చైర్స్, హరికథ, ఆట పాట డప్పులతో 800మందికి పైగా పాల్గొన్నారు. కళాశాలలో ఒక పండుగ, తిరునాళ వాతావరణం నెలకొందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వి.కృష్ణయ్య మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు గ్రామీణ స్ఫూర్తిని పెంచేందుకు దోహదపడతాయన్నారు. గ్రామీణుల్లోని క్రీడాస్ఫూర్తిని వెలికితీయవచ్చన్నారు. క్రీడాకారులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, ఈశా ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.







# టి20ల్లో జింబాబ్వేపై భారత్ యంగ్ ప్లేయర్ల రికార్డ్

## నంబర్ వన్ అభిషేక్


అభిషేక్ శర్మ


శుభమన్ గిల్


రుతురాజ్ గైక్వాడ్


కేఎల్ రాహుల్


యశస్వి జైస్వాల్

**న్యూఢిల్లీ:** టీమిండియా యంగ్ బ్రిగేడ్ అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో సంచలనాలు సృష్టిస్తోంది. జింబాబ్వేపై టీమిండియాకు అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. ముఖ్యంగా జింబాబ్వేతో జరిగిన టి20 మ్యాచ్‌లలో భారత యంగ్ బ్యాటర్లు తమ బ్యాట్‌కు పనిచెప్పి భారీగా పరుగులు సాధించారు. ఆ వికెట్లపై ఆధిపత్యం చెలాయిస్తూ జట్టుకు అద్భుతమైన విజయాలను అందించారు. జింబాబ్వేపై టి20ల్లో భారత్ తరఫున అత్యధిక రన్స్ చేసిన టాప్ 5 బ్యాటర్లలో యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ అగ్ర స్థానంలో ఉన్నాడు. అభిషేక్ జింబాబ్వేపై ఇప్పటివరకు ఆరు మ్యాచ్‌లలో 35.80 సగటుతో ఏకంగా 179 పరుగులు సాధించాడు. మెరుపు ఇన్నింగ్స్‌లతో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపిస్తూ ఈ లిస్ట్‌లో నంబర్ వన్ పొజిషన్‌ను సొంతం చేసుకున్నాడు. టీమిండియా వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ రెండో స్థానంలో నిలిచాడు. గిల్ జింబాబ్వేపై ఐదు టి20 మ్యాచ్‌లు ఆడి 170 పరుగులు చేశాడు. ఈ క్రమంలో రెండు హాఫ్ సెంచరీలు కూడా బాదాడు. మైదానంలో నిలకడగా ఆడుతూ జట్టుకు కొండంత అండగా నిలవడంలో శుభ్‌మన్ సక్సెస్ అయ్యాడు. భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ చాలా తక్కువ మ్యాచ్‌లలోనే అద్భుత రికార్డు నమోదు చేసి మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. జైస్వాల్ జింబాబ్వేపై కేవలం మూడు టి20 మ్యాచ్‌లు మాత్రమే ఆడి, ఏకంగా 141 పరుగులు రాబట్టాడు. క్రీజులోకి వచ్చిన ప్రతిసారీ వేగంగా పరుగులు సాధిస్తూ జట్టుకు మంచి ఆరంభాలు అందించాడు. క్లాస్ బ్యాటింగ్‌కు మారుపేరైన రుతురాజ్ గైక్వాడ్ ఈ లిస్ట్‌లో నాలుగో స్థానంలో ఉన్నాడు. రుతురాజ్ జింబాబ్వేపై మూడు ఇన్నింగ్స్‌లలో 66.50 సగటు, 158.33 స్ట్రైక్ రేట్‌తో మొత్తం 133 పరుగులు చేశాడు. ఇందులో ఒక హాఫ్ సెంచరీ కూడా ఉంది. బాధ్యతాయుతంగా ఆడుతూనే అవసరమైనప్పుడు బౌండరీలతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. టీమిండియా స్టార్ మిడిల్ ఆర్డర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ ఐదో స్థానంలో నిలిచాడు. రాహుల్ జింబాబ్వేపై నాలుగు టీ20 మ్యాచ్‌లు ఆడి 120 పరుగులు సాధించాడు. రాహుల్ ఖాతాలో కూడా జింబాబ్వేపై ఒక హాఫ్ సెంచరీ ఉంది. కీలక సమయంలో ఇన్నింగ్స్‌ను నిలబెట్టి జట్టును విజయం దిశగా నడిపించడంలో రాహుల్ తన మార్కు చూపించాడు.





## జింబాబ్వేతో రెండో టి20.. విక్టరీతో టీమిండియా సిరీస్ కైవసం

**న్యూఢిల్లీ:** జింబాబ్వేతో జరిగిన రెండో టి20లోనూ టీమిండియా ఘన విజయం సాధించింది. దీంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే శనివారం ఈ సిరీస్‌ను భారత జట్టు దక్కించుకుంది. టీమిండియా అందించిన 220 పరుగుల లక్ష్య ఛేదనలో జింబాబ్వే టీం కేవలం 17.5 ఓవర్లలో 129 పరుగులకే పరిమితమైంది. భారత్ తరపున యశ్ ఠాకూర్, ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్, శివమ్ దూబే, తిలక్ వర్మ, అభిషేక్ శర్మ వికెట్లు తీశారు. బ్రియన్ బెన్నెట్ (32 పరుగులు)ను ఔట్ చేయడం ద్వారా యశ్ తన తొలి టి20 వికెట్‌ను సాధించాడు. ప్రిన్స్, బెన్ కర్రన్, సికందర్ రజాలను ఔట్ చేశాడు. తడివానషే మరుమణి, న్యూమాన్ న్యామ్హురి క్రీజులో ఉన్నారు. అంతకుముందు, హరారేలో టాస్ ఓడిపోయి బ్యాటింగ్ చేసిన భారత్, 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో భారత బ్యాటర్లు రెచ్చిపోయారు. ఇషాన్ కిషన్ (44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 81), తిలక్ వర్మ (29 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 60 నాటౌట్) చెలరేగారు. దీంతో ఇండియా 20 ఓవర్లలో 5 వికెట్లకు 219 పరుగులు చేసింది. వైభవ్ సూర్యవంశీ అతి కష్టం మీద 9 బంతుల్లో 20 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఇషాన్, శ్రేయస్ అయ్యర్ (25) మూడవ వికెట్‌కు 66 పరుగులు జోడించగా, ఇషాన్, తిలక్ నాలుగవ వికెట్‌కు 94 పరుగులు జతచేశారు. జింబాబ్వే తరఫున, న్యూమాన్ న్యామ్హురి, రిచర్డ్ నగరవా, బ్రయాన్ బెన్నెట్, బ్లెస్సింగ్ ముజరబాని, సికందర్ రజా తలా ఒక వికెట్ తీసుకున్నారు. జింబాబ్వేపై బ్యాటింగ్ లో అదరగొట్టిన భారత్ ప్రపంచ రికార్డు సమం చేసింది. ఒకే క్యాలెండర్ ఇయర్ లో అత్యధిక సార్లు 200 కంటే ఎక్కువ పరుగులు చేసిన జట్టుగా నిలిచి తన ఆధిపత్యాన్ని చాటుకుంది.

## పురుషుల బాక్సింగ్.. ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు శివాచ్



**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ ప్లేయర్ సచిన్ శివాచ్ దూసుకుపోతున్నాడు. స్కాటిష్ ఈవెంట్ క్యాంపస్‌లో శనివారం జరిగిన పురుషుల 60 కేజీల రౌండ్ ఆఫ్ 32 బాక్సింగ్ బౌట్‌లో, రెండవ రౌండ్ మధ్యలో, కెనడాకు చెందిన కియోమా అల్‌అహ్మదీహ్‌పై భారత ఆటగాడు సచిన్ శివాచ్ తొలుత అలసిపోవడం ప్రారంభించినా తదుపరి పుంజుకున్నాడు. 26 యేళ్ల శివాచ్ తీవ్రంగా పోరాడి 4-1 తేడాతో స్ప్లిట్ డెసిషన్ విజయాన్ని నమోదు చేసి ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు, అక్కడ అతను ఇంగ్లాండ్‌కు చెందిన విలియం హెవిట్‌ను ఎదుర్కొంటాడు. మాజీ కామన్వెల్త్ యూత్ గేమ్స్ ఛాంపియన్ సచిన్, తన తొలి దాడి అయిన రైట్ హుక్‌నుగురితప్పాడు. కానీ ఆ కెనడియన్ దానిని వేగంగా తప్పించుకున్నాడు. దానికి ప్రతిస్పందనగా కెయోమా, సచిన్ ముఖంపై కుడి చేతితో ఒక పంచ్ విసిరాడు. అయితే, ఆ భారత ఆటగాడు పోటీలో కుదురుకుని, రెండు చేతులతో పదునైన ఎదురుదాడి చేసి తిరిగి పట్టు సాధించి, హోరాహోరీగా సాగిన తొలి రౌండ్‌లో 3-2 తేడాతో విజయం సాధించాడు. మొదటి రౌండ్‌లో ఓడిపోయిన తర్వాత కోలుకోవాలని చూస్తున్న కియోమా, రెండవ రౌండ్‌లో వేగాన్ని పెంచాడు. ఒత్తిడిలో కూడా సచిన్ నిలకడగా ఉంటూ, అనేక దాడులను తప్పించుకుని, ఎదురుదాడిలో కచ్చితమైన కాంబినేషన్ల వర్షం కురిపించాడు. అతని క్రమశిక్షణకు ఐదుగురు న్యాయనిర్ణేతల నుండి ఏకగ్రీవంగా 10-9 తీర్పు లభించి, అతను ఆ రౌండ్‌ను 5-0తో గెలుచుకున్నాడు. మూడవ రౌండ్ కూడా హోరాహోరీగా సాగింది.



## స్కాటిష్ ఓపెన్‌లో.. పుంజుకున్న దీక్షా దాగర్

**న్యూఢిల్లీ:** భారత క్రీడాకారిణి దీక్షా దాగర్, స్కాటిష్ ఓపెన్‌లో కష్టమైన ఆరంభం తర్వాత అద్భుతంగా పుంజుకుంది. మొదటి రౌండ్‌లో రెండో ఓవర్ 74 స్కోరుతో 33వ స్థానంలో నిలిచి పటిష్టంగా నిలుపుకుంది. స్కాట్‌లాండ్‌లో శనివారం జరిగిన ఈ గోల్ఫ్ టోర్నమెంట్‌లో డండొనాల్డ్ లింక్స్‌లో సవాలుతో కూడిన పరిస్థితులలో ఆడుతూ, 10 హోల్స్ పూర్తయ్యేసరికి ఆరు ఓవర్‌కు పడిపోయిన తర్వాత దీక్ష అద్భుతంగా కోలుకుంది. తక్కువ స్కోర్లు సాధించడం కష్టంగా ఉన్నా, ఈ 24 యేళ్ల క్రీడాకారిణి తన చివరి ఎనిమిది హోల్స్‌లో నాలుగు బర్డీలు సాధించి, పోరాడి 74 స్కోరుతో ముగించింది. ఆమె రౌండ్‌లో మొదటి, రెండవ, నాల్గవ హోల్స్‌లో బోగీలు చేసి, ఆ తర్వాత ఏడవ హోల్‌లో బర్డీ సాధించింది. ఎనిమిదవ హోల్‌లో ట్రిపుల్ బోగీ, 10వ హోల్‌లో మరో బోగీ ఆమెను బాగా వెనుకబడేలా చేశాయి. కానీ 11, 14, 17, 18వ హోల్స్‌లో చేసిన బర్డీలు అద్భుతమైన పునరుద్ధరణకు దారితీశాయి. ఈ సీజన్‌లో లేడీస్ యూరోపియన్ టూర్‌లో ఇప్పటికే నాలుగు సార్లు టాప్10లో నిలిచిన దీక్ష, ఈ పోటీలో పాల్గొన్న ముగ్గురు భారతీయ గోల్ఫర్లలో అత్యుత్తమ స్థానంలో నిలిచింది. ఇక ప్రశాంత్ 8 ఓవర్లలో 80 స్కోరుతో తడబడి 116వ స్థానంలో నిలవగా, ప్రణవి ఉర్స్ 12 ఓవర్లలో 84 స్కోరు చేసి తొలి రోజును 138వ స్థానంతో ముగించింది. లీడర్‌బోర్డ్ లో దక్షి ణ కొరియాకు చెందిన జెన్నీ షిన్, అమెరికాకు చెందిన లారెన్ కఫ్లిన్ 6అండర్ 66 స్కోరుతో సంయుక్తంగా అగ్రస్థానాన్ని పంచుకున్నారు. మరో దక్షి ణ కొరియా క్రీడాకారిణి, ఎ లిమ్ కిమ్, 5అండర్ 67 స్కోరుతో మూడవ స్థానం, జర్మనీకి చెందిన ఎస్తేర్ హెన్సెలీట్, జపాన్‌కు చెందిన ఎరికా హారా, మియు యమషిత, స్వీడన్‌కు చెందిన అన్నా నార్డ్‌క్విస్ట్ 3అండర్ 69 స్కోరుతో ఐదవ స్థానాన్ని పంచుకున్నారు.

## మహిళల పెయిర్స్ బౌల్స్‌లో.. టోంగాను ఓడించిన భారత్



**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్ 2026లో భాగంగా లాన్ బౌల్స్ మహిళల పెయిర్స్ ఈవెంట్‌లో రూపారాణి తిర్కే, పింకీ సింగ్ జోడీ ట్రైబ్రేక్‌లో టోంగాపై విజయం సాధించి వరుసగా మూడో గెలుపును నమోదు చేసింది. ఈ కామన్వెల్త్ గేమ్స్ 2026లో భాగంగా జరుగుతున్న సెక్షనల్ ప్లేలో ట్రైబ్రేక్‌లో శనివారం టోంగాను ఓడించినతర్వాత, భారతబౌల్స్ మహిళల జంట జట్టు రూపా రాణి టిర్కీ-పింకీ సింగ్ తమ విజయ పరంపరను కొనసాగించారు. ఈ భారత జంట తొలి సెట్‌ను 5-2తో గెలుచుకుని, రెండో సెట్‌ను 4-6 తేడాతో కోల్పోయింది. కానీ ట్రైబ్రేక్‌లో ఒత్తిడిలో కూడా పింకీ అద్భుతంగా ఆడి, ప్రత్యర్థులపై తమ జట్టు విజయం సాధించడంలో సహాయపడింది. ట్రైబ్రేకర్‌లో భారత్ 2-0తో టోంగాను ఓడించి మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. మహిళల పెయిర్ సెక్షనల్ ప్లేలో భారత్‌కు ఇదివరుసగా మూడోవిజయం. దీనికి ముందు మాల్టా, దక్షిణాఫ్రికాలను ఓడించిన భారత్, ఇప్పుడు మూడు మ్యాచ్‌లలో ఓటమి ఎరుగని ఇంగ్లాండ్ వెనుక రెండో స్థానంలో నిలిచింది. ఈ సెక్షన్ నుండి సెమీఫైనల్స్‌కు ఒకే జట్టు మాత్రమే వెళ్తుంది కాబట్టి, తమ చివరి సెక్షనల్ మ్యాచ్‌లో తలపడనున్న భారత్, ఇంగ్లాండ్ జట్లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకునేందుకు సిద్ధమవుతున్నాయి.

## మార్కెట్‌లోకి ఎనిమిది కొత్త ఫండ్ ఆఫర్స్

**ముంబయి,జులై 25:** మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేసే ఇన్వెస్టర్లకోసం ప్రస్తుతం మార్కెట్లో 8 కొత్త న్యూ ఫండ్ ఆఫర్స్ సబ్‌స్క్రిప్షన్‌కు తెరిచి ఉన్నాయి. ఈఫండ్ల ద్వారా అసెట్ మేనేజ్మెంట్ కంపెనీలు తమ ప్రొడక్ట్ పోర్ట్ ఫోలియోను విస్తరించడంతో పాటు ఇన్వెస్టర్లకు కూడా కొత్త పెట్టుబడి అవకాశాల్ని అందిస్తున్నాయి. ఈ ఎన్‌ఎఫ్ఒల్లో ఇటిఎఫ్‌లు, ఫ్లెక్సీ క్యాప్, లార్జ్ అండ్ మిడ్ క్యాప్, మిడ్ క్యాప్, సెక్టోరల్ ఫండ్స్, ఫండ్ ఆఫ్ ఫండ్స్, ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్స్ వంటి విభిన్న కేటగిరీలు ఉన్నాయి. కొన్ని స్కీమ్‌ల్లో కేవలం రూ. 100 తోనే పెట్టుబడి ప్రారంభించే అవకాశం ఉండటం విశేషం. ప్రస్తుతం సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉన్న ఎన్‌ఎఫ్ఒల్లో ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ బీఎస్ఈ ఇన్సూరెన్స్ ఇటిఎఫ్ ఇది ఇటిఎఫ్ కేటగిరీకి చెందినది. ఈనెల 28 ఇక్కడ లాస్ట్ డేట్. ఇందులో కనీసం రూ.1000 పెట్టుబడితో చేరొచ్చు. ఎడెల్‌వీస్ బిఎస్ఇ టాప్ 10 బ్యాంక్ ఇటిఎఫ్ ఇది కూడా ఇటిఎఫ్ కేటగిరీకి చెందినదే. ఈనెల 30 లాస్ట్ డేట్. కనీసం రూ. 100 తోనే చేరొచ్చు. ఆల్ఫాగ్రెప్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ కేటగిరీ ఫండ్‌లో చేరేందుకు ఆగస్ట్ 4ఆఖరి తేదీ . ఇందులో కనీస పెట్టుబడి రూ. 5 వేలుగా ఉంది. అబాక్కస్ లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్ ఈనెల 29 లాస్ట్ డేట్. కనీస పెట్టుబడి రూ. 5 వేలు. ది వెల్త్ కంపెనీ మిడ్ క్యాప్ ఫండ్‌లో చేరేందుకు ఆఖరి తేదీ ఈనెల 29గానే ఉండగా కనీసం రూ. 1000 పెట్టుబడితో చేరొచ్చు.

## 676.24 బిలియన్ డాలర్లకు పెరిగిన ఫారెక్స్ ఖజానా




**ముంబయి,జులై 25:** దేశ విదేశీ మారక నిల్వలు ఈనెల 17తో ముగిసిన వారంలో 1.08 బిలియన్ డాలర్లు పెరిగి 676.237 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని ఆర్బీఐ డేటా విడుదలచేసింది. అంతకుముందు వారంలో కూడా ఫారెక్స్ నిల్వలు 964 మిలియన్ డాలర్లు పెరిగి 675.157 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో దేశ విదేశీ మారక నిల్వలు రికార్డు స్థాయిలో 728.494 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అనంతరం మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు ప్రారంభం కావడంతో రూపాయిపై ఒత్తిడి పెరిగింది. రూపాయి విలువను స్థిరీకరించేందుకు ఆర్‌బీఐ డాలర్ల విక్రయాల ద్వారా విదేశీ మారక మార్కెట్లో జోక్యం చేసుకోవాల్సి రావడంతో ఫారెక్స్ నిల్వలు వరుసగా తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో విదేశీ మారక నిల్వలను కాపాడేందుకు ప్రధాని నరేంద్ర మోడీ మే 11 నుంచి పలుమార్లు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. విదేశీ పర్యటనలను తగ్గించుకోవడం, ఇంధన వినియోగాన్ని పరిమితం చేయడం, యేడాది పాటు బంగారం కొనుగోళ్లను తగ్గించడం ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆర్‌బిఐ వివరాల ప్రకారం, ఈనెల 17తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వల్లో కీలక భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 4.549 బిలియన్ డాలర్లు పెరిగి 551.057 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. డాలర్ల పరంగా లెక్కించే విదేశీ కరెన్సీ ఆస్తుల్లో యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికాతర కరెన్సీల విలువల్లో వచ్చిన పెరుగుదల లేదా తగ్గుదల ప్రభావం కూడా ప్రతిబింబిస్తుందని ఆర్‌బిఐ పేర్కొంది. దేశ బంగారం నిల్వల విలువ 3.48 బిలియన్ డాలర్లు తగ్గి 101.749 బిలియన్ డాలర్లకు చేరింది. మరోవైపు స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 44 మిలియన్ డాలర్లు పెరిగి 18.67 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఆర్‌బిఐ వెల్లడించింది. అదే సమయంలో అంతర్జాతీయ ద్రవ్య నిధి ఐఎంఎఫ్ వద్ద భారత్‌కు ఉన్న రిజర్వ్ పొజిషన్ 32 మిలియన్ డాలర్లు తగ్గి 4.761 బిలియన్ డాలర్లకు చేరింది.

## మణిపాల్ హెల్త్ భారీ ఐపిఒ

### రూ.9,275 కోట్ల సమీకరణ




**ముంబయి,జులై 25:** భారత్‌లో ఇష్యూ పరిమాణం పరంగా అతిపెద్ద హెల్త్‌కేర్ ఐపిఒను మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్ ఈనెల 29న ప్రారంభించనుంది. ఈ ఐపిఒ ద్వారా కంపెనీ రూ.9,275.22 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఒక్కో షేరు ధరను రూ.560-590 మధ్య నిర్ణయించింది. టెమాసెక్ మద్దతు ఉన్న ఈ ఆస్పత్రుల సంస్థ, గరిష్ఠ ధర బ్యాండ్ వద్ద సుమారు రూ.77,607 కోట్ల మార్కెట్ విలువను పొందనుంది. ఈ ఐపిఒ జులై 31న ముగియనుండగా, యాంకర్ ఇన్వెస్టర్ల కోసం 28న ప్రత్యేకంగా బిడ్డింగ్ నిర్వహించనున్నారు. ఈ ఐపిఒలో రూ.8వేల కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్ల జారీ, గరిష్ఠ ధర వద్ద రూ.1,275.22 కోట్ల విలువ చేసే 2.161 కోట్ల షేర్ల ఆఫర్ ఫర్ సేల్ ఉంటుంది. ప్రమోటర్లైన ఇంపీరియస్ హెల్త్‌కేర్ ఇన్వెస్ట్‌మెంట్స్, మణిపాల్ ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ గ్రూప్ ఇండియా, టిజిపి ఎస్‌జి మ్యాగజైన్, సెవెంటీ సెకండ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ, అమ్మార్ ఎస్‌డిఎన్ బిహెచ్‌డీ, నోవో హోల్డింగ్స్ ఇన్వెస్ట్ ఏషియా, ఫీనిక్స్ బేర్ ఇన్వెస్ట్‌మెంట్స్ తమ వాటాల్లో కొంత భాగాన్ని ఒఎఫ్‌ఎస్ ద్వారా విక్రయించనున్నాయి. ఫ్రెష్ ఇష్యూ ద్వారా వచ్చే నిధుల్లో రూ.5,552.8 కోట్లను అనుబంధ సంస్థ మణిపాల్ హాస్పిటల్స్ తీసుకున్న రుణాలు మరియు వాటిపై ఉన్న వడ్డీని చెల్లించడానికి వినియోగించనున్నారు. మరో రూ.574 కోట్లను స్టెప్‌డౌన్ అనుబంధ సంస్థ సహ్యాద్రి హాస్పిటల్స్‌లో మైనారిటీ వాటా కొనుగోలుకు కేటాయించగా, మిగిలిన మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నారు. లిస్టింగ్ అనంతరం ప్రధానంగా విస్తరణపైనే దృష్టి సారిస్తామని మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ దిలీప్ జోస్ తెలిపారు. ప్రస్తుతం గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల ద్వారా సుమారు 3,000 పడకల సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ఇవి వచ్చే మూడు సంవత్సరాల్లో అందుబాటులోకి వస్తాయని చెప్పారు. అవకాశాలు వచ్చినప్పుడు మాత్రమే కొత్త ఆస్పత్రుల కొనుగోళ్లను పరిశీలిస్తామని, ప్రస్తుతం సహ్యాద్రి హాస్పిటల్స్ సమీకరణ పూర్తి చేయడం, ఇప్పటికే ఉన్న నెట్‌వర్క్‌లో పడకల వినియోగాన్ని మరింత పెంచడంపైనే ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

2026 మార్చి 31 నాటికి మణిపాల్ హెల్త్ దేశవ్యాప్తంగా 49 ఆస్పత్రులను నిర్వహిస్తూ, 13,037 లైసెన్స్ పొందిన పడకల సామర్థ్యాన్ని కలిగి ఉంది. కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 2024లో రూ.6,171.6 కోట్ల నుంచి 2026లో రూ.10,335.8 కోట్లకు పెరిగింది. ఇదే కాలంలో నికర లాభం రూ.533.2 కోట్ల నుంచి రూ.916.5 కోట్లకు పెరిగింది.

## పెండింగ్ ఐటి అప్పీళ్ల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి: నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ,జులై 25:** దేశంలో పెండింగ్‌లో ఉన్న పన్ను అప్పీళ్ల పరిష్కార ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు అధికారులను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదేశించారు. ప్రస్తుతం పరిష్కారం కాని పన్ను వివాదాల్లో రూ.5 లక్షల కోట్లకు పైగా మొత్తం చిక్కుకుపోయిందని ఆమె పేర్కొన్నారు. సీనియర్ ఆదాయపన్ను అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడిన నిర్మలా సీతారామన్, పెండింగ్ అప్పీళ్ల సంఖ్య తగ్గుతున్నప్పటికీ ఆ ప్రక్రియ ఆశించినంత వేగంగా లేదని వ్యాఖ్యానించారు. పెండింగ్ కేసుల నిర్వహణను సమీక్షించి, మరిన్ని అప్పీళ్లను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పన్ను సంబంధిత వ్యాజ్యాలను తగ్గించడం, పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడం సిబిడిటి అత్యంత ప్రాధాన్య అంశాల్లో ఒకటిగా కొనసాగాలని ఆమె స్పష్టం చేశారు. పన్ను చెల్లింపుదారులకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరాన్ని కూడా మంత్రి నొక్కి చెప్పారు. పన్ను శాఖతో వ్యవహరించిన తర్వాత చాలా మంది పన్ను చెల్లింపుదారులు అసంతృప్తితో వెళ్తున్నారని పేర్కొంటూ, ఆ పరిస్థితిని మార్చే బాధ్యత అధికారులదేనని అన్నారు. పన్ను చెల్లింపుదారులు దేశ అభివృద్ధికి భాగస్వాములు. వారికి తగిన గౌరవం ఇవ్వాలని అన్నారు. పన్ను చట్టాల అమలులో అతిగా కఠినంగా వ్యవహరించడం గానీ, అత్యంత సడలింపు చూపించడం గానీ సరైన విధానం కాదని హెచ్చరించారు. స్వచ్ఛంద పన్ను చెల్లింపులను మరింత ప్రోత్సహించడం, పన్ను చెల్లింపుదారులకు సులభమైన విధానాలను అమలు చేయడం, పన్ను వ్యవస్థలో స్పష్టత మరియు విశ్వసనీయతను పెంచడం వంటి అంశాలపై పైనా సిబిడిటి ప్రత్యేక దృష్టి సారించాలని నిర్మలా సీతారామన్ సూచించారు.

## ఇక దేశవ్యాప్తంగా సికెవైసి

### ఒకే కస్టమర్ ఐడితో అన్ని సేవలు:ఆర్బీఐ కసరత్తులు




**ముంబయి,జులై 25:** ఆర్బీఐ,స్టాక్‌మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ, బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డిఏలు సంయుక్తంగా అమలు చేస్తున్న సెంట్రల్ కెవైసి 2.0తో ఇకపై దేశంలోని బ్యాంకులు, బీమా సంస్థలు, మ్యూచువల్ ఫండ్ సంస్థలు కూడా ఒకే కస్టమర్ ఐడీని వినియోగించే వీలు కల్పిస్తున్నాయి. ప్రస్తుతం ఒక ఆర్థిక సంస్థలో కెవైసి పూర్తి చేసినా, మరో సంస్థలో కొత్తగా మళ్లీ అదే ప్రక్రియ చేయాల్సి వస్తోంది. కొత్త సీకేవైసీ 2.0 అమల్లోకి వస్తే తర్వాత కస్టమర్ ఒకసారి మాత్రమే కెవైసి చేస్తే సరిపోతుంది. తర్వాత వేరే బ్యాంకు లేదా బీమా సంస్థ లేదా ఇతర ఏదైనా ఆర్థిక సంస్థలో అకౌంట్ తెరవాలంటే కస్టమర్ అనుమతితో కేంద్ర రిజిస్ట్రీనుంచి నేరుగా వివరాల్ని పొందగలుగుతాయి. బ్యాంకులు, ఇన్సూరెన్స్ సంస్థలు ఈ వ్యవస్థను ఆగస్ట్ నుంచే దశలవారీగా అమలు చేయనున్నాయి. మ్యూచువల్ ఫండ్ సంస్థలు, బ్రోకరేజీ కంపెనీలు కూడా ఈ సంవత్సరం చివరి నాటికి ఈ విధానంలో చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దేశంలో ఇప్పటికే 120 కోట్లకుపైగా సికెవైసి రికార్డ్స్ ఉన్నప్పటికీ డేటాలో డూప్లికేట్లు, అసంపూర్తి సమాచారం వంటి కారణాలతో వాటి వినియోగం మాత్రం పరిమితంగానే ఉంది. బ్యాంకులు ఆ డేటాను పూర్తిగా స్వీకరించకపోవడంతో కస్టమర్లు మాత్రం ప్రతిసారీ ప్రతి సంస్థకు వేర్వేరుగా కెవైసి చేయాల్సి వస్తోంది. ఆధార్ తరహా 14 అంకెల నంబర్‌ను ఆర్బీఐ జారీచేస్తుండటంతో ఇక కెవైసి తిప్పలుండవు. సికెవైసి 2.0లో మాత్రం ప్రతి రికార్డుకూ కాన్ఫిడెన్స్ స్కోర్ ఉంటుంది. ఆ సమాచారం ఎంత వరకు ధ్రువీకరించిందో తెలుస్తుంది. ఇంకా ఏయే సంస్థ ఆవివరాల్ని వెరిఫై చేసిందో కూడా సమాచారం ఉంటుంది. దీంతో డేటాపై నమ్మకంపెరగడంతోసహ మోసాల్నికూడా గుర్తించడం ఈజీ అవుతుందని నియంత్రణ సంస్థలు భావిస్తున్నాయి.

SIDCO
SMALL INDUSTRIES DEVELOPMENT COUNCIL
REQUIREMENT
SPECIAL SERVICE AND EMPLOYMENT OPPORTUNITIES
SMALL INDUSTRIES DEVELOPMENT COUNCIL INVITES APPLICANTS FORTHE POST OF DIRECTOR/SUPERVISOR/TEACHER IN ALL DISTRICTS/BLOCKS AND PANCHAYAT'S LEVEL.

| | | | |
|---|---|---|---|
| 1 | DISTRICT MANAGING DIRECTOR | MALE | QUALIFICATION - GRADUATE |
| 2 | BLOCK DIRECTOR | MALE | QUALIFICATION - INTERMEDIATE |
| 3 | PANCHAYAT DEVELOPMENT MANAGER | MALE | QUALIFICATION - MATRICULATION |
| 4 | DISTRICT SUPERVISOR | FEMALE | QUALIFICATION - GRADUATE |
| 5 | BLOCK SUPERVISOR | FEMALE | QUALIFICATION - INTERMEDIATE |
| 6 | PANCHAYAT TEACHER | FEMALE | QUALIFICATION - MATRICULATION |

NOTE: CANDIDATES HAVING NTT/PTT/PPTTC WILL BE GIVEN PREFERENCE FOR PANCHAYAT TEACHER
STATE OFFICE:
Saai Priya Apts, Jaffar Ali Bagh,
Somajiguda, Raj Bhavan Road, Hyderabad - 500082
Mobile No: 9151986284, 9151986283, 9968226986
Office No: 9511115219 (This number available for office)
Email ID: info@sidcobharat.com, delhi@sidcobharat.com
Website: www.sidcobharat.com
Toll-Free No: 1800 212 6811 | Tel. No.011-41328096 | Website - www.sidcobharat.com

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14